www.peoplesnews.in

హైదరాబాద్

# పీపుల్స్ న్యూస్

ప్రజల గొంతుక...

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 14 సంచిక : 319 బుధవారం, జూలై 30, 2025, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400



## కాలుష్య రహిత నగరంగా

# హైదరాబాద్

### 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు

### పాతికేళ్ల అవసరాలకు తగ్గట్లుగా ప్రణాళికలు రూపొందించాలి

### మెట్రో పనులను వేగవంతం చేయాలి

### ఎంఏయూడి సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జూలై 29:** హైదరాబాద్‌ని కాలుష్యరహితంగా మార్చేందుకు అవసరమైన సంస్కరణలు తీసుకురావాలని అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వచ్చే 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారంరాష్ట్ర సచివాలయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం మిగతాది 2లో...

## కాల్పుల విరమణలో మూడో దేశం

# జోక్యం లేదు



### ట్రంప్ మధ్యవర్తిత్వ ప్రకటనను తోసిపుచ్చిన మోడీ

### ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రమూకలకు బుద్ది చెప్పాం

### సిందూర్‌లో త్రివిధ దళాలు సత్తా చాటాయి

### కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేసిన త్రివిధ దళాలు

### ఆపరేషన్‌పై కాంగ్రెస్, విపక్షాల తీరు దారుణం

### సైన్యం స్థయిర్యం దెబ్బతినేలా వ్యాఖ్యాలు

### హెడ్‌లైన్స్‌లో ఉండేలా చేస్తున్న వారికి ప్రజల్లో స్థానం లేదు

### ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో ప్రధాని మోడీ సమాధానం

**న్యూఢిల్లీ, జులై 29:** 'ఆపరేషన్ సిందూర్'పై లోక్‌సభలో రెండో రోజు చర్చలు వాడీవేడీగా సాగాయి. ప్రతిపక్షం సంధించిన ప్రశ్నలకు ప్రధాన పక్షమైన మోడీ బృందం దీటు గా బదులిచ్చింది. మంగళవారం జరిగిన చర్చలో ప్రధాని నరేంద్ర మోడీ సహా హెూం మత్రి అమిత్ షా ప్రతిపక్షాల అభ్యంతరాలను కొట్టిపారే శారు. సభ్యులందరి సమక్షంలో కాల్పుల విరమణలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రమేయం లేదని మోడీ స్పష్టం చేశారు. ఆపరే షన్ సిందూర్‌లో భారత సైన్యం పాకిస్థాన్‌కు వణుకు పుట్టించిందని ప్రధాని మిగతా2లో...



# పదండి ప్రజల్లోకి..

### స్థానిక ఎన్నికల్లో గెలిచి తీరాల్సిందే: మీనాక్షి నటరాజన్

**హైదరాబాద్,జూలై29:** 'స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం స్థానాల్లో విజయం సాధించాల్సిందేనని ..' ఏఐసిసి నాయకురాలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ పార్టీ నాయకులకు, మిగతాది 2లో...

## భూ వివాదం కేసులో రేవంత్ రెడ్డికి

# ఊరట

### పెద్దిరాజు తదితరులు వేసిన పిటిషన్ తిరస్కరణ

### ఫిర్యాదుదారుకు కోర్టు నోటీసులు



**న్యూఢిల్లీ,జూలై29:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. భూవివాదం కేసులో ఎన్ పెద్దిరాజు వేసిన కేసులో.. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు క్వాష్ చేసింది.అయితే హై కోర్టు ఆదేశాలపై ఎన్ పెద్దిరాజు సుప్రీం కోర్టులో సవాలు వేశారు. ఈ కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ సుప్రీంను మిగతాది 2లో...

## రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను

# ఆధునికరిస్తాం

### ప్రాజెక్టుల్లో పేరుకున్న పూడికను తొలగిస్తాం

### 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న సాగర్

### మంత్రి అడ్లూరితో కలసి సాగర్ గేట్లు ఎత్తిన మంత్రి ఉత్తమ్



**నాగార్జునసాగర్,జూలై29:** రాష్ట్రం లోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తామని, అలా గే పూడిక తీస్తామని ,రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ,మైనారిటీ సంక్షేమ శాఖల మిగతాది 2లో...

# కాళేశ్వరం నివేదిక సిద్ధం

### సీల్డ్ కవర్‌లో సిద్ధం చేసిన పిసి ఘోష్ కమిషన్

### త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించే అవకాశం



**హైదరాబాద్,జూలై29:** కాళేశ్వరం కమిూషన్ నివేదికను పీసీ ఘోష్ కమిషన్ త్వరలోనే ప్రభుత్వంకు ఇవ్వనుందని తెలుస్తోంది. ప్రస్తుతం కాళేశ్వరం కమిషన్ నివేదికను సీల్డ్ కవర్‌లో ఉంచారు. దాదాపు 500 పేజీలతో తుది నివేదికను కమిషన్ ఇవ్వనుంది. 3 వేల పేజీలతో మొత్తం డాక్యుమెంట్‌ను సిద్ధం చేసిన ట్లు తెలుస్తోంది. ఆగస్టు ఒకటి లేదా రెండో తేదీన నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి నివే దికను స్వీకరించి..ప్రభుత్వానికి మిగతాది 2లో...



## గోదావరి నదీ యాజమాన్య బోర్డు చైర్మన్‌గా బి.పి పాండే

**హైదరాబాద్,జూలై29:** కేంద్ర ప్రభుత్వం గోదావరి నదీ యాజమాన్య బోర్డు చైర్మన్‌గా బి.పి.పాండే నియమిస్తూ కేంద్ర జలశక్తి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మిగతాది 2లో...

## రాష్ట్ర రైతాంగ సంక్షేమం కోసం రాజీలేని

# పోరాటాలు చేయాలి : కేసీఆర్



**హైదరాబాద్,జూలై29:** రాష్ట్ర ప్రభుత్వం విఫలమైన నేపథ్యంలో రాష్ట్ర రైతాంగ సంక్షేమం కోసం.. వ్యవసాయ సంక్షోభాన్ని నివారించడం కోసం.. రాజీ లేని పోరాటాలు మరింత ఉద్మృతం చేయాలి అని బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ సాగునీటి రంగాన్ని ఆగం చేసే దిశగా.. ఆంధ్రా ప్రభుత్వం నిర్మించ నున్న బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ నిలువరించాల్సిందే అని కేసీఆర్ తేల్చిచెప్పారు. అందుకు బీఆర్ఎస్ పార్టీ మిగతాది 2లో...

## 20 నెలల్లోనే కాంగ్రెస్‌పై

# తీవ్ర వ్యతిరేకత..



### స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి : కేటీఆర్

**రాజన్న సిరిసిల్ల,జూలై29:** 20 నెలల కాల వ్యవధిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకత మూటగట్టు కుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. సిరిసిల్లలో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు.మీ అందరిలో ఒకడిగా ఉంటాను. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ కు మంచిరోజులు రాబోతున్నయి. ఇప్పుడు ప్రజలకు కేసీఆర్ విలువ తెలుస్తుంది. స్థానిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త పట్టుదలతో పని చేయాలి. బూత్ స్థాయిలో మెజారిటీ తీసుకురావాలి. ఎంత పెద్ద నాయకుడైన ఊర్లో మెజారిటీ తీసుకురావాలి. చినుకు చినుకు కలిసి వరద అయినట్లు ప్రతి ఒక్క ఓటును రాబట్టుకోవాలి. పోయిన కాడనే వెతుక్కోవాలి.. మళ్లీ గులాబీ జెండా ఎగురవేయాలి. ప్రతి ఒక్కరికి సమాధానం చెప్పాలంటే ప్రతి సీటు గెలవాలి అని కేటీఆర్ మిగతాది 2లో...

## యూరియాపై ప్రభుత్వం

# తప్పుడు లెక్కలు

### లెక్కకు మిక్కలిన యూరియా ఎక్కడుంది

### ప్రభుత్వం తక్షణమే జవాబు చెప్పాలి

### జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా సున్నా

### ఖమ్మం ఇక బిజెపి అడ్డా కాబతోంది

### బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ దోబూచులాల

### జిల్లా పర్యటనలో కార్యకర్తల సమావేశంలో బిజెపి అధ్యక్షుడు రామ్



**ఖమ్మం,జూలై29:** తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం అందజేస్తున్న యూరియా లెక్కలకు సంబంధించి రేవంత్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు ఆరోపించారు. తెలంగాణకు ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటివరకు 6.14 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాని కేంద్రప్రభుత్వం అందజేసిందని స్పష్టం చేశారు. మిగతాది 2లో...

## కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో పలు కీలక అంశాలపై చర్చించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబులింగ్‌లని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గ నిర్దేశం చేశారు. కోర్ అర్బన్ రీజియన్‌లో కాలుష్య నియంత్రణకు శాశ్వత పరిష్కారం చూపాలని.. ఇందుకు సంబంధించి ఢిల్లీ, బెంగళూరు, చెన్నై లాంటి నగరాల్లో సమస్యలను అధ్యయనం చేయాలని దిశానిర్దేశర చేశారు. హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రాకుండా పరిష్కార మార్గాలను సిద్ధం చేయాలని సూచించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## కాల్పుల విరమణలో మూడో దేశం జోక్యం లేదు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు.' దయచేసి దాడులు ఆపండి' అని పాక్ డీజీఎంఓ మన డీజీఎంఓను వేడుకోవడంతోనే కాల్పుల విరమణకు అంగీకరించామని సభకు మోడీ వివరించారు. భారత్, పాకిస్థాన్ యుద్ధం విరమణలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాత్ర లేదని ప్రధాని ధైర్యంగా చెప్పాలని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. మోడీకి దమ్ముంటే ట్రంప్ అబద్ధాలకోరు అని సభా వేదికగా చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేత సవాల్‌ను స్వీకరించిన మోడీ తమకు యుద్ధం ఆపాలని ఏ దేశాధినేత చెప్పలేదని స్పష్టం చేశారు. అంతేకాదు ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తనకు మూడు నాలుగు సార్లు కాల్ చేసి.. పాక్ భారీ దాడికి సిద్ధమవుతోందని హెచ్చరించారని మోదీ అంగీకరించారు. కానీ, తాను మాత్రం మేము పాక్‌కు దీటుగా బదులిస్తామని ఆయనతో చెప్పినట్టు ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. **ఆ పార్టీ కారణంగానే..** ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచం మద్దతు తమకు లభించిందని, కానీ కాంగ్రెస్ మద్దతు లభిచండం లేదని మోడీ అన్నారు. అంతేకాదు ఆ పార్టీ కారణంగానే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కోల్పోయామని ఆయన విమర్శించారు. పీఓకే ఒక్కటే కాదు సింధు జలాల ఒప్పందం కూడా కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని, మాజీ ప్రధాని నెహ్రూ పాకిస్థాన్‌కు డ్యాంలు కట్టుకునేందుకు డబ్బులు కూడా పంపారని మోడీ ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక స్వదేశీ పరిజ్ఞానంతో క్షిపణి వ్యవస్థను పటిష్టం చేశామని ప్రధాని సభికులకు తెలియజేశారు. ఆపరేషన్ సిందూర్‌తో దాయాదికి భారత్ మూడు విషయాల్ని చాలా స్పష్టంగా అర్థమయ్యేలా చేసిందని మోడీ అన్నారు. ఒకవేళ భారత్‌పై ఉగ్రదాడికి పాల్పడితే.. మేము మాదైన స్టయిల్లో.. సమయం చూసుకొని బదులిస్తాం. మా వద్ద అణ్వాయుధాలు ఉన్నాయని పాక్ చేసే బ్లాక్ మెయిల్స్‌కు మేము వెరవం. ఇక మూడోది.. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే ప్రభుత్వాన్ని.. ఉగ్రవాదులను మేము వేర్వేరుగా చూడము అని మోదీ పేర్కొన్నారు.

## పదండి ప్రజల్లోకి..

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ నాయకులను, కార్యకర్తలు ఆమె పరుగులు పెట్టిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 31 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకూ తొలి విడత పాదయాత్ర, పల్లె నిద్ర, శ్రమదానం చేయడానికి త్రిముఖ వ్యూహాన్ని ఆమె ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యే క్వార్టర్‌లో సమావేశమయ్యారు. పది ఉమ్మడి జిల్లాల పార్టీ ఇన్‌ఛార్జిలు, పార్లమెంటు వారీగా నియమితులైన ఇన్‌ఛార్జిలుగా నియమితులైన ఉపాధ్యక్షులు, పిసిసి ప్రధాన కార్యదర్శులు, జిల్లా పార్టీ అధ్యక్షులూ హాజరయ్యారు. అయితే ఆమె జిల్లాల వారీగా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పాదయాత్రలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలని, జన సమీకరణ, భారీ ఏర్పాట్లు, పెద్ద ఎత్తున కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం గురించి మీనాక్షి సూచన చేశారు. 31న రంగారెడ్డి జిల్లా పరిగిలో సాయంత్రం 5 గంటలకు పాదయాత్రకు ఆమె శ్రీకారం చుట్టనున్నారు. మీనాక్షి నటరాజన్‌తో పాటు పిసిసి అధ్యక్షుడుఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా పార్టీ నాయకులు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లూ పాదయాత్రలో పాల్గొంటారు.

## గోదావరి నదీ యాజమాన్య బోర్డు చైర్మన్‌గా బి.పి పాండే

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీలో గోదావరి నదీ యాజమాన్య బోర్డు ఆఫీసు తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు రెండు రాష్ట్రాలు అంగీకరించిన నేపథ్యంలో ప్రస్తుతం కొత్త ఛైర్మన్ ను నియమించడం పట్ల ఆసక్తి నెలకొంది. గోదావరి నదీ యాజమాన్య బోర్డు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం 2014 సెక్షన్ 85 కింద మే 28 ఏర్పాటు చేశారు. ఈ బోర్డు కేంద్ర జలశక్తి అధీనంలో పని చేస్తుంది. గోదావరి నదిపై ప్రాజెక్టుల నిర్మాణం, నీటి వాటాల నిర్వహణ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నీటి వివాదాల పరిష్కారంపై ఇది పనిచేస్తుంది. కాగా ప్రస్తుతం బోర్డు చైర్మన్ గా ఏకే ప్రధాన్ బాధ్యతలు నిర్వహిస్తుండగా కేంద్ర జలశక్తి శాఖ బి.పి.పాండేను కొత్త చైర్మన్ గా నియమించింది. తెలుగు రాష్ట్రాల మధ్య పోలవరం- బనకచర్ల లింక్ ప్రాజెక్టు వివాదంపై కొత్త చైర్మన్ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

## రాష్ట్ర రైతాంగ సంక్షేమం కోసం రాజీలేని పోరాటాలు చేయాలి : కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

శ్రేణులను క్షేత్ర స్థాయిలో పోరాటాల కోసం కార్యోన్ముఖులను చేయాలని పార్టీ శ్రేణులకు అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

## 20 నెలల్లోనే కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత..

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు.గత పదేళ్ళలో ప్రజలకు చేయాల్సిన పనులన్నీ చేశాము. ప్రజలు కాంగ్రెస్ మోసపూరిత హామీలను నమ్మి మోసపోయారు. రైతులకు కేసీఆర్ సాగునీళ్లు, రైతుబంధు, రైతుభీమా ఇచ్చారు. కార్యకర్తలందరూ కలిసి పని చేయాలి. మనం కూసున్న చెట్టు కొమ్మను మనమే నరుక్కున్నాము. ప్రజలంతా బీఆర్ఎస్‌కే ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రతి రైతు తినే పళ్ళెంలో మట్టి పోసుకున్నామని బాధపడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు లేదు. రైతుబంధు రాదు, రైతు బీమా రాదు, బోనస్ రాదు. కానీ ఓట్లు ఉన్నప్పుడే నోట్లు వేస్తున్నాడు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.రైతులకు యూరియా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉంది. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక ప్రభుత్వం మోసం చేస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అని మభ్యపెట్టారు. రిజర్వేషన్ల కోసం ఢిల్లీ పోయి ధర్నా చేస్తామంటున్నారు.. కూట్లే రాయి తీయనోడు ఏట్లే రాయి తీస్తామంటున్నారు. సీఎం చేతిలో ఉన్న పనులు చేయడం లేదు. రేవంత్ రెడ్డిని తిడితే.. బండి సంజయ్‌కి ఏం నొప్పి. తెలంగాణలో గులాబీ జెండా లేకుండా చేయాలి గోదావరి నీళ్లు ఆంధ్రకు వదిలేయాలి.. అనేది బండి సంజయ్, రేవంత్ రెడ్డి గూడుపుటాని. కేసీఆర్ ఉంటే నీళ్లు, నిధులు ఎవరికి పోనియ్యడనే దురుద్దేశ్యంతో రేవంత్ రెడ్డి, బండి సంజయ్ కుట్రలు చేస్తున్నారు అని కేటీఆర్ మండిపడ్డారు.కులం,మతం ముసుగులో మళ్ళీ మోసపోవద్దు. మహిళలకు 2500లు అన్నాడు హామీ ఏమైంది ఒక్కో

## భూ వివాదం కేసులో రేవంత్ రెడ్డికి ఊరట

(మొదటి పేజీ తరువాయి)

ఆశ్రయించారు.ఆ పిటిషన్‌లో హైకోర్టు తీర్పునకు సంబంధించిన అంశాలతో పాటూ జడ్జి పైన అభ్యంతరకరకర వ్యాఖ్యలు చేసినట్లు- సమాచారం. ఎన్ పెద్దిరాజు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. అలాగే ఎన్ పెద్దిరాజుతో పాటు-, ఆయన అడ్వకేట్ రితేష్ పాటిల్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సీజేఐ బీఆర్ గవాయి తదుపరి విచారణకు పిటిషనర్ అండ్ పెద్దిరాజు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించారు. భూ వివాదం వ్యవహారంలో సొసైటీ- స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని 2016లో రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మయ్య పై పెద్దిరాజు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పీఎస్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. తనపై కేసును కొట్టివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి 2020లో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. ఫిర్యాదు దారు ఆరోపణల్లో సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంది. రేవంత్‌పై నమోదైన కేసును కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పు అనంతరం.. కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ పెద్దిరాజు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం డిస్మిస్ చేసింది.పిటిషన్‌లో.. ఉత్తర్వులు ఇచ్చిన హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరకరర వ్యాఖ్యలు ఉన్నాయని సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. ఒక న్యాయవాదిగా న్యాయమూర్తిపై వ్యాఖ్యలు చేస్తూ .. పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్.పెద్దిరాజుతోపాటు- ఆయన తరఫు న్యాయవాది రితేష్ పాటిల్‌కు ధర్మాసనం కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణకు పిటిషనర్ పెద్దిరాజు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలిచ్చింది. కోర్టు సాక్షిగా పిటిషనర్ తరఫు న్యాయవాది రితీష్ పాటిల్ క్షమాపణ కోరారు. అందుకు నిరాకరించిన సీజేఐ.. పిటిషన్ రాసేటప్పుడు, దాఖలు చేసేటప్పుడు గుడ్డిగా ఎలా వేశారని ప్రశ్నించారు. పిటిషన్ ఉపసంహరించుకునేందుకు అనుమతివ్వాలని న్యాయవాది రితీష్ పాటిల్ కోరగా.. అందుకు సీజేఐ నిరాకరించారు. పిటిషన్ దాఖలు చేసే ముందు న్యాయవాదిగా అన్ని విషయాలు చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోవద్దంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. కోర్టు ధిక్కరణ నోటీసుపై లిఖిత పూర్వకంగా సమాధానం ఆదేశించారు. సమాధానం ఆమోదయోగ్యంగా ఉంటేనే కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని స్పష్టం చేస్తూ... విచారణ ఆగస్టు 11కు వాయిదా వేశారు.

## రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన చేయబడిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం అని అన్నారు. నాగార్జున సాగర్ మనకు ఆధునిక దేవాలయం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సాగర్ నుంచి గేట్లు ఎత్తడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. 18 ఏళ్ల తర్వాత జులైలోనే నాగార్జున సాగర్ జలాశయం నిండిందని తెలియజేశారు. సాగర్ కు దివంగత ప్రధాని నెహ్రూ గాంధీ పునాది వేస్తే దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారని, 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించిన గొప్ప ప్రాజెక్టు ఇది అని కొనియాడారు. సాగర్ కాలువల ద్వారా రెండు రాష్ట్రాల్లోని ప్రతీ ఎకరాకు నీరు చేరిందని, మన రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి పండిందని ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని 22 లక్షల ఎకరాలకు సాగునీరుతుందని చెప్పారు .జవహర్ కుడి కాలువ ద్వారా 11.74 లక్షల ఎకరాలు, లాల్ బహదూర్ ఎడమ కాలువ ద్వారా 10.38 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నట్లు- వెల్లడించారు. తెలంగాణలో మొత్తం 6 లక్షల 50వేల ఎకరాలకు సాగు నీరు అందుతుండగా, నల్గొండ జిల్లాలో 1,50,000 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో రెండు లక్షల 30 వేల ఎకరాలు ,ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్ష ఎకరాలకు ఆయకట్టుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా సాగునీరందుతున్నదని తెలిపారు. 2005 సంవత్సరంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు స్వర్ణోత్సవాలు. నిర్వహించడం జరిగిందని చెప్పారు. తను ఆరుసార్లు శాసనసభ్యుడిగా,ఒకసారి పార్లమెంటు సభ్యునిగా ఉంటూ ఇప్పుడు ఇరిగేషన్ ప్రాజెక్టు మంత్రిగా నాగార్జున సాగర్ ద్వారా నీటిని వదలడం సంతోషంగా ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటు- అయిన తర్వాత గత వానాకాలం,యాసంగి , వానాకాలం కలిసి రెండు లక్షల 81 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని. పండించడం జరిగిందని, ఇందులో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పాత్ర ముఖ్యమని అన్నారు. సాగునీటితో పాటు- నాగార్జునసాగర్ పవర్ ప్రాజెక్ట్ ద్వారా గడచిన 4 రోజులుగా 30000 క్యూసెక్కుల నీటిని తో పూర్తిస్థాయిలో,700 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేశామన్నారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి ,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ చౌహాన్,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ ఈ మల్లికార్జునరావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు. కాగా నాగార్జున సాగర్ ప్రాజక్ట్ ద్వారా మంత్రులు 6 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువ కు వదిలిన తర్వాత అధికారులు 14 గేట్ల ద్వారా 10932 క్యూసెక్కుల నీరు వదిలారు.మంగళవారం సాయంత్రం వరకు 20 గేట్ల ద్వారా 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వదలనున్నట్లు- ప్రాజక్ట్ అధికారులు తెలిపారు. అనంతరం మంత్రులు, అధికారులు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ను సందర్శించి కృష్ణ జలాలకు పుష్పాభిషేకం చేశారు.

## కాళేశ్వరం నివేదిక సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించే అవకాశాలు ఉన్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో చోటు-చేసుకున్న లోపాలు, వాటి ఆధారాలతో భారీ నివేదికను సిద్ధం చేశారు. కమిషన్‌కు ప్రభుత్వం ఇచ్చిన గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు నిధులు విడుదల చేసినట్లు- పీసీ ఘోష్ కమిషన్ గుర్తించింది. విచారణ సందర్భంగా ఐఏఎస్ అధికారులు చెప్పిన అంశాలపై ప్రత్యేక ప్రస్తావన చేసింది. ఐఏఎస్, ఇంజనీర్లకు సమన్వయ లోపం ఉన్నట్లు- కమిషన్ గుర్తించింది. నాటి ప్రభుత్వ పెద్దలు నేరుగా క్షేత్రస్థాయి సిబ్బందితో సంప్రదింపులు చేయడంతో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు సమాచారం లేకుండా పోయింది. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదు. పూర్తిస్థాయి అనుమతులు లేకుండానే డిజైన్ల మార్పు చేసినట్లు- గుర్తించారు. డీపీఆర్ మార్పులు, మొదట్లో చెప్పిన డీపీఆర్, తర్వాత డీపీఆర్లో మార్పులు, నిధుల సేకరణ ఎలా జరిగిందో వివరించే అవకాశం ఉంది. హైలెవల్ కమిటీ- అనుమతి లేకుండానే బడ్జెట్ రిలీజ్ గుర్తించింది. మూడు బ్యారేజీలకు సంబంధించిన ఆర్థిక పరమైన అంశాలను వేరువేరుగా పొందుపర్చింది. అధికారుల తప్పిందం అంశాలపై లీగల్ అంశాలతో సిఫార్సు చేసింది. బహిరంగ విచారణ సందర్భంగా సాక్షులు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో అంశాలను చేర్చింది. గతేడాది జూన్ నుంచి జస్టిస్ ఘోష్ కమిషన్ ప్రత్యక్ష విచారణ చేపట్టింది. వందల అఫిడవిట్లు-, బహిరంగ విచారణలు, ఎన్డీఎస్ఏ, కాగ్ నివేదికలు, విజిలెన్స్, ప్రాజెక్టు నిర్మాణ సమయంలో గత ప్రభుత్వం ఆమోదించిన మంత్రి మండలి మినిట్స్, ప్రభుత్వం సమర్పించిన వేల పేజీల సమాచారాన్ని కమిషన్ పూర్తిగా పరిశీలించింది. అన్నింటి నుంచి కీలక ఆధారాలను కమిషన్ సేకరించింది. మూడు బ్యారేజీల్లో చోటు-చేసుకున్న లోపాలు, వాటికి సంబంధించిన ఆధారాలతో నివేదికను సిద్ధం చేసిందని తెలుస్తోంది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ మంత్రి ఈటల రాజేందర్‌లు కమిషన్ విచారణకు హాజరైన విషయం తెలిసిందే.

## యూరియాపై ప్రభుత్వం తప్పుడు లెక్కలు

(మొదటి పేజీ తరువాయి)

ఇంకా ఎంత యూరియా కావాలంటే అంత ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. రబీ సీజన్‌లో 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని... కానీ తెలంగాణలో 12.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ఇప్పుడు యూరియా లేదని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని.. రబీలో అదనంగా ఉన్న యూరియా ఇప్పుడు ఎందుకు లేకుండా పోయిందని.. ఎందుకు కొరత వచ్చిందో రేవంత్ ప్రభుత్వం పరిశీలించుకోవాలని సూచించారు. యూరియా విషయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావుకి రామచంద్ర రావు సవాల్ విసిరారు. ఆర్టీఏ చట్టం ద్వారా వివరాలు సేకరిద్దాం అని, తనది తప్పైతే రాజీనామా చేస్తానంటూ సవాల్ చేశారు. యూరియా సరఫరా విషయంలో ఆర్టీఏ చట్టం ద్వారా వివరాలు తీసుకోవచ్చని, అందులో తాము చెప్పేది అబద్ధమైతే తాను రాజీనామాకు సిద్ధమని.. మరి తుమ్మల రాజీనామా చేస్తాడో చూడాలని రామచంద్ర రావు అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లాలో రామచంద్రరావు పర్యటించారు.సీఎం రేవంత్ కుర్చీ కాపాడుకోవాడం కోసమే తన సమయాన్ని వెచ్చించాల్సి వస్తుందని, అందువల్లే మీనాక్షి నటరాజన్ పాదయాత్ర కూడా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇవ్వాలి, కానీ అందులో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించకూడదు. బీసీ బిల్లుకు బేషరతుగా మద్దతు ఇచ్చింది బీజేపీ మాత్రమే. 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాల్సిందే. ఒక్క శాతం తగ్గిన ఊరుకునేది లేదు' అని హెచ్చరించారు. 'మొన్న బండి సంజయ్ చెప్పాడు.. ఇది బీసీ రిజర్వేషన్ కాదు, ముస్లింల రిజర్వేషన్ అని. మేము ముస్లింలకు వ్యతిరేకం కాదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 19 నెలలు అవుతుంది. ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చడం లేదు. కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద దేశంలో ప్రతి రైతుకు డబ్బులు పడ్డాయి. ఖమ్మంలో కూడా బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. తెలంగాణ, ఖమ్మం జిల్లా

## మానవత్వం చాటుకున్న రాహుల్

**న్యూఢిల్లీ, జులై 29:** కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి మానవత్వం చాటుకున్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో పాకిస్తాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో తల్లిదండ్రులను కోల్పోయిన 22 మంది పిల్లలను దత్తత తీసుకోవాలని ఆయన నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేత నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, పహల్గాంలో ఏప్రిల్ 22న ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. దాడిలొ 26 మంది టూరిస్టులు చనిపోయారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది.



# అటవీ శాఖ చెక్ పోస్టులకు ఫాస్ట్ ట్యాగ్ సౌకర్యం

**.వ్యవసాయ సంబంధిత ఉత్పత్తులు కలిగిన వాహనలకు మినహాయింపు.**
**.గోవిందరావుపేట, తాడ్వాయి వ్యక్తి గత వాహనలకు మినహాయింపు.**
**.ఎఫ్ డివో రమేష్.**
**.రెంజ్ అధికారి అబ్దుల్ రెహమన్.**




**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 29 ( పీపుల్స్ న్యూస్):** ములుగు జిల్లా,గోవిందరావుపేట మండలం వైల్డ్ లైఫ్ అటవీ ప్రాంతంలోకి వాహనాలు ప్రవేశించే ప్రక్రియను సులభతరం చేయడానికి అటవి శాఖ అధికారులు ఫారెస్ట్ ఎంట్రీ పాయింట్ల వద్ద ఫాస్ట్ ట్యాగ్ సేవలను అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందని ఎఫ్ డివో రమేష్ రెంజర్ అబ్దుల్ రెహమాన్ మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఫారెస్ట్ ఎంట్రీ పాయింట్ల వద్ద ఫాస్ట్ ట్యాగ్ ఆ ధారిత సేవలు ప్రారంభించడం వల్ల వాహనల సుధీర్ఘ క్యూలైన్లు, జాప్యాలను నివారించవచ్చని,ఏటూరునాగారం జాతీయ రహ దారి, ఆటవీ రిజర్వ్‌లో ఏర్పాటు చేసిన అటవీశాఖ చెక్ పోస్టులు ఇప్పుడు ఫాస్ట్ ట్యాగ్ సదుపా యం కలిగి ఉన్నాయని అధికారులు తెలిపారు. ములుగు నుండి అటవీశాఖ చెక్‌పోస్ట్ 163 జాతీయ ప్రధాన రహదారిపై వెళ్లే వాహనాలకు చార్జీలలో ఎలాంటి మార్పులు లేవని తెలిపారు .గోవిందరావుపేట, తాడ్వాయి మండల పరిధిలో ఉన్న వ్యక్తిగత వాహనదారులు తమ వివరా లు ఆటవీ క్షేత్ర అధికారి కార్యలయంలో సమర్పించలని రెంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ తెలిపారు.అటవీ శాఖ చెక్‌పోస్ట్‌లలో నేషనల్ హైవే మాదిరిగా ఫాస్ట్ ట్యాగ్ సేవలను అనుసం ధానం చేయడం వల్ల రద్దీగా ఉండే చెక్‌పోస్టుల వద్ద టోల్ రుసుము గురించి చాలా సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడేదని, ఫాస్ట్ ట్యాగ్ సేవలను అనుసంధానం చేయడంతో క్షణాలలో పను లు జరుగుతున్నాయని,వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఈ విద్యా సంవత్సరం అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

**అన్ని పాఠశాలల్లో వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నాం.**
**జెడ్ పి హెచ్ ఎస్ స్కూల్ తనిఖీ,**
**విద్యార్థులకు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరీక్షించిన**
**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**
**విద్యార్థులు ఉత్సాహంగా కలెక్టర్ అడిగిన**
**ప్రశ్నలకు సూటిగా సమాధానం.**




**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 29 (పీపుల్స్ న్యూస్):**జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కావలసిన వసతులు, సదుపాయాలు కల్పిస్తున్నామని, జిల్లా యంత్రాంగం తరఫున ఎటువంటి సహకారమైన అందిస్తామని, ఈ విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలను ఆశిస్తున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.మంగళవారం వెంకటాపూర్ మండలం పాలంపేట జెడ్ పి హెచ్ ఎస్ స్కూల్ ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ 9వ, 10 వ తరగతి విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ లను పరిశీలించి, విద్యార్థులకు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులు ఉత్సాహంగా కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం చేశారు. అనంతరం పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్ ను సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులు వచ్చాయా అని ఆరా తీశారు. ప్రభుత్వ బడులలో మెరుగపడిన సదుపాయాలు, నాణ్యమైన విద్యా బోధన గురించి వివరిస్తూ, విద్యార్థుల ప్రవేశాలు గణనీయంగా జరిగేలా చొరవ చూపాలన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో మధ్యాహ్నం భోజనం అందించాలని, ఆహారం తయారు చేసే సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. బడి వయసు గల పిల్లలు ఎవరు బడి బయట ఉండకూడదని, బడి వయసు పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి పాఠశాలలు చేర్పించాలని తెలి పారు. విద్యార్థుల పఠన సామర్థ్యం, ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. తరుచూ బడికి గైర్హాజర్ అయ్యే విద్యార్థులను గుర్తిస్తూ, క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేల చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాలంపేట లోని రామప్ప రిజర్వాయర్, తుమ్ ను పరిశీలించి వివరాలను అధికారులతో కలెక్టర్ అడిగి తెలుసుకొన్నారు.ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ ప్రభాకర్, ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ రాజి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటలు వైద్య సేవలు అందించే పిహెచ్సి సెంటర్లకి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తాం

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి**




**మేడ్చల్ ప్రతినిధి, జూలై 29, (పీపుల్స్ న్యూస్ ) :** 24 గంటలు వైద్య సేవలు అందించే పిహెచ్సి సెంటర్లకి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. మంగళవారం కీసర మండలంలోని పిహెచ్సి సెంటర్ ను డిఎం అండ్ హెచ్ ఓ ఉమా గౌరీ తో కలిసి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్ని ఓపి కేసులు ఉంటాయని, ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సినేషన్ రోజుకు ఎంతమందికి వేస్తారని అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారా అని ఈ ఆసుపత్రి కింద ఎన్ని సబ్ సెంటర్లు ఉన్నాయని పలు విషయాలను తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్ ను, మెడిసన్ రూమ్ ను,ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. వర్షం నీరు కురిసి గోడలు నిమ్మ రావడం పరిశీలించిన కలెక్టరు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగం వారిని ఆదేశించారు. . ఆస్పత్రికి అవసరమైన మరమ్మత్తులు సంబంధించిన ప్రతిపాదన లు తనకు పంపాలని మెడికల్ ఆఫీసర్ కు కలెక్టర్ సూచించారు.. అనంతరం జవహర్ నవోదయ విద్యాలయ నిర్మాణాలను స్థలాన్ని ఆర్ డి ఓ ఉపేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు ఈ పర్యటనలో కీసర ఎమ్మార్వో అశోక్, మెడికల్ ఆఫీసర్ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# దేశ భవిష్యత్తు దశ దిశను మార్చేది విద్యనే

**జిల్లాలో ఉత్తమ పి.ఎం శ్రీ స్కూల్ గా**
**బండారుపల్లి, టి.జి.మోడల్ స్కూల్ ఎంపిక.**
**శిలాపలకం ఆవిష్కరణ.**
**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**





**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 29( పీపుల్స్ న్యూస్ ):**దేశ భవిష్యత్తు దశ దిశను మార్చేది విద్యనే అని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.మంగళవారం బండారుపల్లి, టి.జి.మోడల్ స్కూల్ పి.యం.శ్రీ. తెలంగాణ మోడల్ స్కూల్ జిల్లాలో ఉత్తమ పి.యం.శ్రీ. స్కూల్ గా ఎంపిక కావడం వలన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ తో కలసి శిలాఫలకం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూవిద్య పట్ల సానుకూల శక్తితో ముందు కు వెళ్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయిలో ఎదగడానికి అదేవిధంగా ఐఏఎస్, ఐపీఎస్ కావాలన్నా మంచి కలలను కనాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. విద్యార్థి,విద్యార్థినిలు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించడం ఉందని, ప్రతి విద్యార్థి శ్రద్ధ, నిబద్ధత, క్రమశిక్షణతో ఎన్ని సమస్యలు వచ్చిన వాటిని ఎదుర్కొని ముందుకు సాగాలని ఆయన తెలిపారు. దేశ భవిష్యత్తు యువత పైనే ఉందని, దేశాన్ని ముందుకు తీసుకు వెళ్లాల్సిన బాధ్యత కూడా మీపై ఉందని విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ తెలిపారు.పాఠశాల కోసం విడుదలైన నిధులను విద్యార్థులు చదువులో అతున్నత ప్రతిభ ప్రదర్శించడానికి, సృజనాత్మక పెంపొందించుకోవడానికి ఉప యోగించుకోవాలని కోరారు.పి.యం.శ్రీ. పథకంలో భాగంగా టి.జి., మోడల్ స్కూల్ కి విడులైన నిధులను పాఠశాల అవసరా లకు అత్యుత్తమంగా ఖర్చు చేసి జిల్లాలో ఉత్తమ పాఠశాలగా నిలిచినందుకు పాఠశాల ప్రిన్సిపల్ కి, అధ్యాపక బృందానికి, విద్యార్దులకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచంద్ర మాట్లాడుతూ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా స్వయంగా రాష్ట్ర ముఖ్య మంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ఉండడం వల్ల విద్యాశాఖకి అత్యధిక నిధులు కేటాయిస్తున్నారని, ఇది మనలాంటి వెనుకబడిన ప్రాంతాలలో విద్యా అబివృద్ధికి, విద్యార్థులకి చాలా ఉపయోగపడుతుందని అన్నారు.ఈ సందర్భంగా పి.యం.శ్రీ.పథకంలో భాగంగా పాఠశాలకు మంజూరు అయిన సంగీత పరికరాలను కలెక్టర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌తో కలసి విద్యార్థులకి అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సింగారం దేవకి, మండల విద్యాధికారి తిరుపతి, జిల్లా విద్యాశాఖ కో ఆర్డినేటర్ అర్షం రాజు, పాఠశాల అధ్యాపకులు సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

**ఫెర్టిలైజర్ దుకాణాల్లో నిబంధనలు పాటించాలి.**
**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**




**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 29( పీపుల్స్ న్యూస్ ):**ఎరువుల దుకాణాదారులు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. హెచ్చరించారు. మంగళవారం వెంకటాపూర్ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, కొనుగోళ్ల రిజిస్టర్ ను పరిశీలించారు. దుకాణాల్లోని ఎరువుల నిల్వలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సబ్సిడీ ఎరువులను దారి మళ్లించినా, బ్లాక్ మార్కెట్టుకు తరలించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పురుగుమందులు రైతులకు సరిపడ అందుబాటులో ఉంచాలని అన్నారు. ప్రతిరోజూ స్టాక్ వివరాలను వ్యవసాయ శాఖ వారికి తెలపాలని, రిజిస్టర్ లు సక్రమంగా పాటించాలని సూచించారు. దుకాణదారులు ఏ రైతుకు ఎంత పరిమాణంలో ఎరువులు ఇస్తున్నారనే వివరాలు తప్పక నమోదు చేయాలని అన్నారు. ఎరువులు, విత్తనాల స్టాక్ బోర్డును ఖచ్చితంగా ఏర్పాటు చేయాలని, రైతు సమస్యను ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ డిస్ ప్లే చేయాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారులు నిరంతరం ఫెర్టిలైజర్ దుకాణాలలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎరువులను ఎక్కువగా వాడడం వల్ల నేల స్వభావం దెబ్బతింటుందని, ఈ విషయాల పట్ల రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తూ తక్కువ పరిమాణంలో ఎరువులు వాడేలా అవగాహన కల్పించాలని అన్నారు. రైతులు నానో యూరియా వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం. శైలజ, ఏ ఈ ఓ లు సుకుమార్, మహి పవన్, పి ఏ ఎస్ సీఈఓ శంకరయ్య, రమేష్, రైతులు ఐలయ్య, రజినీకర్, సురేష్ తదితరులు ఉన్నారు.

# మలేరియా, డెంగ్యూ కేసులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి

**ఫ్రైడే - డ్రై డే పక్కగా నిర్వహించాలి.**
**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**




**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 29 (పీపుల్స్ న్యూస్):**వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగ్యూ వ్యాధుల నియంత్రణ పట్ల ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. వైద్యాధికారులను ఆదేశించారు.మంగళవారం వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని ఇన్ వార్డును సందర్శించి, చికిత్స పొందుతున్న రోగులకు వైద్యాధికారులు అందిస్తున్న సేవలు, ఏ విధంగా ఉన్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవుట్ పేషంట్ వైద్య సేవలకు రోజుకు ఎంతమంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారని, డ్రగ్స్టోర్లో అన్ని రకాల మందులు అందు బాటులో ఉంచుకోవాలని, లేనియెడల జిల్లా కార్యాలయానికి ఇండెంట్ పెట్టి సమకూర్చుకోవాలని ఫార్మాసిస్టుకు సూచించారు. ఆరోగ్య కేంద్రంలో మానవ వనరుల కొరత ఏమైనా ఉన్నాయా అని డాక్టర్ను అడిగి తెలుసుకోనగా, ల్యాబ్ టెక్నీషియన్ ఖాళీగా ఉందని తెలిపారు. త్వరలోనే ల్యాబ్ టెక్నీషియన్ పోస్టును భర్తీ చేస్తామని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రిషిత ఆయుష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పాషా, పి హెచ్ ఎన్ శోభ హెల్త్ సూపర్వైజర్ పుష్పకుమారి, ఫార్మసి ఆఫీసర్ రాజమణి, స్టాఫ్ నర్స్ మునెమ్మ రజిత, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం అందించాలి

**విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో**
**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**




**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 29 ( పీపుల్స్ న్యూస్):**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ కేసుల నమోదు, పురోగతి, బాధితులకు చెల్లించాల్సిన పరిహారం తదితర అంశాలపై జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావుతో కలిసి నిర్వహించారు.షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నమోదైన అట్రాసిటీ కేసులు, పరిష్కరించిన కేసులు, బాధితులకు అందిన పరిహారం గురించి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కేసు పూర్వాపరాలను పరిశీలించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగే విధంగా అధికారులు చర్య తీసుకోవాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ హాస్టళ్లను సందర్శిస్తున్నామని, హాస్టల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో బోర్ల మంజూరు అసలైన లబ్ధిదారులకు అందించామని అన్నారు.ఈ సందర్భంగా మానిటరింగ్ కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.జిల్లా కేంద్రం లో అంబేద్కర్ కమ్యూనిటీ భవన నిర్మించాలని సభ్యులు కోరారు. ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యత ఇవ్వాలని సభ్యులు కోరారు. జిల్లాలో మాదక ద్రవ్యాలు నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరగా, రేపటి సమాజ నిర్మాతలైన యువత డ్రగ్ మహమ్మారి భారిన పడకుండా కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, డ్రగ్స్ నిర్మూలనకై అన్ని శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. డ్రగ్స్ సరఫరా చేసే పాత నేరస్తులపై గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ అన్నారు. డి ఎస్ పి కిషోర్ కుమార్ మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల విషయంలో త్వరిత గతిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎఫ్ఐఆర్, చార్జిషీట్, పరిష్కారం అయిన కేసులు, విచారణలో ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మణ్ నాయక్, మున్సిపల్ కమిషనర్ సంపత్,ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జొన్న రవి, సునర్కని రాంబాబు, మురకుంట్ల నరేందర్, చింత కృష్ణ, బానోతు రాము నాయక్, తహసీల్దార్లు, జిల్లా అధికారులు, ఎంపి డి ఓ లు,పాల్గొన్నారు.



బుధవారం,
జూలై 30, 2025
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
4

# మహిళల భద్రత కోసం పకడ్బందీ చర్యలు

## ఎన్ హెచ్ ఆర్ సి సమావేశంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్











**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో, జూలై 29, (పీపుల్స్ న్యూస్ ) :** తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రత కోసం పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ అన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్ హెచ్ ఆర్ సి) వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన తో పాటు చైర్‌పర్సన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్, గౌరవ సభ్యులు విజయ భారతి సయానీ, డా.జస్టిస్ బిద్యుత్ రంజన్ సారంగి, టి ఎస్ హెచ్ ఆర్ సి చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్, సెక్రటరీ జనరల్ భరత్ లాల్, డైరెక్టర్ జనరల్ (ఇన్వెస్టిగేషన్), ఆర్ . ప్రసాద్ మీనా, రిజిస్ట్రార్ (లా) డిప్యూటీ జోగిందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మహిళలపై నేరాలు అనే అంశంపై జరిగిన చర్చ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రత కోసం అడిషనల్ డీజీపీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఉమన్ సేఫ్టీ వింగ్ పనిచేస్తుందన్నారు. వివిధ ప్రాంతాలకు చెందినవారు హైదరాబాద్ లో నివసిస్తున్నందున మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. షీ టీమ్స్ ఏర్పాటు, భరోసా కేంద్రాల స్థాపన, అవగాహన కార్యక్రమాల నిర్వహణ వంటి నూతన విధానాల ద్వారా మహిళలకు భద్రత కల్పిస్తున్నామని తెలియజేశారు. మహిళలు ఇబ్బందులకు గురి చేస్తున్న ఈవ్ టీజింగ్ వంటి అంశాల్లో కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. మిస్సింగ్ ఉమెన్ సంఘటన విషయంలో త్వరితగతిన స్పందిస్తున్నామని తెలియజేశారు. ఉమెన్స్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డీజీపీ చారు సిన్హా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మహిళల భద్రత కోసం 31 భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని , ఈ కేంద్రాల ద్వారా మహిళా బాధితులకు అవసరమైన అన్ని రకాల మద్దతు ఇస్తూ వన్ స్టాప్ సెంటర్లుగా కొనసాగిస్తున్నామన్నారు. బాల కార్మిక వ్యవస్థను అరికట్టేందుకు ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ వంటి కార్యక్రమాల ద్వారా చర్యలు చేపడుతున్నామన్నారు. ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్స్ నిర్వహిస్తున్నామన్నారు. ట్రాన్స్ జెండర్ సెల్, ఎన్నారై సెల్, సాహా స్ లను కొనసాగిస్తున్నామన్నారు. భవనాల నిర్మాణాలు చేపడుతున్న ప్రాంతాల్లో ఉన్న మహిళల, పిల్లల విషయంలో అవసరమైన చర్యలు చేపడతామన్నారు. ట్రాన్స్ జెండర్లు ఎంతమంది ఉన్నారనే గణాంకలను సేకరిస్తున్నామన్నారు. స్పెషల్ సీఎస్ (హోం) రవి గుప్తా , డైరెక్టర్ జనరల్ (జైళ్లు కరెక్షనల్ సర్వీసెస్) సౌమ్య మిశ్రా,శాంతి భద్రతల అదనపు డిజిపి మహేష్ ఎం. భగవత్ , సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, ఐ జి పి కోఆర్డినేషన్ ఎం. శ్రీనివాసులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# శ్రీశైలం జలాశయానికి భారీ వరద ప్రవాహం ఏడు గేట్లు ఎత్తివేత



**శ్రీశైలం:** శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతున్నది. జూరాల, సుంకేశుల నుంచి శ్రీశైలానికి ప్రస్తుతం 2,68,785 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. జూరాల జలాశయం పంప్‌హౌస్‌ల నుంచి 27,395 క్యూసెక్కులు, జూరాల స్పిల్‌వే నుంచి 1,19,064 క్యూసెక్కుల వరద వస్తుందని అధికారులు తెలిపారు. అలాగే సుంకేవుల జలాశయం నుంచి 1,22,326 క్యూసెక్కుల వరద నీరు వస్తుందని పేర్కొన్నారు. పరివాహక ప్రాంతాల నుంచి మొత్తంగా 2,89,670 క్యూసెక్కుల వరద వస్తుందని పేర్కొన్నారు. కుడి, ఎడమ గట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుందని చెప్పారు.విద్యుత్ ఉత్పత్తి ద్వారా సాగర్ వైపుగా 65,712 క్యూసెక్కుల నీరు విడుదలవుతుందని తెలిపారు. కుడిగట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 30,397 క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కుల నీరు విడుదలవుతుందని పేర్కొన్నారు. అలాగే స్పిల్‌వే గేట్ల ద్వారా 1,90,099 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతుంది. ఏడు గేట్లను పది అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 882.90 అడుగుల మేర నీరున్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 269.750 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 269.125 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు వివరించారు.

# డెబిట్ కార్డు తరహాలో డిజిటల్ రేషన్ కార్డులు ఆగస్టు 25 నుంచి పంపిణీ చేస్తామన్న ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్



**అమరావతి :** ఏపీలో కొత్త రేషన్ కార్డులపై ఆ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆగస్టు 25వ తేదీ నుంచి 31 వరకు రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అక్రమాలకు ఆస్కారం లేకుండా క్యూఆర్ కోడ్‌లతో డిజిటల్ రేషన్ కార్డులు ఇస్తున్నామని పేర్కొన్నారు.కొత్త రేషన్‌కార్డులపై రాజకీయ నేతల ఫొటోలు ఉండవని నాదెండ్ల మనోహర్ తెలిపారు. డెబిట్ కార్డు తరహాలో ఈ కార్డులు ఉంటాయని పేర్కొన్నారు. కొత్తగా 9 లక్షల మందికిపైగా అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 29,796 రేషన్ షాపుల్లో ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు రేషన్ పంపిణీ చేస్తామని తెలిపారు. 25 నుంచి 30వ తేదీ వరకు వృద్ధులకు రేషన్ డోర్ డెలివరీ చేయనున్నట్లు చెప్పారు. ఐదేళ్లలోపు, 80 ఏళ్లు దాటిన వారికి ఈకేవైసీ అవసరం లేదని స్పష్టం చేశారు.

# రెడ్‌బుక్ తరహాలో వైసీపీ యాప్ వాళ్లందరికీ సినిమా చూపిస్తానని వైఎస్ జగన్ వార్నింగ్



**అమరావతి :** ఏపీ రాజకీయాల్లో రెడ్‌బుక్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో నారా లోకేశ్ తీసుకొచ్చిన ఈ రెడ్‌బుక్.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంచలనంగా మారింది. రాష్ట్రంలో వైసీపీ నాయకులపై ఏ కేసు పెట్టినా అది రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారమే నడుస్తోందని ఆరోప ణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే వైసీపీ కూడా రెడ్‌బుక్‌కు అడ్వాన్స్‌డ్‌గా డిజిటల్ ఉద్యమానికి సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం, కూటమి నాయకుల అండ కారణంగా ఏ అన్యాయం జరిగినా నాయకులు, కార్యకర్తలు ఫిర్యాదు చేసేందుకు ఒక యాప్ తెచ్చేందుకు సిద్ధమైంది. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యా లయంలో పొలిటికల్ అడ్వైజరీ కమిటీ(పీఏసీ) సభ్యులతో మంగళవారం నాడు సమావేశమైన వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఎస్ జగన్.. ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. త్వరలోనే ఒక యాప్ తీసుకొస్తున్నామని.. ప్రభుత్వ వేధింపులు, అన్యాయం జరిగితే వెంటనే ఆ యాప్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.ఏపీలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని.. సీనియర్ నేతలను తప్పుడు కేసుల్లో ఇరికిస్తున్నారని అన్నారు. ఇదే సంప్రదాయం కొనసాగితే టీడీపీలో అందరూ జైలుకెళ్లాల్సిందేనని హెచ్చరించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో పొలిటికల్ అడ్వైజరీ కమిటీ(పీఏసీ) సభ్యులతో మంగళవారం నాడు జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. మిథున్ రెడ్డి అరెస్టు బాధాకరమని అన్నారు. తమ కార్యకర్తలు, నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ వేధింపులపై ఫిర్యాదుల కోసం పార్టీ తరఫున త్వరలోనే యాప్ విడుదల చేస్తామని తెలిపారు. ప్రభుత్వ వేధింపులు జరిగినా, అన్యాయం జరిగినా వెంటనే యాప్‌లో నమోదు చేయవచ్చని పేర్కొన్నారు.ఫలానా వ్యక్తి, ఫలానా అధికారి కారణంగా అన్యాయంగా ఇబ్బంది పడ్డానని ఆ యాప్‌లో ఫిర్యాదు చేసి, ఆధారాలు అప్‌లోడ్ చేస్తే సరిపోతుందని జగన్ తెలిపారు. ఆ ఫిర్యాదులన్నీ ఆటోమేటిగ్గా తమ డిజిటల్ సర్వర్లలోకి వచ్చేస్తుందని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ ఫిర్యాదులపై కచ్చితంగా పరిశీలిస్తామని స్పష్టం చేశారు. అన్యాయానికి గురైన వారంతా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అప్‌లోడ్ చేసిన ఫిర్యాదులకు సంబంధించిన వీడియోలు, పత్రాలు పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జగన్ స్పష్టం చేశారు. తప్పు చేసిన వారందరికీ సినిమా చూపించడం ఖాయమని అన్నారు. చంద్రబాబు ఏదైతే విత్తారో అదే చెట్టవుతుందని చెప్పారు.పార్టీ నిర్మాణ పీఏసీ సభ్యులంతా భాగస్వాములు కావాలని వైఎస్ జగన్ కోరారు. పీఏసీ సభ్యులంతా క్రియాశీలకంగా వ్యవహరించాలని, ప్రతి కార్యక్రమంలో పాలు పంచుకోవాలని సూచించారు. పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఇందుకోసం అందరూ ఐకమత్యంగా పనిచేయాలని తెలిపారు. అంతర్గతంగా ఉన్న చిన్న విభేదాలను రూపుమాపి అందర్నీ ఒక్క తాటిపైకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. పార్టీని బలోపేతం చేసుకోవడానికి ఇదొక మంచి అవకాశం అని తెలిపారు. పార్టీ కోసం కష్టపడేది ఎవరన్నదే ఇప్పుడే బయటకొస్తుందన్నారు. పార్టీలో మంచి గుర్తింపు పొందేందుకు ఇదే మంచి అవకాశమని పేర్కొన్నారు. కార్యకర్తల విషయంలో గతంలో మాదిరిగా ఉండదని.. ఈసారి పెద్దపీట వేస్తామని తెలిపారు.

# పదో తరగతి విద్యార్థినిపై ప్రిన్సిపాల్ అత్యాచారం గర్భం రావడంతో వెలుగులోకి




**కోనసీమ జిల్లా :** విద్యాబుద్ధులు చెప్పాల్సిన గురువే పక్కదారి పట్టాడు. కన్నబిడ్డల్లా చూడాల్సిన స్టూడెంట్‌పైనే కన్నేశాడు. పదో తరగతి చదువుతున్న విద్యార్థిని బెదిరించి పలుమార్లు అత్యాచారం చేశాడు. ఈ క్రమంలో బాలిక గర్భం దాల్చడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఏపీలోని అంబేద్కర్ కోనసీమ జిల్లా మాచవరంలో ఈ దారుణం జరిగింది.వివరాల్లోకి వెళ్తే.. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం మాచవరం గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఓ విద్యార్థిని పదో తరగతి చదువుతోంది. అదే పాఠశాల ప్రిన్సిపాల్ జయరాజ్ ఆమెపై కన్నేశాడు. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం ఒంటరిగా ఉన్న బాలికపై ప్రిన్సిపాల్ అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. దీంతో భయపడిపోయిన బాలిక ఎవరికీ చెప్పలేదు. ఇదే అదునుగా భావించిన ప్రిన్సిపాల్ పలుమార్లు అఘాయిత్యానికి ఒడిగట్టాడు.మూడు నెలలుగా బాలికకు పీరియడ్స్ రావడం లేదని తల్లిదండ్రులు తాజాగా ఆస్పత్రిలో చూపించారు. దీంతో పరీక్ష చేసిన వైద్యులు బాలిక గర్భవతి అని నిర్ధారించారు. కంగారుపడిపోయిన తల్లిదండ్రులు ఏమైందని బాలికను నిలదీయడంతో ప్రిన్సిపాల్ జయరాజ్ చేసిన దారుణాన్ని బయటపెట్టింది. ఈ క్రమంలో రాయవరం పోలీస్‌స్టేషన్‌లో బాలిక, ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రిన్సిపాల్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# సింగపూర్‌లో మంత్రి లోకేష్ బిజీ బిజీ పారిశ్రామిక వేత్తలతో వరుస భేటీలు




అమరావతి: ఏపీకి పెట్టుబడులపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేషసింగపూర్‌లో పారిశ్రామిక వేత్తలతో వరుస సమావేశాల్లో పాల్గొంటున్నారు. వరుస భేటీలతో మంత్రి లోకేష్ (మంగళవారం జులై 29) బిజీ బిజీగా ఉన్నారు. క్యారియర్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరుణ్ భాటియాతో మంత్రి నారా లోకేష్ సింగపూర్‌లోని షాంగ్రీలా హోటల్‌లో సమావేశం అయ్యారు. ఏపీలోని అమరావతి, విశాఖపట్నం వంటి స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లల్లో క్యారియర్ (హీటింగ్, వెంటిలేషన్, ఎయిర్ కండీషనింగ్) వ్యవస్థలను అమలు చేయడానికి ఏపీ ప్రభుత్వంతో కలసి పనిచేయాలని మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఏపీలోని టైర్-2, టైర్-3 నగరాల్లో వ్యవసాయ ఉత్పత్తులు, ఔషధాలు, ఆహార నిల్వలకోసం స్థిరమైన కోల్డ్ చైన్ లాజిస్టిక్ హబ్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వంతో కలసి పనిచేయాలని ఆకాంక్షించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని అరుణ్ భాటియా పేర్కొన్నారు.ఏపీలో డేటా సెంటర్లు ఏర్పాటు చేయాలి: మంత్రి నారా లోకేష్‌సింగపూర్‌లో ఎస్టీ టెలీమీడియా ఇన్వెస్ట్‌మెంట్స్ (ఇండియా) హెడ్ రీతూ మెహ్లోవత్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. భారత్‌లో కార్యకలాపాలను రెట్టింపు చేయాలని భావిస్తున్నందున డేటా సిటీగా ఆవిష్కృతమవుతున్న విశాఖపట్నంలో ఎస్టీ టెలిమీడియా గ్రీన్ ఎనర్జీ డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేష్ కోరారు. ఉత్తరప్రదేశ్ తరహాలో అత్యాధునిక డేటా సెంటర్లు, కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల కల్పన, ఆప్టిమైజేషన్ ద్వారా బలమైన పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ఏపీ ప్రభుత్వంతో కలసి పనిచేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని రీతూ మెహ్లోవత్ వెల్లడించారు.గూగుల్ డేటా సెంటర్ పనులు ప్రారంభించాలి: మంత్రి నారా లోకేష్సింగపూర్ పర్యటనలో మూడో రోజు గూగుల్ క్లౌడ్ డైరెక్టర్ డ్రూ బ్రైన్స్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. విశాఖపట్నంలో సాధ్యమైనంత త్వరగా గూగుల్ డేటా సెంటర్ పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి నారా లోకేష్ కోరారు. గూగుల్ తన సర్వర్ల కోసం సొంత చిప్‌లను రూపొందిస్తున్నందున వైజాగ్‌లోని ప్రతిపాదిత డేటా సెంటర్ క్యాంపస్‌లో చిప్ డిజైనింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎంఓయూలు చేసుకున్న ప్రాజెక్ట్‌లతో పాటు ఏపీ ప్రతిపాదనలపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని డ్రూ బ్రైన్స్ వెల్లడించారు.ఏపీలో మురాతా ఎలక్ట్రానిక్స్ ఏర్పాటు చేయాలి: మంత్రి నారా లోకేష్‌సింగపూర్ మంత్రి నారా లోకేష్‌సింగపూర్‌లో ఎస్టీపర్యటనలో భాగంగా మురాతా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ హిరోయికి నివాతో మంత్రి నారా లోకేష్ సమావేశం అయ్యారు. ఏపీలో మురాతా ఎలక్ట్రానిక్స్ అధునాతన ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేష్ కోరారు. ఏపీలో ఏరోస్పేస్, డిఫెన్స్ పాలసీ ద్వారా ప్రత్యేక క్లస్టర్లలో సంబంధిత యూనిట్ల ఏర్పాటుపై ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని, అడ్వాన్స్ డ్ ఏరోస్పేస్ పరికరాల తయారీకి మద్దతు ఇచ్చే అనుబంధ యూనిట్లను ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలిం చాల్సిందిగా మంత్రి నారా లోకేష్ సూచించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామనిమురాతాఎండీ తెలిపారు.

# ఏనుగుల గుంపు కదలికలపై వాట్సాప్ ద్వారా హెచ్చరికలు పవన్ కల్యాణ్ న్యూ ప్లాన్



**అమరావతి:** చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏనుగులు గుంపులు గుంపులుగా సంచరిస్తున్న క్రమంలో అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ (మంగళవారం జులై 29) రాష్ట్ర సచివాలయంలో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. చంద్రగిరి నియోజకవర్గం పరిధిలో ఏనుగుల గుంపు తిరుగుతూ పొలాలు ధ్వంసం చేసిన ఘటనను అధికారులు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వివరించారు. డ్రోన్ ద్వారా ఏనుగుల గుంపు కదలికలను పరిశీలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.ఏనుగులు ఎటువైపు వెళ్తున్నాయనేది పరిశీలించడానికి డ్రోన్ టెక్నాలజీ వినియోగిస్తున్న క్రమంలో... అవి వెళ్లే అవకాశం ఉన్న మార్గాల్లోని గ్రామాలవారిని అప్రమత్తం చేయడంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాలవారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి వాటికి ఎప్పటికప్పుడు ముందస్తు హెచ్చరికలు పంపించాలని దిశానిర్దేశం చేశారు. ఏనుగుల కదలికలు, హెచ్చరిక సందేశాలు పంపించడాన్ని డీఎఫ్ఓ. కార్యాలయాలు, పీసీసీఎఫ్. కార్యాలయం పర్యవేక్షించాలని ఆదేశించారు. వీటితోపాటు ఏనుగుల గుంపు పొలాల మీదకి రాకుండా, అటవీ ప్రాంతంలోకి పంపించే చర్యలను పకడ్బందీగా చేపట్టాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

# జగన్ నెల్లూరు పర్యటనకి పోలీసుల ఆంక్షలు

నెల్లూరు: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నెల్లూరు జిల్లాలో ఈ నెల(జులై 31 గురువారం) పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో జగన్ పర్యటనపై నెల్లూరు జిల్లా పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా జగన్ పర్యటనపై నెల్లూరు ఇన్‌చార్జి ఎస్పీ దామోదర్ (మంగళవారం జులై 29) మాట్లాడారు. జగన్ పర్యటన కోసం జన సమీకరణ చేయలేదని వైసీపీ నేతలు చెప్పారని.. హెలిప్యాడ్ వద్ద పది మందికే అనుమతి ఇచ్చామనిజైలు వద్ద ముగ్గురికి మాత్రమే అనుమతి ఉందని స్పష్టం చేశారు.జైలు వద్ద పబ్లిక్‌కి అనుమతి లేదని.. నిబంధనలు బ్రేక్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు ఇన్‌చార్జి ఎస్పీ దామోదర్.జగన్ పర్యటనకు ఫుల్ సెక్యూరిటీ ఇస్తున్నామని..

# హోంమంత్రి అమిత్ షా వైఫల్యంవల్లే పహల్గాం ఉగ్రదాడి : గౌరవ్ గొగోయ్



**న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడి పై మంగళవారం లోక్‌సభలో గంటన్నరపాటు మాట్లాడిన హోం మంత్రి.. తన హోంశాఖ వైఫల్యం గురించిగానీ, దాడి ఘటనకు నైతిక బాధ్యత వహిస్తున్నాననిగానీ ఒక్క మాట కూడా మాట్లడకపోవడం దురదృష్టకరమని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ అన్నారు. పై మంగళవారం లోక్‌సభలో గంటన్నరపాటు మాట్లాడిన హోంమంత్రి.. తన హోంశాఖ వైఫల్యం గురించిగానీ, దాడి ఘటనకు నైతిక బాధ్యత వహిస్తున్నాననిగానీ ఒక్క మాట కూడా మాట్లడకపోవడం దురదృష్టకరమని అన్నారు.జమ్ముకశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా ధైర్యంగా నిజం ఒప్పుకున్నారని గౌరవ్ గొగోయ్ పొగిడారు. భద్రతా వైఫల్యంవల్లే పహల్గాంలో ఉగ్రవాదుల దాడి జరిగిందని మనోజ్ సిన్హా పశ్చాత్తాపం వ్యక్తం చేశారని గొగోయ్ చెప్పారు. పండిట్ నెహ్రూ కారణంగానో, యూపీఏ కారణంగానో, రాహుల్‌గాంధీ కారణంగానో, రాజీవ్‌గాంధీ కారణంగానో పహల్గాం ఉగ్రదాడి జరగలేదని, ఆ దాడి కచ్చితంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా వైఫల్యం వల్లే జరిగిందని గొగోయ్ ఆరోపించారు

# వాళ్లు ఎవరో ఏందో నాకైతే తెల్వదు

## పహల్గాం ఉగ్రవాదుల హతంపై ఫరూఖ్ అబ్దుల్లా




**న్యూఢిల్లీ:** పహల్గాం లో దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదుల ను భద్రతాబలగాలు మట్టుబెట్టాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా(మంగళవారం) మధ్యాహ్నం లోక్‌సభలో ప్రకటిం చడంపై నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా తనదైన శైలిలో స్పందించారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడింది ఆ ముగ్గురు ఉగ్రవాదులలేనో లేదంటే మరొకరో అని అనుమానిస్తున్నట్లుగా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి.'ఎన్‌కౌంటర్‌లో హతమైన ఆ ముగ్గురు ఉగ్రవాదులు ఎవరో.. ఏందో.. నాకైతే తెలియదు' అని ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. 'పహల్గాం దాడికి పాల్పడింది హతమైన ఆ ముగ్గురు ఉగ్రవాదులేనని కేంద్ర హోంమంత్రి చెప్పారు. అదే నిజమైతే ప్రభుత్వానికి నా అభినందనలు' అని అన్నారు. కాగా పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులు శ్రీనగర్‌లో ఉన్నారనే సమాచారం అందడంతో సోమవారం భద్రతాదళాలు ఆ ఏరియాను చుట్టుముట్టి ముగ్గురిని హతమార్చాయి.ఈ ఏడాది ఏప్రిల్ 22న పహల్గాంలో మారణహోమానికి పాల్పడిన ఉగ్రవాదులను భద్రతాబలగాలు మట్టుబెట్టాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇవాళ లోక్‌సభలో ప్రకటించారు. దీనిపై అభిప్రాయం తెలియజేయాలని మీడియా ప్రతినిధులు ఫరూఖ్ అబ్దుల్లాను పలుకరించగా ఆయన పైవిధంగా స్పందించారు..

# మహిళా డాక్టర్ డిజిటల్ అరెస్ట్ 3 నెలల్లో 19 కోట్లు కాజేశారు



**సూరత్ :** దేశంలోనే అత్యంత పెద్ద డిజిటల్ అరెస్టుస్కాం చోటుచేసుకున్నది. గుజరాత్‌లోని గాంధీనగర్‌కు చెందిన ఓ డాక్టర్‌ను సైబర్ క్రిమినల్స్ మోసం చేశారు. ఆ డాక్టర్ వద్ద నుంచి సుమారు 19 కోట్లు కాజేశారు. మూడు నెలల వ్యవధిలో ఆ మొత్తాన్ని డిజిటల్ అరెస్టు రూపంలో దోచేశారు. అధికారులమని చెబుతూ కొందరు వ్యక్తులు ఫోన్‌లో బెదిరించి ఆ డబ్బును తమ అకౌంట్లలోకి మళ్లించుకున్నారు. ఈ కేసులో సూరత్‌కు చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని అకౌంట్‌లో రూ.కోటి ఉన్నట్లు గుర్తించారు. అయితే సీనియర్ డాక్టర్‌ను 19 కోట్ల మేర మోసం చేసిన వ్యక్తులకు చెందిన నెట్వర్క్ గుట్టు విప్పేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.తొలుత మార్చి 15వ తేదీన ఓ లేడీ డాక్టర్‌కు ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్‌లో అభ్యంతరకరమైన కాంటెంట్ ఉన్నట్లు ఆమెను బెదిరించారు. ఫోన్‌ను డిస్‌కనెక్ట్ చేసి, మనీల్యాండరింగ్ కేసు నమోదు చేయనున్నట్లు ఆ ఫోన్‌కాల్‌లో బెదిరించారు. ఆ తర్వాత వేర్వేరు వ్యక్తుల నుంచి అధికారులమని ఫోన్ కాల్స్ వచ్చాయి. సబ్ ఇన్‌స్పెక్టర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అంటూ ఆమెను బెదిరించారు. దీంతో ఆ డాక్టర్ డిజిటల్ అరెస్టు అయ్యింది. ఆ భయంలో ఆమె సుమారు 19 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేసింది. మూడు నెలల వ్యవధిలో ఆ మొత్తాన్ని దాదాపు 35 వేర్వేరు అకౌంట్లకు పంపించింది.డాక్టర్‌కు చెందిన బంగారు ఆభరణాలపై కూడా మోసగాళ్లు రుణం తీసుకున్నారు. ఆ డబ్బును వాళ్లు మరో అకౌంట్‌కు బదిలీ చేశారు. నిత్యం వీడియో కాల్స్ చేస్తూ కూడా ఆ డాక్టర్‌ను మోసగాళ్లు బెదిరించారు. అయితే ఇటీవల సడెన్‌గా ఆమెకు కాల్స్ ఆగిపోయాయి. దీంతో ఆ మహిళా డాక్టర్ తన బంధువులకు ఈ విషయాన్ని చెప్పింది. జూలై 16వ తేదన గుజరాత్‌లోని సీఐడీ సైబర్ క్రైంకు ఫిర్యాదు అందింది. ఇండియాలోనే ఇది అతిపెద్ద డిజిటల్ అరెస్టు కేసు అని అధికారులు చెబుతున్నారు. ఒక్క వ్యక్తి నుంచి అంత మొత్తాన్ని కాజేయడం తొలిసారి అని అనుమానిస్తున్నారు. నెట్వర్క్‌లో భాగమైన నిందితుల కోసం పోలీసులు అన్వేషిస్తున్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భద్రతాబలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎన్‌కౌంటర్



**ఛత్తీస్‌గఢ్ :** ఛత్తీస్‌గఢ్‌లో భద్రతాబలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎన్‌కౌంటర్ జరుగుతోంది. సుక్మా జిల్లాలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయని సమాచారం అందుకున్న భద్రతాబలగాలు అక్కడికి వెళ్లి కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మావోయిస్టులు తారసపడటంతో ఎదురుకాల్పులు జరుగుతున్నాయి.సుక్మా డిస్ట్రిక్ట్ రెస్పాన్స్ గ్రూప్, సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్ స్పెషల్ టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఈ కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ విషయాన్ని సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ మీడియాకు వెల్లడించారు. ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# పహల్గాం దాడి ఉగ్రవాదుల్లో ముగ్గుర్ని హతమార్చాం



**న్యూఢిల్లీ:** ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో రెండో రోజు చర్చ కొనసాగుతోంది. ఈ చర్చ సందర్భంగా ఇవాళ షా మాట్లాడారు. పహల్గాం ప్రతీకారాన్ని ధృవీకరించారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని మట్టుబెట్టినట్లు వెల్లడించారు.'పహల్గాంలో పర్యాటకులను హత్య చేశారు. టూరిస్టులను ఉగ్రవాదులు అతికిరాతకంగా హత్య చేశారు. కుటుంబ సభ్యులు ముందే కాల్చి చంపారు. మంతం, పేరు అడిగి మరీ చంపడం దారుణం. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని హతమార్చం. ఈనెల 22న శాటిలైట్ ఫోన్ సిగ్నల్ ద్వారా ఉగ్రవాదుల కదలికలను గుర్తించాం. ఆపరేషన్ మహాదేవ్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఉగ్రదాడి జరిగిన రోజునే జమ్ము భద్రతపై సమీక్షించాం. ఉగ్రవాదులను ఆశ్రయం ఇచ్చిన వారిని కూడా అరెస్ట్ చేశాం. ఉగ్రశిబిరాలను మట్టిలో కలిపేశాం. ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, జమ్ము పోలీసులకు అభినందనలు' అని అమిత్ షా తెలిపారు. ఉగ్రవాదుల్ని హతమార్చాం అంటే విపక్షాలు సంతోషిస్తాయనుకున్నానని, కానీ సందేహాలు వ్యక్తం చేస్తున్నారంటూ షా వ్యాఖ్యానించారు.నెల నుంచి జల్లెడ పట్టి..జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్ సమీపంలో ఉన్న హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్టు నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో గడిచిన నెలరోజులుగా ఆ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. లష్కరే, జైషే ఉగ్రవాదుల కదలికల కోసం గడిచిన 14 రోజులుగా మరింత ముమ్మరంగా నిఘాను పెంచాయి. ఈ క్రమంలో దాచిగామ్ నేషనల్ పార్క్ పరిసరాల్లో రెండు రోజుల కిందట అనుమానస్పద కమ్యూనికేషన్లను భారత సైన్యం పసిగట్టింది. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో దాచిగామ్ నేషనల్ పార్క్ పరిసరాల్లో ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించిన భద్రతాదళాలు.. మెరుపు వేగంతో కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఉగ్రవాది సులేమాన్ షాతో పాటు పహల్గాం దాడికి కారణమైన మరో ఉగ్రవాది యాసిర్ హతమైనట్టు అధికారులు తెలిపారు. ఈ కాల్పుల్లో మరో ఉగ్రవాది అబూ హామ్‌జా కూడా హతమైనట్టు పేర్కొన్నారు. వీరందరూ విదేశీ ఉగ్రవాదులేనని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఆర్మీ, సీఆర్పీఎఫ్, జమ్ముకశ్మీర్ పోలీసులు పాలుపంచుకొన్నట్టు పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్ అనంతరం జరిపిన సోదాల్లో 17 గ్రెనెడ్లు, ఒక ఎం4 కార్బైన్, రెండు ఏకే 47 రైఫిల్స్‌ను భద్రతాదళాలు స్వాధీనం చేసుకొన్నాయి.

# ఆపరేషన్ సిందూర్‌పై చర్చ



**న్యూఢిల్లీ:** రాష్ట్రీయ లోకతాంత్రిక్ పార్టీ ఎంపీ హనుమాన్ బెనివాల్‌లోక్‌సభలో నవ్వులు పూయించారు. వాడివేడిగా ఆపరేషన్ సింధూర్‌పై చర్చ జరుగుతున్న సమయంలో ఆయన తన సెటైర్లతో ఆకట్టుకున్నారు. సోమవారం రాత్రి ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ సింధూర్ తర్వాత ఇండియాకు పాకిస్థాన్ భార్య అయ్యిందని, ప్రభుత్వం ఆమెను ఇంటికి తీసుకురావాలని ఆయన వ్యంగ్యంగా మాట్లాడారు. సిందూర్ అని ఎందుకు పేరు పెట్టారో తెలియదు, కానీ, పాకిస్థాన్‌కు ఇండియా సిందూరం పెట్టినట్లుగా ఉందని, హిందువుల నమ్మకం ప్రకారం భారతీయ మహిళలు తన భర్తను సిందూరంగా భావిస్తారని, పాకిస్థాన్‌కు భారత్ సిందూరం పెట్టిందని, అందుకే ఇండియాకు పాకిస్థాన్ భార్యగా మారిందని, ఇప్పుడు కేవలం వధువు అప్పగింతలు మాత్రమే మిగిలి ఉన్నట్లు ఎంపీ బెనివాల్ పంచ్ వేశారు. వెళ్లి పాకిస్థాన్‌కు ఇంటికి తీసుకురావాలని ఆయన డైలాగ్ విసిరారు. దీంతో సభలో నవ్వులు పూశాయి.ఆయన దగ్గర కూర్చున్న ఎంపీలు కూడా నవ్వును ఆపుకోలేకపోయారు. చాలా సీరియస్‌గా డిస్కషన్ జరుగుతున్న సమయంలో ఎంపీ బెనివాల్ వేసిన సెటైర్‌తో అన్ని పార్టీల సభ్యులు కాసేపు నవ్వుకున్నారు. ఓ దశలో తొందరగా ప్రసంగాన్ని ముగించుకోవాలని ఓ ఎంపీ అరవడంతో.. ఆయన వైపు చూస్తూ మీరు అరగంట మాటాడారు, నన్ను అప్పుడే ముగించేయమంటారా అని అన్నారు. అదే సమయంలో ప్యానల్ స్పీకర్ బజర్ బెల్ కొట్టడంతో మళ్లీ పంచ్ విసిరారు. అయిపోయిందా అంటూ వ్యంగ్యంగా రియాక్ట్ అయ్యారు. దీంతో మళ్లీ ఎంపీలు అందరూ నవ్వుకున్నారు.

# మాజీ మంత్రి శ్రీరాములు సంచలన కామెంట్స్ మట్టి తినే దుస్థితికి తెచ్చారు

- అందరికీ అన్నం పెట్టే రైతులకు ఆకలిచావులు
- యూరియా లేదు.. ఏడాదిన్నరలో 980 మంది ఆత్మహత్య
- సిద్ధరామయ్యను మైసూర్ ఒడయార్‌తో పోల్చడం సిగ్గుచేటు: మాజీ మంత్రి శ్రీరాములు ధ్వజం



**బళ్లారి(బెంగళూరు):** రాష్ట్రంలో రైతులకు యూరియా కొరత తీవ్రం అయ్యింది.. అందరికీ అన్నం పెట్టే రైతు కొప్పళ జిల్లాలో మట్టితిన్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏడాదిన్నర కాలంలో 980 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారంటూ మాజీ మంత్రి శ్రీరాములు ప్రభుత్వంపై మండిపడ్డారు. బళ్లారిలోని తన నివాసంలో రైతు సంఘం నాయకులు దరూరు పురుషోత్తమగౌడ, జిల్లా ఫర్టిలైజర్స్ యజమానుల సంఘం అధ్యక్షుడు ఐనాత్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోకా అనీల్ తదితర బీజేపీ నాయకులతో కలిసి ఆయన విలేకరు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆత్మహత్య చేసుకున్న రైతులకు కనీసం పరిహారం కూడా ఇవ్వలేదని, మైసూర్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్స వాలు ఎందుకు జరుపుకుంటుందో అర్థం కావడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు లకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. ఏటా అతివృష్టి, అనావృష్టి లతో అన్నదాత విల విలలాడుతున్నారన్నారు.రైతులకు యూరియాలు దొరక్క మట్టితింటూ నిరసన వ్యక్తం చేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం పంపే యూరియాను రాష్ట్రంల శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు అక్రమంగా పంపిస్తోందని ఆరోపించారు. సిద్దరామయ్య కుమారుడు యతేంద్ర తండ్రిని మైసూర్ రాజు ఒడయార్‌తో పోలుస్తూ డబ్బాలు కొట్టుకోవడం సిగ్గు చేటన్నారు. రైతుసంఘ నాయకుడు పురుషోత్తమ గౌడ, ఐనాత్‌రెడ్డి తదితరులు ప్రభుత్వంపై మండిపడ్డారు.


# యాపిల్ ఎలక్ట్రానిక్స్ హబ్‌గా తమిళనాడు

రూ.30 వేల కోట్ల పెట్టుబడులు
- 60 వేల మందికి ఉపాధి అవకాశాలు
- మంత్రి టీఆర్‌బీ రాజా



**చెన్నై:** తమిళనాడు రాష్ట్రం యాపిల్ సప్లయర్స్ అండ్ ఎకో సిస్టమ్ కంపెనీ (యాపిల్ ఎలక్ట్రానిక్స్) హబ్‌గా మారనుందని రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి టీఆర్‌బీ రాజా వెల్లడించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన తమిళనాడు ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ పథకం కింద రూ.30 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, 60 వేల మందికి ఉపాధి అవకాశాల రూపకల్పనే ధ్యేయంగా ముందుకుసాగుతున్నట్టు ఆయన తెలిపారు. సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... యాపిల్ గ్రూప్ ఆఫ్ కంపెనీలు దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే తమిళనాడులో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయన్నారు.రాష్ట్రంలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరా, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు ఇలాంటి అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. గత ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన తమిళనాడు ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ పథకం గతంలో కేంద్రం ప్రకటించిన పథకంతో సమానంగా ఉందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక రాయితీలను ప్రకటిస్తూ పెట్టుబడిదారులను ఆకర్షిస్తుందన్నారు.ఈ పథకం కింద రూ.30 వేల కోట్ల పెట్టుబడులు, 60 వేల ఉపాధి అవకాశాలను సృష్టించనున్నట్టు తెలిపారు. యాపిల్ కంపెనీని రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు తొలి ప్రాధాన్యత ఇచ్చామని, ఇది విజయవంతంగా పూర్తయిందన్నారు. రాష్ట్రంలోని మౌలికసదుపాయాలు, మానవవనరుల గురించి యాపిల్ కంపెనీ నిర్వాహకులు తెలుసుకుని, రాష్ట్రానికి తొలి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. యాపిల్‌కు వరల్డ్ సప్లయర్‌గా ఫాక్స్‌కాన్ ఉందని, ఇది తమిళనాడులో ఐఫోన్లు తయారు చేసి తొలి ఫోన్లను అమెరికాకు ఎగుమతి చేసిందన్నారు.దేశంలో తమిళనాడు రాష్ట్రం నుంచి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ఎగుమతులు 41.2 శాతం ఉందని, 2024–25 ఆర్థిక సంవత్సరంలో 14.65 బిలియన్ డాలర్ల విలువ చేసే ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను ఎగుమతి చేసినట్టు ఆయన వెల్లడించారు. వచ్చే మూడు లేదా నాలుగేళ్ళలో ఇది 50 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కొత్త ప్లాంట్ ద్వారా కెమెరా, డిస్‌ప్లే మాడ్యుల్స్, సెన్సార్లు, హెచ్‌డీఐ, లి-ఐయాన్ సెల్స్ వంటి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను తయారు చేస్తామని మంత్రి రాజా వెల్లడించారు.

# నా చేతులారా వాళ్లను కాల్చి చంపాలనుకునేదాన్ని ఉగ్రవాదుల హతంపై పహల్గాం మృతుడి భార్య



**పహల్గామ్:** మారణహోమానికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని సోమవారం భద్రతాబలగాలు మట్టుబెట్టడంపై బాధిత కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. జమ్ముకశ్మీర్ లోని శ్రీనగర్ లో పహల్గాం దాడి ఉగ్రవాదులు దాగి ఉన్నట్లు సమాచారం అందుకున్న భద్రతాబలగాలు 'ఆపరేషన్ మహదేవ్ పేరుతో వారిని వెతికి హతమార్చాయి. దాంతో ఆ ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి కుటుంబాలు తమకు న్యాయం జరిగిందని హర్షం వ్యక్తం చేస్తున్నాయి.పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన సంతోష్ జగ్దాలే భార్య ప్రగతి జగ్దాలే ముగ్గురు ఉగ్రవాదుల హతంపై స్పందించారు. ఆ ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో తమకు కొంత న్యాయం జరిగిందని అన్నారు. ఉగ్రవాదులను అంతం చేసిన భారత సైన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. గడిచిన మూడు నెలలుగా తాను ఎంత క్షోభను అనుభవిస్తున్నానో మాటల్లో చెప్పలేనని ఉబికి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ గద్గద స్వరంతో చెప్పారు.'నువ్వు పహల్గాంకు ఎందుకు వెళ్లావు..? నువ్వు తప్పకుంట ఇంటికి తిరిగి రావాలి' అని తాను తరచూ ఆయన ఫొటోతో మాట్లాడుతున్నానని మీడియా ప్రతినిధులతో చెబుతూ ప్రగతి జగ్దాలే ఏడ్చారు. ఆ ఉగ్రవాదుల అంతం వార్త కోసం తాము ఇన్నాళ్లుగా ఎదురుచూస్తున్నామని చెప్పారు. ఇప్పుడు ఆ వార్త విన్నామని అన్నారు. 'నా దగ్గర తుపాకీ ఎందుకు లేదు..? ఉంటే నేనే ఆ ఉగ్రవాదులను నా చేతులారా కాల్చి చంపేదాన్ని' అని తాను తరచూ అనుకునేదాన్నని ప్రగతి జగ్దాలే చెప్పారు.

# పులుల సంరక్షణతోనే జీవ వైవిధ్యం

దేశంలో పర్యావరణంపై ఆసక్తి, శ్రద్ధ లేకుండా పోతోంది. మానవజాతి పెరుగుతున్నా కొద్దీ పక్కనున్న ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారు. అడవులను నరికివేస్తూనే..అడవుల్లోని జంతుజాలాన్ని కూడా ఉనికి లేకుండా చేస్తున్నారు. దీంతో ఇప్పటికే అనేక జంతుజాతులు నశించాయి. మనం బతికితే చాలు...మిగతా ఏమయితే ఏమిటన్న ధోరణి ప్రబలింది. ఈ క్రమంలో అడవుల విధ్వంసంతో జంతుజాలం నశిచింది. ప్రపంచవ్యాప్తంగా విచక్షణారహితంగా అడవుల నరికివేత, అక్రమంగా పులులను వేటాడడం లాంటి పలు కారణాలతో పులి జాతి అంతరించే స్థాయికి చేరడాన్ని గమనించిన ఐరాస ప్రతి ఏట 29 జులై రోజున 'అంతర్జాతీయ పులుల దినం లేదా ఇంటర్నేషనల్ టైగర్ డే' పాటించడం ఆనవాయితీగా మారింది.2010 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. పులులను కాపాడుకోవడం, వాటి ఆవాసాలను సంరక్షించుకోవడం, అక్రమ వేటలను మానుకోవడం, జీవ వైవిధ్యాన్ని కాపాడే ప్రాధాన్యాన్ని వివరించడం, టైగర్ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం చేయడం, టైగర్ రిజర్వులను నియంత్రించడం లాంటి అంశాల్లో సామాన్య జనాలకు అవగాహన కల్పించడానికి ఈ వేదికలను ఉపయోగించు కోవాలి. పిల్లుల జాతిలో అతి పెద్ద జంతువుగా పులికి పేరుంది. 2025 అంతర్జాతీయపులుల దినం ఇతివృత్తంగా మానవులు, పులులు సామరస్యంగా సహజీవనం చేయడం అనే అంశాన్ని తీసుకొని పులుల సంరక్షణ బాధ్యతలను వివరించడం జరుగుతుంది. ఇటీవల ఆదిలాబాద్ కవ్వాల్ రక్షణకు జివో 49ని తెలంగాణ ప్రభుత్వం తీసుకుని వచ్చింది. కానీ అందరూ ఒక్కటై దానిని అమలు చేయకుండా పక్కన పెట్టేయించారు. ఇది అమలు చేయడం ద్వారా పులుల సంరక్షణకు ప్రభుత్వం పూనుకుంది. కానీ గిరిజనుల జీవనానికి ఇది అడ్డంకిగా మారిందన్న ఆందోళనతో పులుల రిజర్వ్ ఫారెస్ట్ రోణ పక్కకు పోయింది. నిజానికి ఇది ప్రజల్లో అవగాహన లేమి కారణంగా జరుగుతున్నదని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. జీవవైవిధ్యం కాపాడటంలో పులులదే కీలక పాత్ర. వాటికి తెలియకుండానే అడవిని రక్షిస్తుంటాయి. మొక్కలను తినే జీవ జాతులను పులులు చంపి తినకపోతే అడవి అనేదే మిగలదు. అంటే...సాధు జంతువులను వేటాడుతూ...పులులు ఎకో సిస్టమ్‌ను బ్యాలెన్స్ చేస్తూ ఉంటాయి. అయితే రానురాను అడువులు ధ్వంసం అవుతుండటం వల్ల వీటి సంఖ్య తగ్గిపోతోంది. అవి మనుగడ సాగించేందుకు అవసరమైన అనుకూల వాతావరణం ఉండటం లేదు. క్రమంగా ఇవి అంతరించి పోయే ప్రమాదముందని గుర్తించిన ప్రపంచ దేశాలు, ఏటా జులై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం జరుపుకుంటున్నారు. ఒక పులి సంచరించే ప్రాంతం చుట్టు-పక్కల మరో పులి సంచరించదు. 25 నుంచి 30 కిలోమీటర్ల మేర ఒక పులి తన సామ్రాజ్యాన్ని విస్తరిస్తుంది. ఫుడ్ పిరమిడ్లో అగ్రస్థానంలో ఉండే పెద్ద పులి నివసించాలంటే ప్రాంతంలో చిన్నా, పెద్దా అన్నిరకాల జంతువులుండాలి. మంచి వర్షపాతం ఉండాలి. పచ్చని చెట్లతో కూడిన దట్టమైన అడవి ఉండాలి. అందుకే ఈ లెక్కన ఇప్పుడున్న పరిస్థితుల్లో పులులు. మనుగడ సాగించాలంటే...ఒక్కో పులికి 25 వేల ఎకరాల అడవిని కాపాడుకోవాల్సి ఉంటుందని శాస్త్రవేత్తలు తేల్చిచెప్పారు. పులి తన ప్రాణాలు కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతుంది. మూడేళ్ల వయసు రాగానే మగ పులి సొంత సామ్రాజ్యాన్ని ఏర్పాటు- చేసుకునేందుకు ప్రయత్నిస్తుంది. అయితే అడవులు అంతరించడం. అడవుల్లో నీటి కుంటలు లేకపోవడం వల్ల అవి ఊళ్లలోకి రావాల్సి వస్తోంది. నగరాలు పెరగడం, గ్లోబలైజేషన్ ప్రభావంతో రానురానూ అడవులు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం 93 శాతం పులులు కేవలం అడవుల నరికివేత వల్ల అంతరించిపోతున్నాయని ఓ అధ్యయనంలో వెల్లడైంది. ప్రస్తుతం కేవలం ఆరు జాతుల పులులు మాత్రమే మనుగడ సాగిస్తున్నాయి. అనేక టైగర్ జాతులు పూర్తిగా అంతరించి పోయాయి. 2014 వరల్డ్ వైడ్ ఫండ్ లెక్కల ప్రకారం వందేళ్ల క్రితం సుమారు లక్ష పులులు ఉండేవి. కాని ఇప్పుడు వాటి సంఖ్య చాలా తగ్గిపోయిందని వరల్డ్ వైడ్ ఫండ్ ప్రతినిధులు చెబుతున్నారు. పులుల సంఖ్య పెరగడం ద్వారా ఎకో సిస్టమ్ లో మంచి మార్పులు రావడమే కాకుండా, పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుంది. పులులు అంతరిపోవడానికి వేట, వాతావరణ మార్పులతోపాటు, పులులకు షెల్టర్ లేకపోవడం ముఖ్యమైన కారణాలు. అంతేకాకుండా పులి చర్మం, గోళ్లకు డిమాండ్ ఎక్కువ. చైనీస్ సంప్రదాయ వైద్యంలో పులుల గోళ్లు, పళ్లు,మీసాలను ఉపయోగిస్తారు. వాటి కోసం ఎక్కువ ధర చెల్లిస్తారు. అందుకే పులుల వేట, స్మగ్లింగ్ కూడా ఎక్కువైంది. దీంతో కేవలం పులులు మాత్రమే కాదు. ఇతర జీవులు కూడా మెల్లగా అంతరిస్తున్నాయి.



కేవలం అడవుల్ని నరకడం వల్లనే దాదాపు 93 శాతం వాటి ఆవాసాల్ని కోల్పోతున్నాయని సర్వేలు వెల్లడిస్తున్నాయి. పులుల్ని, ఇతర జీవరాశులని సంరక్షించుకోవాలంటే.. అడవులు పెంచడం ఒక్కటే మార్గమని అర్ధం అవుతోంది. అడవులు పెంచడం ద్వారా జంతువుల సంఖ్య పెరగడమే కాక పర్యావరణ సమతుల్యం కూడా దెబ్బ తినకుండా ఉంటుంది. వాతావరణ మార్పులు కూడా జంతువులు అంతరించ డానికి కారణం కాబట్టి వాతావరణ మార్పులకు కారణమయ్యే ప్లాస్టిక్, కాలుష్యాన్ని కూడా తగ్గించాల్సిన అవసరం ఏర్పడింది. మనదేశంలో పులి జాతీయ జంతువు కాబట్టి కొంతవరకైనా పులుల్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా మేలుకోకపోతే ఉన్న నాలుగు జాతులు కూడా అంతరించిపోయే ప్రమాదం ఉందని గత కొన్నేళ్ల నుంచి -టైగర్ ట్రాకర్స్ వ్యవస్థను బలపరిచారు. ప్రపంచం మొత్తం మీద ఉన్న పులుల సంఖ్యలో సగానికి పైగా మనదేశంలోనే ఉన్నాయి. పులులను కాపాడుకోవల్సిన అవసరాన్ని మనదేశం ఎప్పుడో గుర్తించింది. 1972లోనే పులిని జాతీయ జంతువుగా ప్రకటించి, తర్వాతి ఏడాది నుంచే ప్రాజెక్ట్ -టైగర్ ను ప్రారంభించింది. పులుల్ని వేటాడే వారికి కఠిన శిక్షలు పడేలా చట్టాలు తెచ్చినా వాటి అంతం ఆగడం లేదు. వాటి సంరక్షణ కోసం భారీగా ఖర్చు చేస్తోంది. దేశంలో 48 పులి అభయారణ్యాలను ఏర్పాటు-చేశారు. పులుల సంరక్షణ గురించి ప్రజల్ని చైతన్యవంతం చేయడం కోసం ఇండియన్ రైల్వే.. టైగర్ ఎక్స్ ప్రెస్ పేరుతో టూరిస్ట్ రైలు సేవలను కూడా ప్రారంభించింది. ఇందులో బాంధవగడ నేషనల్ పార్క్, కన్హా నేషనల్ పార్కులో సఫారీకి తీసుకెళ్తారు.ప్రపంచ పులుల్లో 70 శాతానికి పైగా భారత్‌లోనే ఉండడం విశేషం. నేడు పులుల జనాభా వృద్ధి రేటు- 6.1 శాతంగా నమోదు అవుతున్నది. శతాబ్దం క్రితం ఒక లక్ష వరకు ఉన్న పులులు నేడు కేవలం 5,574 మాత్రమే ఉండడం విచారకరం. పులుల ఆవాసాలైన అడవులను నరికి వేస్తుండటంతో అవి మానవ ఆవాసాల్లోకి రావడం జరుగుతోంది.పులుల్లో చాలా అరుదైన జాతి రాయల్ బెంగాల్ -టైగర్.. దీన్ని పెద్ద పులి అంటారు. ఇది మన దేశం లో తప్ప ఇంకెక్కడా కనిపించదు. బెంగాల్ టైగర్ గాండ్రింపు సుమారు రెండు కిలోమీటర్ల వరకు వినిపిస్తుంది. ఇవి రోజుకు దాదాపు 21 కిలోల మాంసాన్ని తింటాయి. పులులు అడవిలో వాటి సరిహద్దులను అవే ఏర్పాటు-చేసుకుంటాయి. ఆ సరిహద్దులకు లోపల వున్న ప్రాంతమంతా వాటి సామ్రాజ్యమే. ఆ సరిహద్దులు దాటి ఏ ఇతర జంతువులు ప్రవేశించినా వాటికి మరణమే. ప్రతి రెండేళ్లకోసారి ఒక్కో ఆడ పులి రెండు నుంచి నాలుగు పిల్లల్ని పెడుతుంది. పులులు పుట్టిన 18 నెలల నుంచే వేటాడటం మొదలు పెడతాయి. ఇలా పులలను రక్షిస్తేనే అడవులు పెరుగుతాయి. జీవవైవిధ్యం పెరుగుతుందని గుర్తించాలి.

# ఆపరేషన్ సిందూర్‌పై సందేహాలా..




**• ఉగ్రమూకలను అణచివేస్తే సంతోషించరా • మాజీ హోంమంత్రికి ఉగ్రవాదుల ఉనికిపై అనుమానాలా • లోక్‌సభలో సిందూర్ అమిత్ షా ప్రసంగం • చిదంబరం వ్యాఖ్యలపై గట్టిగా కౌంటర్ • ముగ్గురు పహల్గా ఉగ్రవాదులను మట్టుబెట్టామని వెల్లడి**

**న్యూఢిల్లీ,జూలై29:** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారణంగా ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ చేపట్టిన ఆపరేషన్‌పై విపక్షాలు సంతోషం వ్యక్తం చేస్తాయనుకుంటే.. సందేహాలు వ్యక్తం చేస్తున్నాయంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. లోక్‌సభలో రెండో రోజు మంగళవారం జరిగిన ప్రత్యేక చర్చలో అమిషా మాట్లాడారు. విపక్ష ఎంపీల వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు. ఉగ్రవాదులను మట్టు-బెడితే ఆనందం వ్యక్తం చేస్తారనుకున్నానని.. కానీ విపక్ష సభ్యులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో ఒకసారి ఆలోచించాలంటూ హితవుపలికారు. ఉగ్రవాదులు చనిపోయారన్న సంతోషం వారిలో కనిపించలేదని చెప్పారు. ఉగ్రవాదులు పాక్ నుంచే వచ్చారనేందుకు.. ఆధారాలు ఉన్నాయా అన్న చిదంబరం ప్రశ్నకు అమిత్ షా స్పందించారు. పాక్‌ను కాపాడే ప్రయత్నం చేస్తున్నారా.. అని ప్రశ్నించారు. పాక్‌కు క్లీన్‌చిట్ ఇవ్వాల్సిన అవసరం ఏంటంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా మాట్లాడటం తగదని హితవు పలికారు. ఉగ్రవాదులు పాకిస్తాన్ నుంచి వచ్చారనేందుకు తమ వద్ద ఆధారాలున్నాయని స్పష్టం చేశారు. ఉగ్రవాదుల నుంచి కొన్ని పాక్ వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నామని అమిత్‌షా క్లారిటీ ఇచ్చారు.ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నట్లు- కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. పహల్గాం ప్రతీకారాన్ని ధృవీకరించారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని మట్టుబెట్టినట్లు వెల్లడించారు. పహల్గాంలో పర్యాటకులను హత్య చేశారు. టూరిస్టులను ఉగ్రవాదులు అతికిరాతకంగా హత్య చేశారు. కుటుంబ సభ్యులు ముందే కాల్చి చంపారు. మంతం, పేరు అడిగి మరీ చంపడం దారుణం. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని హతమార్చం. ఈనెల 22న శాటిలైట్ ఫోన్ సిగ్నల్ ద్వారా ఉగ్రవాదుల కదలికలను గుర్తించాం. ఆపరేషన్ మహాదేవ్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఉగ్రదాడి జరిగిన రోజునే జమ్ము భద్రతపై సమీక్షించాం. ఉగ్రవాదులను ఆశ్రయం ఇచ్చిన వారిని కూడా అరెస్ట్ చేశాం. ఉగ్రశిబిరాలను మట్టిలో కలిపేశాం. ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, జమ్ము పోలీసులకు అభినందనలు' అని అమిత్ షా తెలిపారు. ఉగ్రవాదుల్ని హతమార్చాం అంటే విపక్షాలు సంతోషిస్తాయనుకున్నానని, కానీ సందేహాలు వ్యక్తం చేస్తున్నారంటూ షా వ్యాఖ్యానించారు. జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్ సమీపంలో ఉన్న హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్టు- నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో గడిచిన నెలరోజులుగా ఆ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. లష్కరే, జైషే ఉగ్రవాదుల కదలికల కోసం గడిచిన 14 రోజులుగా మరింత ముమ్మరంగా నిఘాను పెంచాయి. ఈ క్రమంలో దాచిగామ్ నేషనల్ పార్క్ పరిసరాల్లో రెండు రోజుల కిందట అనుమానస్పద కమ్యూనికేషన్లను భారత సైన్యం పసిగట్టింది. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో దాచిగామ్ నేషనల్ పార్క్ పరిసరాల్లో ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించిన భద్రతాదళాలు.. మెరుపు వేగంతో కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఉగ్రవాది సులేమాన్ షాతో పాటు- పహల్గాం దాడికి కారణమైన మరో ఉగ్రవాది యాసిర్ హతమైనట్టు- అధికారులు తెలిపారు. ఈ కాల్పుల్లో మరో ఉగ్రవాది అబూ హామ్‌జా కూడా హతమైనట్టు- పేర్కొన్నారు. వీరందరూ విదేశీ ఉగ్రవాదులేనని తెలిపారు. అమాయక పౌరులపై దాడులు చేస్తే మా ప్రతి స్పందన గట్టిగా ఉంటుందని హెచ్చరించారు. విపక్ష ఎంపిల వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని, ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో ఒకసారి ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. పహల్గాం దాడి బాధితులను కలిసి వారి బాధలు తెలుసుకున్నామని, పహల్గాం దాడి ఘటనను వెంటనే ఎన్‌ఐఎకు అప్పగించామని వివరించారు. ఉగ్రవాదులు పాక్ నుంచి వచ్చారనేందుకు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, ఉగ్రవాదుల నుంచి పాక్‌లో తయారైన పత్రాలు, చాక్లెట్లు- స్వాధీనం చేసుకున్నామని, కేంద్ర హోంశాఖ మంత్రిగా పని చేసిన వ్యక్తి ఇలా మాట్లాడడం తగదని అమిత్ షా చురకలంటించారు. దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు గమనించి కాంగ్రెస్ నేతలు మాట్లాడాలని సూచించారు. ఆపరేషన్ సింధూర్‌పై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరంగా చెప్పారని, పహల్గాం తీవ్రవాదుల దాడిలో 26 మంది మృతి చెందారని, మృతుల్లో నేపాల్ వ్యక్తి కూడా ఉన్నారని తెలియజేశారు. పహల్గాం దాడి కేవలం పర్యాటకులపై కాదు అని, దేశంపై దాడి పరిగణించాలని, పహల్గాంలో దాడి చేసిన ఉగ్రవాదులను మట్టిలో కలిపేశామని, ఆనాడు 140 కోట్ల మంది ప్రజల గుండెచప్పుడును ప్రధాని మోడీ వివరించారని అమిత్ షా గుర్తు చేశారు. పాక్‌పై దాడులు చేసేందుకు భద్రతాబలగాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, మే 7న ఆపరేషన్ సింధూర్ చేపట్టామని, 9న ఉగ్ర శిబిరాలు ధ్వంసం చేశామని, మన భద్రతా దళాల దాడుల్లో ఒక్క పాక్ పౌరుడు కూడా మరణించలేదన్నారు.



# కేరళ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్ష

**• రద్దయ్యిందన్న వార్తలను ఖండించిన కేంద్రం**

**న్యూఢిల్లీ,జూలై29:** కేరళ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దయ్యిందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఖండించాయి. అవన్నీ అవాస్తవమని పేర్కొన్నాయి. నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దు కాలేదని మంగళవారం వెల్లడించాయి. నిమిష ఉరిశిక్షను రద్దు చేస్తూ యెమెన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందంటూ భారత గ్రాండ్ ముఫ్తీ, సున్నీ మత ప్రబోధకుడు కాంతపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ కార్యాలయం సోమవారం రాత్రి ప్రకటించింది. అక్కడ జరిగిన ఉన్నత స్థాయి భేటీలో ఉరిశిక్షణ రద్దు నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపింది. దీనిపై భారత విదేశాంగ శాఖ వర్గాలు తాజాగా స్పందించాయి. నిమిష మరణశిక్ష రద్దు చేశారంటూ కొంత మంది వ్యక్తులు నుంచి వచ్చిన సమాచారం అవాస్తవమని వెల్లడించాయి. ఈ విషయంపై తమకు యెమెన్ నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక సమాచారం రాలేదని పేర్కొన్నాయి.యెమెన్ జాతీయుడు మహద్ హత్యకేసులో నిమిష ప్రియకు మరణశిక్ష పడిన విషయం తెలిసిందే. మహద్‌తో కలిసి ఆమె వ్యాపారం చేసింది. అయితే ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ఆమె తన పాస్‌పోర్టు కోసం అడిగింది. కానీ పాస్‌పోర్టు ఇచ్చేందుకు మహద్ నిరాకరించడంతో అతడికి మత్తుమందు ఇచ్చి తీసుకునేందుకు నిమిష ప్రయత్నించింది. అయితే డోస్ ఎక్కువ కావడంతో మహద్ మరణించాడు.దాంతో యెమెన్ పోలీసులు నిమిషను హత్య కేసులో అరెస్ట్ చేశారు. ఆమె ముందు గా స్థానిక కోర్టు మరణశక్ష విధించింది. ఆ శిక్షను టాప్ కోర్టు సమర్థించింది.

# మటన్, చికెన్ తిన్న తర్వాత వీటిని తీసుకుంటున్నారా? జాగ్రత్త!



చాలామంది ఎక్కువగా నాన్‌వెజ్ ను ఇష్టపడుతూ ఉంటారు. తరచూ మటన్, చికెన్ తింటూ ఉంటారు. చాలా మందికి ముక్క లేనిదే ముద్ద దిగదు. రకరకాల వంటకాలను చేసి నాన్ వెజ్ ను ఇష్టంగా తినేవారు మాంసాహారం తిన్న తర్వాత కొన్ని రకాల ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.

**మాంసాహారం తిన్నాక ఏ ఆహారాలను అసలు తీసుకోకూడదు?** మటన్, చికెన్ తిన్న తర్వాత ఎటువంటి ఆహారాలను అసలు తీసుకోకూడదు ? తీసుకుంటే ఎటువంటి సమస్యలు వస్తాయి? అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. చికెన్ లేదా మటన్ తిన్న తర్వాత పొరపాటున కూడా తేనెను తీసుకోకూడదు. మటన్, చికెన్ శరీర ఉష్ణోగ్రతను పెంచుతుంది. ఇదే సమయంలో తేనె కూడా ఉష్ణోగ్రతను మరింత పెంచుతుంది. దీని కారణంగా చర్మ సమస్యలు, రక్తపోటు పెంగడం వంటి సమస్యలు వస్తాయి. అందువల్ల తేనెను అవాయిడ్ చేయండి.

**టీ తాగడం :** చాలామంది నాన్ వెజ్ ఆహారం తిన్న తర్వాత టీ తాగుతారు. మటన్ తిన్న వెంటనే టీ తాగడం ఆరోగ్యానికి చాలా హాని చేస్తుంది. టీలో టానిన్స్ అనే పదార్థం మాంసాహారంలోని ప్రోటీన్ లతో కలిసి జీవక్రియను అడ్డుకుంటుంది. దీంతో అజీర్ణం, గుండెల్లో మంట, ఎసిడిటీ వంటి సమస్యలు వస్తాయి. కనుక నాన్ వెజ్ ఆహారం తిన్న తర్వాత టీ కి దూరంగా ఉండాలి.

**పాలు తాగడం :** చాలామంది నాన్ వెజ్ తిన్న తర్వాత తెలియక పాలు తాగుతారు. అయితే నాన్ వెజ్ తిన్న తర్వాత పాలు తాగడం మంచిది కాదు. ఈ రెండు భిన్న లక్షణాలు జీర్ణక్రియలో ఇబ్బందులు కలిగించే అవకాశం ఉంటుంది. నాన్ వెజ్ తిన్న తర్వాత పాలు తాగడం వల్ల కొంతమంది గ్యాస్ట్రిక్ సమస్యలను ఎదుర్కొంటారు.

**నాన్ వెజ్ తిన్నాక ఆహారాల విషయంలో జాగ్రత్త :** అందుకే పొరపాటున కూడా నాన్వెజ్ తిన్న తర్వాత తీసుకునే ఆహార పదార్థాలు ఎంపిక విషయంలో నిర్లక్ష్యం వహించకూడదు ఒకవేళ నిర్లక్ష్యంగా ఏది పడితే అది తింటే ఏది పడితే అది తాగితే కచ్చితంగా అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

# ఏ బ్లడ్ గ్రూప్ వారికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఎక్కువ?



బ్రెయిన్ స్ట్రోక్, దీనినే మెదడు పోటు అని కూడా అంటారు, ఇది మెదడుకు రక్తం సరఫరా చేసే నాళాలలో ఆటంకం ఏర్పడినప్పుడు సంభవిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా మరణాలకు , వైకల్యాలకు ఇది ఒక ప్రధాన కారణం. బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి అనేక కారణాలు ఉన్నాయి, అందులో అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ధూమపానం, ఊబకాయం వంటివి ముఖ్యమైనవి. అయితే, ఇటీవల జరిగిన పరిశోధనల్లో, ఒక వ్యక్తి యొక్క బ్లడ్ గ్రూప్ కూడా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదాన్ని ప్రభావితం చేస్తుందని కనుగొన్నారు.

**పరిశోధనలు ఏం చెబుతున్నాయి?:** అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ జర్నల్ అయిన 'న్యూరాలజీ'లో ప్రచురించబడిన ఒక అధ్యయనం ప్రకారం, A బ్లడ్ గ్రూప్ ఉన్నవారికి 60 సంవత్సరాల కంటే ముందే బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తేలింది. ఈ అధ్యయనంలో, ప్రపంచవ్యాప్తంగా 17,000 మంది స్ట్రోక్ రోగులు , 6,00,000 మంది ఆరోగ్యకరమైన వ్యక్తుల డేటాను విశ్లేషించారు. ఈ విశ్లేషణలో, A' బ్లడ్ గ్రూప్ ఉన్నవారికి ఇతరులతో పోలిస్తే 16% ఎక్కువ ప్రమాదం ఉందని కనుగొన్నారు. అదే సమయంలో, O' బ్లడ్ గ్రూప్ ఉన్నవారికి స్ట్రోక్ వచ్చే ప్రమాదం తక్కువగా ఉందని గుర్తించారు.

**ఎందుకు ‘ఇూ బ్లడ్ గ్రూప్‌కు ఎక్కువ ప్రమాదం?:** »A' బ్లడ్ గ్రూప్ ఉన్నవారిలో రక్తం గడ్డకట్టే అవకాశం ఎక్కువగా ఉంటుందని పరిశోధకులు భావిస్తున్నారు. రక్తం గడ్డకట్టడం అనేది స్ట్రోక్‌కు దారితీసే ప్రధాన కారణాలలో ఒకటి. అయితే, దీనికి ఖచ్చితమైన కారణాలు ఇంకా పూర్తిగా అర్థం కాలేదు. మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉంది. అయితే ఇతర అంశాలు కూడా పరిగణలోకి తీసుకుంటే 60 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారిలో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. పురుషులతో పోలిస్తే మహిళల్లో ఈ ప్రభావం కొంచెం ఎక్కువగా ఉండవచ్చు. అధిక రక్తపోటు, మధుమేహం వం టి ఇతర ప్రమాద కారకాలు ఉన్నవారిలో బ్లడ్ గ్రూప్ ప్రభావం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. »A' బ్లడ్ గ్రూప్ ఉన్నవారికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం కొంచెం ఎక్కు వగా ఉన్నప్పటికీ, ఇది ఒక చిన్న ప్రమాద కారకం మాత్రమే అని గుర్తుంచుకోవాలి. బ్లడ్ గ్రూప్ ఏమైనప్పటికీ, ఆరోగ్యకరమైన జీవనశై లిని పాటించడం, రక్తపోటు , కొలెస్ట్రాల్ స్థాయి లను నియంత్రణలో ఉంచుకోవడం, ధూమ పానం మానేయడం , క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా స్ట్రోక్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు.

# అధిక బరువు తగ్గాలని చూస్తున్నారా..?

## అయితే ఈ పండ్లను మీ డైట్‌లో చేర్చుకోండి..!



అధిక బరువును తగ్గించుకునేందుకు చాలా మంది అనేక రకాల ప్రయత్నాలు చేస్తుంటారు. సరైన సమయానికి ఆహారం తినడం, వ్యాయామం చేయడం, వేళకు నిద్రపోవడం, సరైన డైట్‌ను పాటించడం వంటివి చేస్తుంటారు. అయితే బరువును తగ్గించడంలో మనం తినే ఆహారం ఎంతో ముఖ్య పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా మనం తినే ఆహారంలో భాగంగా పలు రకాల పండ్లను తీసుకోవాల్సి ఉంటుంది. ఇవి పోషకాలను అందించడమే కాదు మన శరీరానికి శక్తి వచ్చేలా చేస్తాయి. అలాగే అధిక బరువును తగ్గిస్తాయి. మీరు గనక బరువు తగ్గించుకోవాలనుకునే ప్రణాళికలో ఉంటే కచ్చితంగా ఈ పండ్లను డైట్‌లో చేర్చుకోవాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ పండ్ల వల్ల బరువును త్వరగా తగ్గించుకునేందుకు వీలుంటుందని అంటున్నారు.

**యాపిల్, బెర్రీలు..**

యాపిల్ పండ్లు ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి ఫేవరెట్ పండ్లుగా ఉన్నాయి. ఈ పండ్లు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో ఫైబర్, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఈ పండ్లలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. వీటి గ్లైసీమిక్ ఇండెక్స్ కూడా చాలా తక్కువే. అందువల్ల యాపిల్ పండ్లను తింటే ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయ పడుతుంది. బ్లూ బెర్రీలు, స్ట్రాబెర్రీలు, రాస్ప్ బెర్రీలను ఆహారంలో భాగం చేసుకుంటే బరువును త్వరగా తగ్గించుకోవచ్చు. ఈ పండ్లలో యాంటీ ఒబెసిటీ గుణాలు ఉంటాయి. అందువల్ల వీటిని తింటే శరీరంలోని కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ బీపీ, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. శరీరంలోని కొవ్వు కరిగేలా చేస్తాయి.

**నారింజ, పుచ్చకాయలు..**

నారింజ పండ్లలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉంటుంది. వీటిని రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అధిక బరువును త్వరగా తగ్గించుకోవచ్చు. నారింజ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఇది మెటబాలిజం పెరిగేందుకు దోహదం చేస్తుంది. తరచూ నారింజ పండ్లను తింటుంటే జీర్ణక్రియ మెరుగు పడుతుంది. కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. అధిక బరువు తగ్గుతారు. పుచ్చకాయలు, ఖర్బూజాల్లో నీటి శాతం అధికంగా ఉంటుంది. క్యాలరీలు కూడా వీటిల్లో తక్కువగానే ఉంటాయి. కనుక బరువు తగ్గాలనుకునే వారికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. ఈ పండ్లను తినడం వల్ల ఎక్కువ సేపు ఉన్నా కడుపు నిండిన భావనతో ఉంటారు. దీంతో బరువు తగ్గడం సులభతరం అవుతుంది.

**దానిమ్మ, బొప్పాయి..**

దానిమ్మ పండ్లలో పొటాషియం, మెగ్నిషియం, విటమిన్ సి, జింక్ అధికంగా ఉంటాయి. ఇవి అధిక బరువు తగ్గేందుకు ఎంతో సహాయం చేస్తాయి. దానిమ్మ పండ్లలో ఆంథో సయనిన్స్, టానిన్స్ అధికంగా ఉంటాయి. ఇవి బరువు తగ్గేందుకు ఉపయోగపడతాయి. దానిమ్మ పండ్లను రోజూ తింటుంటే బరువును తేలిగ్గా తగ్గించుకోవచ్చు. అధిక బరువు తగ్గేందుకు బొప్పాయి పండు కూడా మేలు చేస్తుంది. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం బొప్పాయి పండ్లలో ఉండే పపైన్ అనే ఎంజైమ్ శరీర మెటబాలిజంను పెంచుతుంది. దీంతో మనం తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. ఫలితంగా శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చూసుకోవచ్చు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. ఇలా పలు రకాల పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే దీంతో అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు.

# మీకు గుల్కండ్ గురించి తెలుసా..?దీన్ని రోజూ తింటే.. ఎన్నో లాభాలు..!

మనకు ఆరోగ్యాన్ని అందించే ఆహారాలు మన చుట్టూనే ఎన్నో ఉన్నాయి. కానీ అలాంటి ఆహారాల గురించి చాలా మందికి తెలియదు. వాటి గురించి మనం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాంటి ఆహారాల్లో గుల్కండ్ కూడా ఒకటి.ఎ మనకు ఆరోగ్యాన్ని అందించే ఆహారాలు మన చుట్టూనే ఎన్నో ఉన్నాయి. కానీ అలాంటి ఆహారాల గురించి చాలా మందికి తెలియదు. వాటి గురించి మనం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాంటి ఆహారాల్లో గుల్కండ్ కూడా ఒకటి. చాలా మందికి దీని గురించి తెలియదు. కానీ స్వీట్ పాన్ తినేవారికి మాత్రం తెలుస్తుంది. ఎందుకంటే స్వీట్ పాన్‌లో గుల్కండ్‌ను కూడా వేస్తారు. ఇది ఎంతో తియ్యగా, అద్భుతమైన రుచిని కలిగి ఉంటుంది. వాస్తవానికి మనకు గుల్కండ్ నేరుగా తినేందుకు కూడా లభిస్తుంది. కానీ దీని గురించి చాలా మందికి తెలియకపోవడం వల్ల దీన్ని ఎవరూ తినడం లేదు. ఇది చాలా అద్భుతమైన ఆహారమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

**వేడి తగ్గుతుంది..**

గులాబీ పువ్వుల రెక్కలతో గుల్కండ్‌ను తయారు చేస్తారు. దీనికి శరీరాన్ని చల్లబరిచే గుణం ఉంటుంది. కనుక దీన్ని వేసవిలో ఎక్కువగా తింటుంటారు. ఇక చాలా చోట్ల లస్సీ, ఫాలూదా వంటి పానీయాల తయారీలోనూ కొందరు గుల్కండ్‌ను వాడుతుంటారు. ఈ క్రమంలోనే గుల్కండ్‌ను తింటుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. గుల్కండ్‌ను కేవలం ఒక టీస్పూన్ మోతాదులోనే తినాల్సి ఉంటుంది. దీనికి శరీరాన్ని చల్లబరిచే గుణం ఉంటుంది. కనుక ఎండలో తిరిగి వచ్చిన వారు వేడి చేయకూడదు అనుకుంటే ఒక టీస్పూన్ గుల్కండ్‌ను తినాలి. వేసవి తాపం నుంచి తట్టుకునేందుకు,వేడిని తగ్గించుకునేందుకు కూడా దీన్ని తినవచ్చు. ఇది ఎంతో రుచిగా ఉంటుంది.

**జీర్ణ వ్యవస్థకు..**

గుల్కండ్ లో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్ వల్ల కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. గుల్కండ్‌ను తింటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా శరీరం పోరాడుతుంది. మన జీర్ణ వ్యవస్థకు గుల్కండ్ ఎంతో మేలు చేస్తుంది. ఇది ప్రోబయోటిక్ ఆహారాల జాబితా కిందకు వస్తుంది. అందువల్ల దీన్ని తింటే జీర్ణక్రియ మెరుగు పడడంతోపాటు జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. దీంతో అసిడిటీ, కడుపు ఉబ్బరం, మలబద్దకం నుంచి ఉపశమనం పొందవచ్చు. జీర్ణాశయం, పేగులు ఆరోగ్యంగా ఉంటాయి.

# దంతాలు పసుపు రంగులోకి మారాయా?

## ఇలా చేస్తే ముత్యాల్లా మెరిసిపోవడం పక్కా!



మన దంతాలు ప్రకృతి సమయంలో తెల్లగా ఉండేలా రూపొందబడ్డాయి. అయితే, క్రమంగా ఆహారపు అలవాట్లు, జీవనశైలి, మరియు కొన్ని ఆరోగ్య సమస్యల వల్ల పసుపు లేదా బూడిద రంగు మరకలు ఏర్పడతాయి. ముఖ్యంగా, కాఫీ, టీ, పొగ త్రాగడం, మరియు ఖనిజలవణాల అధిక ప్రమాణం గల నీటిని సేవించడం వల్ల ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. ముత్యాల్లా మెరిసే తెల్లటి దంతాలు.. క్రమేనా పసుపు రంగులోకి మారడం ఆందోళన కలిగిస్తుంది. ఇతరులతో మాట్లాడేటప్పుడు ఇబ్బందికరంగా ఉంటుంది. అయితే, ఇంట్లోనే కొంత శ్రద్ధ వహించడం ద్వారా మన దంతాలను తిరిగి తెల్లబడేలా చేసుకోవచ్చు.

**1. బేకింగ్ సోడా -** నిమ్మరసం బేకింగ్ సోడా (Baking Soda ) ఒక సహజమైన శుభ్రపరిచే పదార్థం. ఇది దంతాలపై ఏర్పడిన మరకలను తొలగించడంలో సహాయపడుతుంది. కొద్దిగా బేకింగ్ సోడాలో కొన్ని చుక్కల నిమ్మరసం కలిపి పేస్ట్ తయారు చేసుకోండి. దాన్ని బ్రష్ సహాయంతో దంతాలకు అప్లై చేసి 1–2 నిమిషాల పాటు మర్దన చేయండి. ఆపై గోరువెచ్చని నీటితో కళ్లుక్కోండి. వారానికి 2 సార్లు మాత్రమే ఈ పద్ధతిని పాటించాలి, ఎందుకంటే ఎక్కువగా చేస్తే దంతాల ఎమల్షన్ నష్టం చెందే ప్రమాదం ఉంది.

**2. కొబ్బరి నూనెతో కూలింగ్ (Oil Pulling) :** కొబ్బరి నూనె దంతాలను శుభ్రపరచడంతో పాటు బ్యాక్టీరియాను తొలగించడంలో చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఒక టీస్పూన్ కొబ్బరి నూనెను నోటిలో తీసుకుని 10–15 నిమిషాల పాటు తిప్పాలి. ఆ తర్వాత ఉమ్మి వేసి, గోరువెచ్చని నీటితో నోటిని శుభ్రం చేసుకోవాలి. ఇది ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో చేస్తే మంచి ఫలితాలు కనిపిస్తాయి.

**3. ఆపిల్ సిడర్ వెనిగర్ :** ఆపిల్ సిడర్ వెనిగర్ (Apple Cider Vinegar) లో సహజమైన యాసిడ్‌లు ఉండటంతో, ఇది దంతాలపై ఉన్న మరకలను క్రమంగా తొలగించడంలో సహాయపడుతుంది. ఒక గ్లాసు నీటిలో 1 స్పూన్ ఆపిల్ సిడర్ వెనిగర్ కలిపి, దాంతో గార్గిల్ చేయాలి. వారానికి 2–3 సార్లు మాత్రమే ఉపయోగించాలి, ఎందుకంటే ఎక్కువగా చేస్తే దంతాల పల్లాలను ప్రభావితం చేయవచ్చు. ఆహారం తిన్న వెంటనే, ముఖ్యంగా టీ లేదా కాఫీ తీసుకున్న తర్వాత గోరువెచ్చని నీటితో పుక్కిలించడం వల్ల మరకలు ఏర్పడే అవకాశం తగ్గుతుంది

**4. స్ట్రాబెర్రీ - బేకింగ్ సోడా మిశ్రమం :** స్ట్రాబెర్రీలోని మాలిక్ యాసిడ్ (Malic Acid) దంతాలపై ఏర్పడిన మరకలను తొలగించడంలో సహాయపడుతుంది. రెండు స్ట్రాబెర్రీలను మెత్తగా మెదిపి, అందులో అర టీస్పూన్ బేకింగ్ సోడా కలిపి పేస్ట్ తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని బ్రష్‌తో దంతాలకు అప్లై చేసి, 2–3 నిమిషాలు మర్దన చేయాలి. వారానికి ఒకసారి మాత్రమే ఈ విధానాన్ని ఉపయోగించాలి.

**5. తేనె - కర్పూరం :** తేనెకు సహజమైన యాంటీబాక్టీరియల్ గుణాలు ఉన్నాయి, ఇది దంతాలను ఆరోగ్యంగా ఉండేలా చేయడంలో సహాయపడుతుంది. తేనెలో చిటికెడు కర్పూరం కలిపి దంతాలకు అప్లై చేసి 2 నిమిషాల తర్వాత కడుక్కోవాలి. ఇది దంతాలపై ఏర్పడే బ్యాక్టీరియాను తగ్గించడంలో సహాయపడుతుంది.అంతే కాకుండా ఉదయం లేవగానే మరియు రాత్రి పడుకునే ముందు తప్పనిసరిగా బ్రష్ చేయాలి. ఫ్లోరైడ్ ఉన్న మంచి టూత్‌పేస్ట్ ఉపయోగించాలి. బ్రష్ చేయడం తర్వాత మౌత్ వాష్ ఉపయోగించడం మరింత మంచిది. దంతాలపై పసుపు మరకలు తొలగించడానికి ఇంట్లోనే కొన్ని సులభమైన, సహజమైన మార్గాలు అనుసరించడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు. అయితే, దీర్ఘకాలిక మరకలు, లేదా తీవ్రమైన సమస్యలు ఉంటే, నిపుణులైన డెంటిస్ట్‌ను సంప్రదించడం మంచిది.

# వెల్లుల్లి పొట్టును పడేయకండి.. దాంతో కలిగే లాభాలు తెలిస్తే ఇకపై పడేయరు..!



వెల్లుల్లిని మనం తరచూ అనేక వంటకాల్లో ఉపయోగిస్తుంటాం. దీని వల్ల వంటలకు చక్కని రుచి, వాసన వస్తాయి. వెల్లుల్లిని తింటే నోరంతా దుర్వాసన వస్తుందనే కారణంతో కొందరు దీన్ని దూరం పెడతారు.వెల్లుల్లిని మనం తరచూ అనేక వంటకాల్లో ఉపయోగిస్తుంటాం. దీని వల్ల వంటలకు చక్కని రుచి, వాసన వస్తాయి. వెల్లుల్లిని తింటే నోరంతా దుర్వాసన వస్తుందనే కారణంతో కొందరు దీన్ని దూరం పెడతారు. కానీ వెల్లుల్లి మనకు అందించే ఆరోగ్య ప్రయోజనాలు బోలెడు. వెల్లుల్లిని రోజూ పచ్చిగా తింటే మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది. వెల్లుల్లిని తినడం వల్ల షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్ అదుపులో ఉంటాయి. బీపీ తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఇంకా ఎన్నో లాభాలు ఉంటాయి. అయితే కేవలం వెల్లుల్లి మాత్రమే కాదు, దాని పొట్టు కూడా మనకు ఎంతో మేలు చేస్తుంది. దీంతో పలు అనారోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చు. వెల్లుల్లి పొట్టు మనకు ఏవిధంగా ఉపయోగపడుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.

**చర్మ సంరక్షణకు..**

చర్మ సమస్యలతో బాధపడుతున్న వారికి వెల్లుల్లి పొట్టు చక్కని ఔషధంలా పనిచేస్తుంది. వెల్లుల్లి పొట్టును నీళ్లతో కలిపి పేస్ట్‌లా చేసి దాన్ని రాస్తుంటే చర్మంపై ఉండే వాపులు, దురదలు తగ్గుతాయి. అలాగే గాయాలు, పుండ్లు కూడా త్వరగా మానుతాయి. వెల్లుల్లి పొట్టులో యాంటీ ఇన్ఫ్లామేటరీ, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. ఇవి చర్మాన్ని సంరక్షిస్తాయి. చర్మ సమస్యలు తగ్గేలా చేస్తాయి. వెల్లుల్లి పొట్టును నేరుగా తినాల్సిన పనిలేదు .ఈ పొట్టును మీరు వండే సూప్‌లు లేదా కూరల్లో వేస్తే చాలు, వాటి ల్లో ఉండే సారం కూరల్లోకి దిగుతుంది. సూప్‌ల తయారీలో కూడా వెల్లుల్లి పొట్టును వేయవచ్చు. దీని వల్ల ఆ పొట్టులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు సూప్‌లో కలుస్తాయి. దీంతో వెల్లుల్లి పొట్టులో ఉండే పోషకాలు మన శరీరానికి అందుతాయి.

**హార్ట్ ఎటాక్ రాదు..**

వెల్లుల్లి పొట్టును నీటిలో వేసి మరిగించి దాంతో డికాషన్ తయారు చేయవచ్చు. ఈ డికాషన్‌ను రాత్రి నిద్రకు ముందు తాగాలి. దీంతో మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభించి నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. వెల్లుల్లి పొట్టులో విటమిన్లు ఎ, సి, ఇ అధికంగా ఉంటాయి. అలాగే ఈ పొట్టులో ఫ్లేవనాయిడ్స్, క్వర్సెటిన్ అనే సమ్మేళనాలు కూడా అధికంగానే ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. దీంతో రక్త నాళాలలో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. ఫలితంగా హార్ట్‌ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. రాత్రి పూట చాలా మందికి నిద్రలో ఉండగా కాలి పిక్కలు, కండరాలు పట్టుకుపోతుంటాయి. ఈ సమస్య నుంచి బయట పడేందుకు వెల్లుల్లి పొట్టు ఎంతగానో పనిచేస్తుంది. వెల్లుల్లి పొట్టు వేసి మరిగించిన నీళ్లను రాత్రి నిద్రకు ముందు తాగుతుండాలి. దీంతో ఈ సమస్య నుంచి విముక్తి పొందవచ్చు.

**ఇమ్యూనిటీ పవర్‌కు..**

గుండె ఆరోగ్యానికి కూడా వెల్లుల్లి పొట్టు ఎంతో మేలు చేస్తుంది. వెల్లుల్లి పొట్టులో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి బీపీని క్రమబద్ధీకరిస్తాయి. దీంతో రక్త సరఫరా నియంత్రణలో ఉంటుంది. గుండె జబ్బులు రాకుండా రక్షించుకోవచ్చు. వెల్లుల్లి పొట్టులో సల్ఫర్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీని వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. శరీరం రోగాలు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. వెల్లుల్లి పొట్టును నేరుగా తినలేని వారు దాన్ని పొడిగా చేసి అన్నంలో మొదటి ముద్దలోనూ కలిపి తినవచ్చు. ఇలా వెల్లుల్లి పొట్టును తీసుకుంటుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# ధనియాల నీటితో బరువుకు చెక్... ఆరోగ్య అద్భుతాలు ఎన్నో!



మన ఆరోగ్యానికి దోహదం చేసే ఎన్నో దినుసులు మన ఇంట్లోనే ఉంటాయి. అయితే వాటిని ఎలా ఉపయోగించాలి? అనేది ప్రతి ఒక్కరు తెలుసుకొని ఉంటే మన ఇంట్లో ఉండే దినుసులతోనే మన ఆరోగ్యాన్ని మనం పొందవచ్చు. వంటింట్లో ఉండే అనేక దినుసులు జీలకర్ర, ధనియాలు, మెంతులు ఇలా ప్రతి ఒక్కటి మనకు విశేషమైన ఆరోగ్యాన్ని ఇస్తాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

**ధనియాల నీటితో ఆరోగ్యం :** ప్రస్తుతం మనం ఈరోజు ధనియాలు మనకు ఆరోగ్యానికి ఏ విధంగా దోహదం చేస్తాయి? ధనియాల నీళ్లతో మనం ఏ విధంగా ఆరోగ్యంగా ఉండవచ్చు ? అనేది తెలుసుకుందాం. రాత్రంతా ధనియాల గింజలను నానబెట్టి ఉదయాన్నే ఆ నీటిని తాగితే బోలెడన్ని ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ధనియాల నీటిలో విటమిన్ ఏ, విటమిన్ ఈ, విటమిన్ సి విటమిన్ కే పుష్కలంగా ఉంటాయి.

**ఆరోగ్య సమస్యలతో పాటు చర్మ సమస్యలకు పరిష్కారం :** ధనియాల నీటిని తాగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలతో పాటు చర్మసమస్యలు కూడా తగ్గుతాయి. చర్మం ఆరోగ్యంగా కాంతివంతంగా మారుతుంది మన రోగ నిరోధక వ్యవస్థ బలపడుతుంది. వైరల్ ఇన్ఫెక్షన్ల బారి నుండి ధనియాల నీరు మనలను కాపాడుతుంది. ధనియాల నీరు ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇది మన జీర్ణ క్రియను మెరుగుపరుస్తుంది.ప్రతిరోజు ఉదయం ఖాళీ కడుపుతో ధనియాల నీటిని తాగడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు తప్పక వస్తాయి.

**ధనియాల నీటితో డయాబెటిస్ కి చెక్ :** శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ను ధనియాల నీరు తగ్గిస్తుంది. ముఖ్యంగా ధనియాల నీరు మన మెటబాలిజంను మెరుగుపరుస్తుంది.ఊబకాయంతో బాధపడే వారిలో బరువు తగ్గడానికి దోహదం చేస్తుంది. డయాబెటిస్ తో బాధపడేవారు ప్రతి రోజూ ధనియాల నీరు తాగితే డయాబెటిస్ నుంచి రక్షణ కలుగుతుంది. ధనియాల నీటితో జుట్టు బలోపేతం అవుతుంది. చర్మ ఆరోగ్యాన్ని ధనియాల నీరు మెరుగు పరుస్తుంది.

**హైబీపీకి, థైరాయిడ్ కి బెస్ట్ :** నరాలలో పేరుకుపోయిన కొవ్వు అడ్డంకులను తొలగించడంతో పాటు, అధిక రక్తపోటు సమస్యను తగ్గించడానికి ధనియాల నీరు ఉపయోగపడుతుంది. ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న ధనియాల నీటిని ప్రతిరోజు ఉదయం క్రమం తప్పకుండా తీసుకుంటే థైరాయిడ్ సమస్యకు కూడా పరిష్కారం లభిస్తుంది. ఎవరైతే క్రమం తప్పకుండా దీనిని చేస్తారో తప్పక ఫలితం ఉంటుంది.

బుధవారం,
జూలై 30, 2025
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



## అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి



**అనంతపురం :**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పెట్టుబడులు,ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతున్నాయని ఎమ్మెల్యే బండారు శ్రావణి పేర్కొన్నారు. శింగనమల మండలం, శోధనపల్లి గ్రామంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడు గు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ గారు పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. శోధన పల్లి గ్రామంలో 5 లక్షల రూపాయల సిసి రోడ్ల ను మరియు 50 లక్షల 60 వేల రూపాయలతో 22 గోకులం షెడ్లు పూర్తి చేశామని మరో 15 షెడ్లు నిర్మాణం జరుగుతున్నాయి తెలిపారు. పెరిగిన పింఛన్లు, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని సైతం ప్రజలకు వివరించారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు సౌకర్యాలు అమలుకానున్నాయని తెలిపారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, టిడిపి నాయకులు కాయల రమణ యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సీయం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



**శింగనమల :** శింగనమల నియోజకవర్గ పరిధిలోని పేదలకు క్యాంపు కార్యాలయంలో రూ. 14,84,931 రూపాయల సి.యం.ఆర్.ఎఫ్. చెక్కులు ను ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక ఇబ్బందులు తో బాధ పడుతున్న పేదలకు భరోసా ఇవ్వడం చాలా సంతోషమని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తెలిపారు. పేదలను ఆర్థికంగా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ధన్యవాదాలు తెలిపారు.

## స్థానిక ఏరియా ఆసుపత్రి అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని.

**చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ కోరారు**






**ఏలూరు జిల్లా** : మంగళవారం స్థానిక చింతలపూడి ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి చైర్మన్ హెూదాలో పాల్గొన్న ఎమ్మెల్యే. చింతలపూడి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం లో స్థానిక ఎమ్మెల్యే పాల్గొన్నారు ముందుగా వైద్య సేవలు పొందుతున్న బాధితులను ఆసుపత్రి సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు కార్యక్రమాన్ని ఉద్దేశి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ఆసుపత్రిని అభివృద్ధి చేసేందుకు అందరూ కృషి చేయాలని అవసరం మేరకు కావలసిన సహకారం కూడా అందుతుందని అన్నారు.ఆసుపత్రికి వచ్చిన వారు సంతృప్తి చెం దాలి ఎమ్మెల్యే చుట్టుపక్కల దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చేది కేవలం బడుగు బల హీన సామాన్య మధ్యతరగతి పేద ప్రజలు ఎక్కువగా పలు రకాల ఆరోగ్య సమస్యలతో వస్తుంటా రని వచ్చిన భాదితులు పట్ల ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా మెరుగైన వైద్య సేవలు అందించ డానికి ఆసుపత్రిలోని వైద్యాధికారులు సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహి స్తూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం నుంచి వెలువడే నిధులను ఏ మాత్రం వృధా కాకుండా దుర్విని యోగం చెయ్యకుండా అన్ని రకాల సదుపాయాలతో వైద్య పరీక్షలకు కావాల్సిన పరికరాలకు సంబంధించి నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని అంతేకాకుండా అనారోగ్యంతో వచ్చిన పేషెంట్లకు డాక్టర్లు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ బాధితులకు భరోసాగా నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్నెంట్ తో పాటు కమిటీ సభ్యులు, కూటమి నాయకులు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు



**ఏలూరు జిల్లా** :రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈరోజు రేచర్ల మల్లయ్య గూడెం గ్రామ సచివాలయాల నందు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అంద జేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులందరికీ అన్న దాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని అలాగే సబ్సిడీ తో కూడిన విత్తనాలు ఎరువులు అందించాలని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఐదు లక్షల వరకు వడ్డీ లేని రుణాలు కౌలు రైతులకు ఇవ్వాలని గ్రామసభలు నిర్వహించి భూమిలేని కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన్ని సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు వినతి పత్రం పత్రం ఇచ్చిన మల్లాయ గూడెంలో తక్కిలపాటి ప్రసాద్ రావు రేచర్లలో కంచర్ల గురవయ్య తదితరులు పాల్గొన్నారు

# స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం !

**(30 జూలై “”అంతర్జాతీయ స్నేహ దినోత్సవం” సందర్భంగా)**

స్నేహం చేయని మనిషి ఉండడు. స్నేహితులు లేని తనువు ఉండదు. ప్రతి వ్యక్తి జీవితంలో స్నేహానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. స్నేహితుల హస్తాలు నిస్వార్థ నేస్తాలు. బంధువులతో లేని ఓ అపురూపమైన అనుబంధం స్నేహితులతో ఉంటుంది. కొన్ని సమయాల్లో కుటుంబ సభ్యులతో పంచుకోలేని విషయాలను సహితం స్నేహితులతో పంచుకుంటాం. మనకు స్నేహితులు అనేకులు ఉండవచ్చు కాని ప్రాణ మిత్రులు కొద్ది మంది మాత్రమే ఉంటారు. ప్రాణ స్నేహితులతో మనం అన్ని విషయాలను దాపరికం లేకుండా పంచుకుంటాం. స్నేహం అంటే ఓ త్యాగం, ఆపదలో అభయ హస్తం, కష్టాల్లో ఓ శీతల నేస్తం, ఆపదలో సాంత్వన చేకూర్చే మహా వృక్షం. ప్రాణ స్నేహితులకు ప్రత్యామ్నాయం ఉండదు. మనసుకు ప్రశాంతత, శరీరానికి ఉపశమనం కలిగిస్తుంది స్నేహ హస్తం. సహానుభూతి కి ఓ చక్కని ఉదాహరణ స్నేహం. పరస్పర గౌరవానికి, త్యాగానికి చిరునామా ఫ్రెండ్‌షిప్. సన్నిహిత మిత్రుడు అంటే ఓ మహా నమ్మకం. స్నేహానికి వయోభేదం లేదు. చంటి వాడి నుంచి పండు ముసలి వరకు అందరికీ స్నేహితులు ఉంటారు, వద్దన్నా ఆనందాలను వడ్డిస్తూ ఉంటారు.

**అంతర్జాతీయ స్నేహ దినోత్సవం-2025 ఇతివృత్తం :**

స్నేహం విలువను తెలుసుకోవడం, మంచి స్నేహితులతో సంబంధాలు కొనసాగించడం, అపార్థాలను నివృత్తి చేసుకొని స్నేహాన్ని కొనసాగించడం, బేధాభిప్రాయాలను దూరం చేసుకోవడం, పౌర సమాజంలో శాంతి పందిరి వేయడానికి అనుకూలమైన అనువైన సందర్భంగా ప్రతి ఏట 30 జూలై రోజున “అంతర్జాతీయ స్నేహ దినోత్సవం ( ఇంటర్నేషనల్ ఫ్రెండ్‌షిప్ డే)” పాటించాలని 2011 నుంచి ఐరాస తీర్మానం చేయడం, ప్రతి ఏట పాటించడం కొనసాగుతున్నది. 2025 అంతర్జాతీయ స్నేహ దినం ఇతివృత్తంగా “స్నేహం : శాంతి, సంఘీభావం, సంస్కృతుల మధ్య అవగాహనలను పెంపొందించే వారధి” అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. వివిధ దేశాలు, జాతులు, మతాలు, కులాలు, అసమానతలను మరిచి అందరం స్నేహ బంధంతో ఏకం కావడమే లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటాం. స్నేహ బందం పరమ పవిత్రమైనది. నిజమైన స్నేహితుల మధ్య విడదీయరాని ప్రేమ అనే అభేద్య బంధం పెనవేసుకొని ఉంటుంది. మంచి స్నేహితులు కొన్ని విషయాల్లో విభేదించినా, సదా ఒక్కటిగానే ఉంటారు.

**స్నేహితులతో కొత్త ప్రపంచం పరిచయం :**

చిన్ననాడే స్నేహం అనే బంధం మొలకెత్తుతుంది. అమ్మనాన్న తర్వాత మన సంక్షేమాన్ని, శ్రేయస్సును నిస్వార్థంగా తలుస్తూ మన వెంట నడిచే వ్యక్తులు మన ప్రాణ మిత్రులు మాత్రమే. బడికి వెళ్లడంతో మనకు నూతన స్నేహితులు పుడతారు. వారితోనే మన దినచర్య ముడిపడి ఉంటుంది. చదవడం, ఆడడం, పాడడం, మాట్లాడుకోవడం, సరదాగా తిరగడం లాంటివి మన ప్రాణ స్నేహితులతోనే ముడిపడి ఉంటాయి. ఒకే కంచంలో తిని ఒకే మంచంలో పడుకునే స్థాయికి స్నేహం ఎదుగుతుంది. తరగతులు పెరిగిన కొద్దీ తరగతులు మారుతూ, కొత్త మిత్రులు వచ్చి చేరతారు. పాత మిత్రుల స్నేహం కొనసాగుతూనే ఉంటుంది. స్నేహితులు పెరిగిన కొద్దీ బయటి ప్రపంచం కొత్తగా కనిపిస్తుంది. అందరి సంస్కృతీ వారసత్వాలు అర్థం అవుతాయి. మన జీవితానికి లక్ష్యాలను కూడా మిత్రులు నిర్ణయించుకునే స్థాయి కూడా వస్తుంది.అంతర్జాతీయ స్నేహ దినం వేదికగా పాత మిత్రులను కలవడం, కొత్త మిత్రులతో సరదాగా గడపడం, ఆపాత మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ పంచుకోవడం, తమ తమ అనుభవాలను పంచుకోవడం, స్నేహితుల కష్టాలను తెలుసుకొని సహాయం చేయడం, సామాజిక మాధ్యమాల్లో స్నేహ బంధాల విలువను వివరించడం, పాత స్నేహితులతో ఉన్న ఫోటోలను పంచుకోవడం, హాపీ ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు చెప్పుకోవడం లాంటి కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చు.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

# ఓపెన్ పడుకోనివ్వదు.. క్లోజ్ నిదరపోనివ్వదు....

**గార్లదిన్నె :**సాంకేతిక పరిజ్ఞానం పెరిగే కొద్దీ ఆదాయ వనరులుగా మారే మార్గాలు కోకొల్లలుగా బయటకు వస్తున్నాయి. అందులో ఒకటే ఆన్లైన్ మట్కా గార్లదిన్నె మండలంలో బహు జోరుగా ఈ కొందరు ఆన్లైన్ మట్కా చాప కింద నీరుల విస్తరిస్తోంది. జూదరులు మట్కా బీటర్లుగా మారి ఆన్లైన్లో జోరుగా మట్కా ఆట నిర్వహిస్తున్నారు. ఈ ఆన్లైన్ ఆట వ్యసనంగా మారి, సమయం ఎప్పుడు అవుతుందా ఓపెన్ కి వేద్దామా క్లోజ్ కి వేద్దామా బ్రాకెట్ ఏం పడుతుంది అనే ఆలోచనతోనే రోజులు గడుస్తున్నాయి ఈ ఆటగాళ్లకు. అనునిత్యం ఆట ధ్యాసలో కుటుంబాలను సైతం రోడ్డున పడేస్తూ జూదరులు ఆటకు బానిసలుగా మారుతున్నారు.




అదే అదునుగా మట్కా బీటర్లు సొమ్ము తీసుకుంటు జొబులు నింపుకుంటున్నారు. గార్లదిన్నె మండలంలోని కల్లూరు గ్రామంలో ఈ మట్కా మండలంలోనే అధికంగా విస్తరిస్తోంది. గ్రామంలోని తరిమెల రోడ్డు ఆటో స్టాండ్, ముంటిమడుగు రోడ్డు రైల్వే బ్రిడ్జి, పామిడి బీసీసీ రోడ్డు వైన్ షాప్ ఏరియా, నేషనల్ హైవే పక్కలోని పలు షాపులు జోరుగా ఈ మట్కా దందా నడుస్తోందని గ్రామ ప్రజలు గుసగుసలాడుతున్నారు. గుట్టు చప్పుడు కాకుండా ఖాకీల కన్ను కప్పి వృత్తి వ్యాపారాల ముసుగులో లోగుట్టుగా ఈ దందా మొత్తం నడుస్తోంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## కళ్యాణదుర్గం మండలంలో ఎమ్మెల్యే అమిలినేని మంత్రి పార్థసారథి పర్యటన వివరాలు

**అనంతపురం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశం మేరకు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా 30తేది న రాష్ట్ర గృహ నిర్మాణం, ఐ అండ్ పీఆర్ మంత్రి వర్యులు కొలుసు పార్థసారథి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పర్యటన వివరాలుఉదయం 10.00 గంటలకు సుబ్రమన్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొంటారని ఉదయం 10.30 గంటలకు వాల్మీకి సర్కిల్ అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమం.ఉదయం 10.45 గంటలకు పాతబస్టాండ్ వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంఉదయం 11.15 గంటలకు కళ్యాణదుర్గం మండలంలోని చాపిరి గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొంటారని మధ్యాహ్నం 01.00 గంటకు ప్రజావేదికలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొంటారని మధ్యాహ్నం 02.00 గంటలకు అధికారులతో సమావేశంలో పాల్గొంటారని కావున కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు వైస్ చైర్మన్లు కౌన్సిలర్లు మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, క్లస్టర్ ఇంచార్జీలు, యూనిట్ ఇంచార్జ్ లు, వార్డ్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులు, డీలర్లు, బూత్ ఇంచార్జ్ లు, ఆర్పీలు, తెలుగు మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మనవి.కావున కళ్యాణదుర్గం ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు హాజరై కవరేజ్ చేయవలసినదిగా మనవి





## కౌలు రైతులకు సులభంగా గుర్తింపు కార్డులు జారీ చేయాలి

**డి.చిన్నప్పయాదవ్**
**జిల్లారైతుసంఘము అధ్యక్షులు**
**కౌలురైతుసంఘము రాష్టసమితి పిలుపుమేరకు**





**శింగనమల :** మండలము, కోరివిపల్లి, సలకంచెరువు,శింగనమల సచివాలయ అధికారులకు కౌలు రైతుల సమస్యలపై వినతిపత్రము ఇవ్వడముజరిగింది.ఈ సంధర్భంగా జిల్లారైతుసంఘముఅధ్యక్షులు డి.చిన్నప్పయాదవ్ మాట్లాడుతూ,ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు పూర్తవు తున్నది.కౌలురైతులకు కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ పెట్టడం లేదు. కౌలు గుర్తింపు కార్డులు లేకపోవడం వలన పంట రుణాలు, పంటల భీమా పథకం వర్తింప చేయడంలేదు. ఈ పంట నమోదు కూడా జరిగే అవకాశం లేదు. భవిష్యత్తులో ఇచ్చే అన్నదాత సుఖీభవ పథకం అందుతుందని గ్యారెంటీ లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పంటలు అమ్ముకోవడానికి వెసులుబాటు ఉండదు. ప్రకృతి విపత్తులవల్ల పంటలు నష్టపోయినప్పుడు అందించే ఇన్పుట్ సబ్సిడీ, పంటల పరిహారం కూడా కౌలురైతుల అందుకుండా పోతున్నది కాబట్టి పై అంశాలను పరిశీలించినప్పుడు తక్షణమే కౌలు రైతులను ఆదుకోవడానికి కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు ఈ క్రింద తెలియపరచిన చర్యలు చేపట్టాలని మీ ద్వారా ఈ వినతిపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుచున్నాము.

తీసుకోవలసిన చర్యలు

01) కౌలు రైతుల రక్షణ-సంక్షేమం కోసం సమగ్రమైన కౌలు చట్టాన్ని తక్షణమే తీసుకురావాలి.

02) గ్రామసభల్లోనే నేరుగా కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేయాలి. ఒకవేళ ఏమైనా అభ్యంతరాలు వస్తే వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పంట పొలాలను పరిశీలించి చుట్టుపక్కల రైతులను కూడా విచారించి గుర్తింపు కార్డులు ఇవ్వాలి..

03) దేవాదాయ, ధర్మాదాయ మరియు వక్ఫ్ భూములు, వివిధ ట్రస్ట్ భూములను సాగు చేసుకుంటున్న, వారికి కౌలు అగ్రిమెంట్ ప్రకారం గుర్తింపు కార్డులు జారీ చేయాలి.

04) గుర్తింపు కార్డులు పొందిన ప్రతి కౌలు రైతుకు భూయజమాని తీసుకున్న రుణంతో సంబంధం లేకుండా సాగు చేస్తున్న భూమి యెక్క దామాషా బట్టి “స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం” రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలను దృష్టిలో పెట్టుకుని రూ? 2 లక్షల వరకు హామీ లేని పంట రుణాలను అందించాలి.

05) గుర్తింపు కార్డులు పొందిన భూమిలేని ప్రతి కౌలు రైతుకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింప జేసి రూ? 20వేలు పెట్టుబడి సాయం తక్షణమే అందించాలి.

06) ఇ-పంట నమోదు కార్యక్రమంలో గుర్తింపు కార్డులు ఉన్నా లేకపోయినా క్షేత్రస్థాయిలో పరిశీలించి సాగులో ఉన్న వారి పంటలను నమోదు చేయాలి.

07) కౌలు రైతులు పండిస్తున్న అన్ని పంటలకు ఉచిత పంటల బీమా పథకం వర్తింప చేయాలి. ప్రకృతి విపత్తులు సంభవించి పంట నష్టం జరిగినప్పుడు ఇన్పుట్ సబ్సిడీ, పంటల భీమా పరిహారం కౌలు రైతులకే అందించాలి

08) ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో కౌలురైతులు తమ పంటలను అమ్ముకోవటానికి గుర్తింపు కార్డులు లేదా సాగు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి.

09) ప్రతి ఏటా పెరుగుతున్న కౌలు రేట్లు నియంత్రించేందుకు ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. కౌలును పంట రూపంలో చెల్లించాలి. అది కూడా పంట పండిన తర్వాతే చెల్లించే విధంగా నిబంధనలతో కూడిన చట్టం తీసుకురావాలి.

10) దురదృష్టవశాత్తు ఆత్మహత్యలకు పాల్పడిన కౌలురైతుల కుటుంబాలకు సులభంగా (ఎటువంటి సర్టిఫికెట్లతో సంబంధం లేకుండా) పంచనామాను పరిగణలో తీసుకొని వారంరోజుల్లో ప్రతి కుటుంబానికి రూ? 10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని జిల్లారైతు ,కౌలు రైతుసంఘముతరపున డిమాండ్ చేస్తున్నాము.

ఈ కార్యక్రమములో రైతుసంఘము నియోజకవర్గ అధ్యక్షులు మధు యాదవ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు చేనేత మధు ,చికెన్ భాష వ్యవసాయకార్మిక సంఘం మండల కార్యదర్శి ఓబులపతి, రైతు సంఘం మండల కార్యదర్శి బయన్న, మరియు రామాంజనేయులు ,పెద్దక్క, ఓబులేసు ,బాలిరెడ్డి ,చిన్న రంగడు, ముత్యాలు కౌలు రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కలిచిన ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ పసిలేటి హరిప్రసాద్

**మదన పల్లి :**తిరుపతి కి వీచేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖా %ఁ% స్పోర్ట్స్ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్త కళా నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్, జనసేన పార్టీ పి ఏ సి సభ్యులు,ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు, డా.పసుపులేటి హరి ప్రసాద్ ని కలిసి కలంకారి శాలవ తొ సత్కరించిన తంబళ్లపల్లె నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పోతుల సాయినాథ్ కలిసి తంబళ్లపల్లె నియోజకవర్గం అభివృద్ధి మరియు జనసేన పార్టీకి కష్టపడ్డవారికి నామినేటెడ్ పదవులు అయిన మార్కెట్ యార్డ్, దేవాదాయ శాఖ , అగ్రికల్చర్ విభాగాలలో నామినేటెడ్ పదవులు భర్తీ చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు షోరూం సురేంద్ర, ములకలచెరువు మండల ప్రధాన కార్యదర్శి మార్జోల్ల. సుదర్శన్, పవన్ రెడ్డి,తోట చంద్రమోహన్, అడపా.మురళి , నాగేంద్ర మరియు జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## సీయం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే బండారు శ్రావణి




**అనంతపురం**
శింగనమల నియోజకవర్గ పరిధిలోని పేదలకు క్యాంపు కార్యాలయంలో రూ. 14,84,931 రూపాయల సి.యం. ఆర్.ఎఫ్. చెక్కులు ను ఎమ్మెల్యే బండారు శ్రావణి పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక ఇబ్బందులు తో బాధ పడుతున్న పేదలకు భరోసా ఇవ్వడం చాలా సంతోషమని ఎమ్మెల్యే బండారు శ్రావణి తెలిపారు. పేదలను ఆర్థికంగా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే బండారు శ్రావణి ధన్యవాదాలు తెలిపారు.

## లింగపాలెం మండలం సుందర్రావు గ్రామంలో వాలీబాల్ టోర్న మెంట్

**ఏలూరు :**
విఘ్నేశ్వరి మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో లింగపాలెం మండలం సుందర్రావు పేటల గ్రామంలో సుందరరావుపేట గ్రామంలో ఆగస్టు నెల 10వ తేదీ నుండి పోటీలలో విజయం సాధించిన విజేతలకు మొదటి బహుమతిగా 30000 రెండవ బహుమతిగా 20000 మూడవ బహుమతిగా 10000 గల్లిపొందిన విజేతలకు అందించడం జరుగుతుంది బెస్ట్ డిఫరెన్సర్ ఆఫ్ ది టోర్నమెంట్ బెస్ట్ హిట్ట ర్ ఆఫ్ ది కలవు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ పాల్గొన్నారు ఎంట్రీ ఫీజు 800. ఎంట్రీ ఫీజు చివరి తేదీ 9వ తారీకు మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు. 8 9 8 5 2 43652... 93476 86715 సంప్రదించగలరు.



## అడ్డతీగల:5.423. విద్యార్థులకు యూనిఫాం పంపిణీ.



**అడ్డతీగల**
అడ్డతీగల మండలంలో విద్యార్థులకు యూనిఫాం క్లాత్ పంపిణి కార్యక్రమం పూర్తి అయిందని ఎంఈఓ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. మొత్తం95. ప్రాథమి కొన్నత. పాఠశాలల్లో. 5.423. విద్యార్థులకు అందజేశామని తెలిపారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అందరికీ అందజేశామని యూనిఫామ్ క్లాత్ ఆలస్యంగా వచ్చాయన వెంటనే విద్యార్థులకు అందజేశామని ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు

## పటాన్ చెరు నుండి తిరుపతి వరకు పాదయాత్ర

- పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్




**పటాన్ చెరు :**పటాన్ చెరు పట్టణానికి చెందిన సీసాల రాజు ప్రతి ఏటా నిర్వహించే తిరుపతి పాదయాత్రను మంగళవారం ఉదయం పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. పటాన్ చెరు పట్టణంలోని మహంకాళి దేవాల యం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ... 21 సంవత్సరా లుగా తిరుపతి వరకు పాదయాత్ర చేయడం అభినందనీయమన్నారు. వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో పాదయాత్ర దిగ్విజయవంతం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కందుల దుర్గేష్ ను సత్కరించిన - సుమన్ బాబు



**తిరుపతి :**
తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతి కి విచ్చేసి తిరుగు ప్రయాణంలో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర టూరిజం, సినిమాటోగ్రఫీ, సాంస్కృతిక శాఖల మంత్రివర్యులు కందుల దుర్గేష్ ను మంగళవారం తిరుపతి జనసేన పార్టీ ప్రధాన కార్య దర్శి సుమన్ బాబు తిరుచానూరు పద్మా వతి అమ్మవారి దేవస్థానం సన్నిధిలో మర్యాదపూర్వకంగా కలసి వారిని శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ క్రమంలో.. జనసేన పార్టీ నేతలు సుధాకర్, సుమంత్, పవన్ కుమార్ మరియు ఏపీ టూరిజం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కౌలురైతులకు సులభంగా గుర్తింపు కార్డులు జారీ చేయాలి:డి.చిన్నప్పయాదవ్

**అనంతపురం :** కౌలురైతుసంఘము రాష్టసమితి పిలుపుమేరకు శింగనమల మండలము, కోరివిపల్లి, సలకం చెరువు,శింగనమల సచివాలయ అధికారులకు కౌలురైతుల సమస్యలపై వినతిపత్రము ఇవ్వడముజరిగింది. ఈసంధర్భంగా జిల్లారైతు సంఘము అద్యక్షులు డి.చిన్నప్పయాదవ్ మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు పూర్తవుతున్నది. కౌలురైతులకు కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ పెట్టడం లేదు. కౌలు గుర్తింపు కార్డులు లేకపోవడం వలన పంట రుణాలు, పంటల భీమా పథకం వర్తింప చేయడంలేదు. ఈ పంట నమోదు కూడా జరిగే అవకాశం లేదు. భవిష్యత్తులో ఇచ్చే అన్నదాత సుఖీభవ పథకం అందుతుందని గ్యారెంటీ లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పంటలు అమ్ముకోవడానికి వెసులుబాటు ఉండదు. ప్రకృతి విపత్తులవల్ల పంటలు నష్టపోయినప్పుడు అందించే ఇన్పుట్ సబ్సిడీ, పంటల పరిహారం కూడా కౌలురైతుల అందుకుండా పోతున్నది కాబట్టి పై అంశాలను పరిశీలించినప్పుడు తక్షణమే కౌలు రైతులను ఆదుకోవడానికి కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు ఈ క్రింద తెలియపరచిన చర్యలు చేపట్టాలని మీ ద్వారా ఈ వినతిపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుచున్నాము. తీసు కోవలసిన చర్యలుకౌలు రైతుల రక్షణ-సంక్షేమం కోసం సమగ్రమైన కౌలు చట్టాన్నితక్షణమేతీసుకురావాలి.గ్రామసభల్లోనే నేరుగా కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేయాలి. ఒకవేళ ఏమైనా అభ్యంతరాలు వస్తే వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పంట పొలాలను పరిశీలించి చుట్టుపక్కల రైతులను కూడా విచారించి గుర్తింపు కార్డులు ఇవ్వాలిదేవాదాయ, ధర్మాదాయ మరియు వక్ఫ్ భూములు, వివిధ ట్రస్ట్ భూములను సాగు చేసుకుంటున్న, వారికి కౌలు అగ్రిమెంట్




ప్రకారం గుర్తింపు కార్డులు జారీ చేయాలి.గుర్తింపు కార్డులు పొందిన ప్రతి కౌలు రైతుకు భూయజమాని తీసుకున్న రుణంతో సంబంధం లేకుండా సాగు చేస్తున్న భూమి యెక్క దామాషా బట్టి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారంరిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలను దృష్టిలో పెట్టుకుని 2 లక్షల వరకు హామీ లేని పంట రుణాలను అందించాలని గుర్తింపు కార్డులు పొందిన భూమిలేని ప్రతి కౌలు రైతుకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింప జేసి 20వేలు పెట్టుబడి సాయం తక్షణమే అందించాలి.ఇ-పంట నమోదు కార్యక్రమంలో గుర్తింపు కార్డులు ఉన్నా లేకపోయినా క్షేత్రస్థాయిలో పరిశీలించి సాగులో ఉన్న వారి పంటలను నమోదు చేయాలి.కౌలు రైతులు పండిస్తున్న అన్ని పంటలకు ఉచిత పంటల బీమా పథకం వర్తింప చేయాలి. ప్రకృతి విపత్తులు సంభవించి పంట నష్టం జరిగినప్పుడు ఇన్పుట్ సబ్సిడీ, పంటల భీమా పరిహారం కౌలు రైతులకే అందించాలి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో కౌలురైతులు తమ పంటలను అమ్ముకోవటానికి గుర్తింపు కార్డులు లేదా సాగు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి.ప్రతి ఏటా పెరుగుతున్న కౌలు రేట్లు నియంత్రించేందుకు ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. కౌలును పంట రూపంలో చెల్లించాలి. అది కూడా పంట పండిన తర్వాతే చెల్లించే విధంగా నిబందనలతో కూడిన చట్టం తీసుకురావాలి.దురదృష్టవశాత్తు ఆత్మహత్యలకు పాల్పడిన కౌలురైతుల కుటుంబాలకు సులభంగా (ఎటువంటి సర్టిఫికెట్లతో సంబంధం లేకుండా) పంచనామాను పరిగణలో తీసుకొని వారంరోజుల్లో ప్రతి కుటుంబానికి 10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని జిల్లారైతు ,కౌలు రైతుసంఘముతరపున డిమాండ్ చేస్తున్నాము.ఈ కార్యక్రమములో రైతుసంఘము నియోజకవర్గ అధ్యక్షులు మధు యాదవ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు చేనేత మధు ,చికెన్ భాష వ్యవసాయకార్మిక సంఘం మండల కార్యదర్శి ఓబులపతి, రైతు సంఘం మండల కార్యదర్శి బయన్న, మరియు రామాంజనేయులు ,పెద్దక్క, ఓబులేసు ,బాలిరెడ్డి ,చిన్న రంగడు, ముత్యాలు కౌలు రైతులు పాల్గొన్నారు.

## పుట్లూరు కస్తూర్బా స్కూల్ లో నీటి సమస్య పరిష్కరించండి సిపిఐ మండల కార్యదర్శి డి పెద్దయ్య డిమాండ్

**అనంతపురం :** పుట్లూరు మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో కస్తూర్బా స్కూల్ విద్యార్థినిల తాగునీరు సమస్య పరిష్కరించాలని ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం జరిగినది.మండల కార్యదర్శి పెద్దయ్య మాట్లాడుతూ!పుట్లూరు మండలం లో వర్షాలు సరిగా లేక భూగర్భ జలాలు అడుగంటిపోయి నీటి కష్టాలు ఏర్పడడం జరుగుతున్నది. అందులో భాగంగా మండల కేంద్రంలోని కస్తూర్బా స్కూల్ నందు రెండు వారాలుగా నీటి కొరత ఏర్పడినది. స్కూల్ విద్యార్థినీలు తాగడానికి కూడా ప్రతి రోజు 20 వెచ్చించి రెండు లీటర్ల నీళ్లు సొంత డబ్బుతో కొనుగోలు జరిపి త్రాగునీరు తాగుతున్నారు. అలాగే స్నానాలు చేయాలనే పిల్లలు నీటి కొరతతో సక్రమంగా చేయలేకపోతున్నారు. బట్టలు ఉతకాలంటే నీళ్లు లేక విడిచిన బట్టలన్నీ అట్టే నిలువ చేసుకొని వారి తల్లిదండ్రులు వచ్చిన తర్వాత వాళ్ల తల్లిదండ్రుల ద్వారా ఇంటికి పంపించి ఇంటికాడ ఉతికించుకొని తిరిగి బట్టలు తెప్పించుకోవడం జరుగుతున్నది. ఈ నీటి సమస్యలను



విద్యార్థినుల తల్లిదండ్రులు ఎంపీడీవో కి నీటి సమస్య పరిష్కరించండి అని ఈమధ్య కోరడం జరిగినది. చెపుతున్నారు. సిపిఐ పార్టీగా నీటి సమస్యపై స్కూల్ హెచ్ఎం ని నీటి సమస్య గురించి వివరణ అడగగా హెచ్ఎం నీటి సమస్య ఉంది కానీ ట్యాంకర్ల ద్వారా తోలుతున్నామని చెప్పడం జరుగుతున్నది.నీటి సమస్యలు పరిష్కారం కోసం స్కూల్ విద్యార్థినుల తల్లిదండ్రులతో కలిసి ఎంపీడీవో కి కూడా నీటి సమస్య పరిష్కరించాలని కోరడం జరిగినది. అలాగే కొత్త బోర్ వేసుకున్నాం. ఆ బోరుకు విద్యుత్ కనెక్షన్ విద్యుత్ ఏఈ ఇవ్వడంలోనిరీక్షణ వహిస్తున్నారని చెప్పి చెప్పడం జరుగుతున్నది. కావున విద్యుత్ అధికారులు కస్తూరిబాయి స్కూల్లోని బోరికి వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి. ఈ బోరు ప్రాసెస్ లేట్ అవుతున్నందున ప్రభుత్వం వెంటనే ఎం పి డి ఓ ఎం ఈ ఓ స్పందించి ట్యాంకర్ల ద్వారా స్కూల్ పిల్లలకు నీటిని సప్లై చేసి పిల్లలకు నీటి సమస్య రాకుండా చూడాలి, అలాగే త్రాగునీరు కూడా పిల్లల సొంత ఖర్చు కాకుండా ప్రభుత్వమే ఫిల్టర్ నీళ్లు విద్యార్థినులకు తాగునీరు అందించాలని చెప్పి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఈ నీటి సమస్య వెంటనే పరిష్కరించకపోతే విద్యార్థిని కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని సిపిఐ పార్టీగా ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమం లో మండల సహాయ కార్యదర్శులు పెద్దిరాజు కెబాలు, మండల కార్యవర్గ సభ్యులు దావీదు, బాల ఓబులేసు తదితరులు.

## వందగల్లు గ్రామంలో ఒకే కుటుంబ పై 20 మంది దాడి

**ఆదోని :**కర్నూలు జిల్లా కోసిగి మండలం వందగలు గ్రామంలో ఒకే కుటుంబం పై సుమారు సాయంత్రం 8 గంటల సమయంలో కరెంటు తీసి 20 మంది మూకుమ్మడిగా దాడి చేశారని బాధితురాలు సునీత తెలిపారు, ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు వివరాల్లోకి వెళితే వందగల్లు గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న కుటుంబంపై కక్షపూరితంగా 20 మంది ఆడబిడ్డ అని చూడకుండా పెద్దమనిషి అని చూడకుండా ఒకేసారి దాడి చేయడం అది రాత్రి సమయంలో కరెంటు తీసి ఎనిమిది గంటల సమయంలో కొట్టడం ప్రాణాలు పొయ్యి పరిస్థితి ఏర్పడిందని వాపోయారు, గతంలో కూడా మ ఇంటిపై నాలుగైదు సార్లు రాళ్ల విసిరారు అలాగే ఒక ఆడబిడ్డ విషయంలో బాత్రూంలో స్నానం చేస్తుండగా తొంగి చూస్తుంటే ఇది తప్పు అని చెప్పి కేసు పెట్టడం వల్ల అది మనసులో పెట్టుకొని కక్షపూరితంగా దాడి చేశారని పోలీస్ స్టేషన్లో కంప్లీట్ కూడా ఇవ్వడం జరిగిందని



దీనిపై గ్రామంలో ఉన్న సర్పంచి కూడా తీర్మానించి సీసీ కెమెరాలు పెట్టించి రాజి చేశారని అన్నారు. అయినా కూడా ఇదంతా మనసులో పెట్టుకొని ఈ విధంగా రాత్రి సమయంలో కొట్టడం చాలా బాధాకరమని నా భార్యకి వెన్నుముక సమస్యతో బాధపడుతుంటే రెండు లక్షల రూపాయలతో చికిత్స పొందిందని



మరి అలాగే ఆమె పై దాడి చేశారని నడవలేని స్థితిలో ఉండడం ఇప్పుడు మా కుటుంబ పరిస్థితి ఏంటని పెద్దమనిషి అని చూడకుండా కొట్టి విధంగా మంచాన చేశారని ఇప్పుడు మా కుటుంబ పరిస్థితి గడవడం కష్టంగా మారిందని దీనికి సరైన న్యాయం చేయాలని బాధితుల కోరారు.

## తిరుపతికి పాదయాత్రగా బయలు దేరిన మాణిక్యం

**పటాన్ చెరు :**పటాన్ చెరు నియోజకవర్గం అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటకు చెందిన సీనియర్ నాయకులు టి.మాణిక్యం మంగళవారం లోక కళ్యాణార్థం తిరుపతికి 5వ సారి పాదయాత్రగా బయలుదేరాడు. కిష్టారెడ్డిపేట లోని దుర్గ మాత ఆలయంలో మాణిక్యం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుపతికి పాదయాత్రలకు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లోక కళ్యాణార్థం కోసం, ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వరుసగా ఐదవ సారి తిరుపతికి పాదయాత్రగా బయలుదేరి, శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటామని తెలిపారు. మాణిక్యంతోపాటు పలువురు యువకులు తిరుపతికి పాదయాత్రగా బయలుదేరారు.



పాదయాత్రగా బయలుదేరుతున్న మాణిక్యంను అమీన్ పూర్ మాజీ ఎంపీపీ ఈర్ల దేవానంద్ ముదిరాజ్, మాజీ జడ్పిటిసి గంగుల సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ దేవేందర్ రాజు, మాజీ సర్పంచ్ ఏర్పుల కృష్ణ, సీనియర్ నాయకులు పట్నం రాజు, దండు సత్యనారాయణలు



శాలువాలతో సన్మానించి, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో పాదయాత్ర విజయవంతం కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దశరథ్, ఆంజనేయులు, దుర్గయ్య, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.


## నాగులపంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన సింధు ఆదర్శ్ రెడ్డి గారు

**రామచంద్రపురం :** నాగులపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం లోని రామచంద్ర రెడ్డి నగర్ కాలనీ లో గల శ్రీ నాగులమ్మ తల్లిగారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతి నగర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి సింధు ఆదర్శ్ రెడ్డి గారు పాల్గొని నాగులమ్మ తల్లికి పూజలు అర్పించారు.స్థానిక భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న కార్పొరేటర్ గారు ప్రజల శ్రేయస్సు, ఆరోగ్యం, ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులతో మమేకమై పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



బుధవారం, జూలై 30, 2025 | హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 10

# తెలుగు సాహితీ వినీలాకాశంలో సినారె ఒక ధృవతార : కేటీఆర్



**హైదరాబాద్ :** కవి, సాహితీవేత్త, సినీ గేయ రచయిత సి నారాయణరెడ్డి జయంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. కవితలు, పద్య కావ్యాలు, గేయ కావ్యాలు, గజల్‌లు, వ్యాసాలు, సినిమా పాటలు రూపం ఏదైనా సినారె కలానికి తిరుగులేదు అని కేటీఆర్ కొనియాడారు.కవి, సాహితీవేత్త, పరిశోధకుడు, అధ్యాపకుడు, సినీ గేయ రచయిత పాత్ర ఏదైనా సినారె ప్రతిభకు సాటిలేదు. ప్రపంచ సాహితీ లోకానికి మన తెలంగాణ గడ్డ అందించిన ఆణిముత్యం సింగిరెడ్డి నారాయణ రెడ్డి. తన పాండిత్యంతో తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన సినారె.. తెలుగు సాహితీ వినీలాకాశంలో ఒక ధృవతార అని కొనియాడారు.తన రచనలతో తెలుగు చలనచిత్ర రంగంలో సరికొత్త బాణీని సృష్టించిన సినారె పాటల పూదోట. జ్ఞానపీఠ్ అవార్డుతో పాటు ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు వారిని వరించినా, రాజ్యసభ ఎంపీతో పాటు ఎన్నో గొప్ప పదవులను వారు అలకరించినా.. ఇవన్నీ సినారె సాహితీ సేవ ముందు దిగదుడుపే. నేడు సింగిరెడ్డి నారాయణ రెడ్డి జయంతి సందర్భంగా వారికి అక్షర నివాళులు అని కేటీఆర్ పేర్కొన్నారు.

# పార్టీ పెద్దలతో భేటీ తర్వాత క్లారిటీ ఇస్తా : రాజా సింగ్



**హైదరాబాద్, జులై 29:** గోషా మహల్ అసెంబ్లీ స్థానానికి ఎట్టి పరిస్థితుల్లో ఉప ఎన్నిక రాదని స్థానిక ఎమ్మెల్యే రాజా సింగ్ స్పష్టం చేశారు. ఈ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరగను ందంటూ కొంత మంది సోషల్ మీడియా వేదికగా లేని పోని గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం హైద రాబాద్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ఎమ్మెల్యే రాజా సింగ్ మాటా డుతూ.. ఒకటి రెండు రోజుల్లో ఢిల్లీ పెద్దలు తనను పిలుసా రన్నారు. తన బాధలు వారికి చెప్పిన తర్వాత తాను బీజేపీలో తిరిగి చేరే అంశంపై క్లారిటీ ఇస్తానని చెప్పారు. ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బీజేపీ అభ్యర్థి వ్యక్తిగతంగా పిలిస్తే.. వెళ్లి ప్రచారం చేస్తానని తెలిపారు.బీజేపీ రాష్ట్ర నాయకత్వం తనను గుర్తించ కపోయినా.. తనను గుర్తించే వాళ్లు చాలా మంది ఉన్నారని పేర్కొన్నారు. బీజేపీలో చాలా మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పుకొచ్చారు. వారంతా బయటకు వచ్చి మాట్లాడటానికి భయపడుతున్నారన్నారు. తాను వెళ్లి ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేస్తే అక్కడ బీజేపీ ఓటు బ్యాంక్ చాలా బాగా పెరిగిందని వివరించారు. తనపై ఎవరు ఎన్ని కుట్రలు చేసారో అన్ని తనకు తెలుసునని చెప్పారు.కేంద్ర మంత్రులు తనతో టచ్‌లోనే ఉన్నారని చెప్పారు రాజాసింగ్. తాను శివసేన, టీడీపీ, జన సేనలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలను ఈ సందర్భంగా ఆయన ఖండించారు. ఈ వార్తల్లో వాస్తవం లేదన్నారు. ఇవన్నీ బీజేపీకి మిత్రపక్ష పార్టీలేనని గుర్తు చేశారు. తెలంగాణలో బీజేపీ కొత్త అధ్యక్షుడు రామచందర్ రావు బాగానే పని చేస్తున్నారంటూ ఆయ నపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆయన నేతృత్వంలో తెలం గాణలోపార్టీ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు.

# హైడ్రా మళ్లీ దూకుడు

## అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం



**హైదరాబాద్:** మూసీనది గర్భంలో ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు. చాదరఘాట్ బ్రిడ్జి నుంచి పాత బస్తీ ఉస్మానియా ఆస్పత్రి మార్చురీ వరకు పలు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించారు. ఈ స్థలాన్ని వాహనాల పార్కింగ్ కోసం ఆక్రమణ దారులు వినియోగిస్తున్నారు. చదును చేసి షెడ్డులు నిర్మించి కిరాయికి ఇస్తున్నారు కబ్జాదారులు. మూసీ ఆక్రమణలపై హైడ్రాకు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో చర్యలు చేపట్టారు. 3.10 ఎకరాల మేర కబ్జా చేసి షెడ్డు నిర్మించి అక్రమ వ్యాపారం చేస్తున్నారు ఆక్రమణ దారు తికారంసింగ్. అలాగే 1.30 ఎకరాల మేర కబ్జా చేశారు ఆక్రమణ దారు పూనమ్ చాంద్ యాదవ్.5.22 ఎకరాల మేర కబ్జా చేశారు జయకృష్ణ. కబ్జా చేసిన వారంతా అక్కడ షెడ్డులు వేసి.. వాటిని అద్దెకు ఇచ్చి వ్యాపారం చేస్తున్నట్లు హైడ్రా అధికారులు వెల్లడించారు. బస్సులు, లారీల పార్కింగ్ కోసం కిరాయికి ఇస్తూ ఆక్రమణ దారులు వినియోగిస్తున్నారు. ఆ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు స్థానికులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. మూసీ గర్భంలో మట్టిపోసి షెడ్డులని నిర్మించినట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. నర్సరీ బిజినెస్ నిర్వహణ, ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగిం చారు.హైడ్రాఅధికారులుతీసుకుంటున్నచర్యలపై పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# సివిల్ సప్లై స్కాంలో రేవంత్ రెడ్డి, ఉత్తమ్ ప్రధాన పాత్రధారులు వెల్లడించిన పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి



**హైదరాబాద్ :** తెలంగాణ సివిల్ సప్లైస్ స్కాంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులు ప్రత్యక్షంగా పాల్గొ న్నారని మాజీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. ఈ కుంభకోణంలో రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డినే ప్రధాన పాత్రధారులు అని అన్నారు. పౌరసరఫరాల శాఖలో కుంభకోణంపై ఈడీకి ఫిర్యాదు చేసిన అనంతరం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నాయకులు గంగుల కమలాకర్, పెద్దిరెడ్డి సుదర్శన్ మీడియాతో మాట్లా డారు.ఈ సందర్భంగా పెద్దిరెడ్డి సుదర్శన్ మాట్లాడుతూ.. పద్దెనిమిది నెలల క్రితం జరిగిన ధాన్యం కొనుగోలు టెండర్ల కుంభకోణంపై ఇప్పటికే 8సార్లు ప్రెస్‌మీట్ పెట్టినప్పటికీ కాంగ్రెస్ నుంచి గానీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి గానీ స్పందన లేదని తెలిపారు. ఇదే అంశంపై అసెంబ్లీలో తమ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు లేవనెత్తినప్పటికీ స్పందన రాలేదన్నారు. దీనిపై హైకోర్టును కూడా ఆశ్రయించామని పేర్కొన్నారు.రైస్ మిల్లర్ల నుంచి బిడ్డర్లు ధాన్యం టన్నుకు రూ.2230 అదనంగా వసూలు చేసి కాంగ్రెస్ పెద్దలకు పంపించారని పెద్దిరెడ్డి ఆరోపించారు. అక్రమంగా డబ్బులు చేరిన 187 ఖాతాల వివరాలను సేకరించామని తెలిపారు. ఇందులో మనీలాండరింగ్ జరిగిందని పేర్కొన్నారు. తాము సేకరించిన ఆధారాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఈడీతో పాటు సీబీఐ, డైరెక్టరేట్ ఆఫ్ ఇంటెలిజెన్స్‌కు కూడా ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. మొత్తం 700 పేజీలకు పైగా బుక్‌లెట్ తయారుచేసి దర్యాప్తు సంస్థలకు పంపిస్తున్నామని చెప్పారు. ఈ కుంభకోణంలో తప్పకుండా దోషులకు శిక్ష పడుతుందని .. ఎవ్వరూ తప్పించుకోలేరని ఆశాభావం వ్యక్తం చేశారు. పౌరసరఫరాల శాఖలో జరిగిన ఈ కుంభకోణంపై బీజేపీ స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ దొంగల ముఠాగా వ్యవహరిస్తుందని.. దండుపాళ్యం బ్యాచ్‌లా దోచుకుంటుందని ఆరోపించారు. ఈ దోపిడీని బయటపెట్టామని అన్నారు. రూ.423 కోట్లు వివిధ బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ అయ్యాయని చెప్పారు. ఎన్నిసార్లు కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు అడిగినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడమే ఈ కుంభకోణం జరిగిందని అనడానికి రుజువని అన్నారు. ఈ అవినీతి ఇంకా కొనసాగుతూనే ఉందని తెలిపారు.అన్ని దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తాం: గంగులధాన్యం కొనుగోలు టెండర్లలో మొదటి నుంచి అవకతవకలు జరిగాయని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ప్రభుత్వ ఖజానాల్లోకి రావాల్సిన డబ్బులు ప్రైవేటు వ్యక్తుల ఖాతాల్లోకి వెళ్లాయని ఆరోపించారు. ఈ స్కాంపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని తెలిపారు. అదే బీఆర్ఎస్ కార్యకర్తలపై చిన్న ఫిర్యాదు చేస్తేనే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. పౌరసరఫరాల శాఖలో కుంభకోణంపై ఈడీకి ఫిర్యాదు చేసిన అనంతరం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నాయకులు గంగుల కమలాకర్, పెద్దిరెడ్డి సుదర్శన్ మీడియాతో మాట్లాడారు.ఈ కుంభకోణంపై ఏసీబీ ఎందుకు స్పందించడం లేదని గంగుల కమలాకర్ ప్రశ్నించారు. దర్యాప్తు సంస్థల మీద తమకు నమ్మకం ఉందని ఆయన తెలిపారు. అందుకే రాష్ట్రంతో పాటు కేంద్రంలో ఎన్ని దర్యాప్తు సంస్థలు ఉన్నాయో.. వాటన్నింటికీ ఈ కుంభకోణంపై ఫిర్యాదు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ స్కామ్‌పై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి ఇప్పటికైనా నోరు తెరవాలని డిమాండ్ చేశారు.

# ఉత్తమ్‌పై అలిగి వెళ్లిపోయి

## రెండు ఫోన్లు స్విచ్చాఫ్ చేసుకున్న మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్ :** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై మరో మంత్రి కోమటిరెడ్డి వెంకటర్ రెడ్డి అలిగి వెళ్లిపోయారు. మంగళవారం నాడు నాగార్జున సాగర్ డ్యామ్ గేట్లు ఎత్తడానికి హైదరాబాద్ బేగంపేట నుంచి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ హెలికాప్టర్‌లో బయల్దేరాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం మంత్రులు కోమటిరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ ఉదయం 9 గంటలకే బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాత్రం 10 గంటలు అయినా అక్కడకు చేరుకోలేదు.తమను ఉదయం 9 గంటలకే రమ్మని చెప్పి.. 10 గంటలు దాటినా ఉత్తమ్ కుమార్ రెడ్డి రాకపోవడంపై కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకెంతసేపు ఆగాలి అంటూ అలిగి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత కొద్దిసేపటికి ఎయిర్‌పోర్టు చేరుకున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి.. అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి నాగార్జున సాగర్ బయల్దేరి వెళ్లారు. అక్కడ సాగర్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ క్రమంలోనే మంత్రి కోమటిరెడ్డి తన రెండు ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసుకున్నట్లు సమాచారం.

# అర్హులందరికి రేషన్ కార్డులు అందిస్తాం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**కట్టంగూర్, జూలై 29 :** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తుందని పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలానికి నూతనంగా మంజూరైన 1,903 రేషన్ కార్డులు, 52 కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం కట్టంగూర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా సన్నబియ్యం ఇవ్వడం లేదన్నారు. సన్న వడ్లు పండించేలా ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తుందని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గంలో నూతనంగా 8,231 రేషన్ కార్డులు ఇచ్చినట్లు తెలిపారు. అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్‌తో పాటు నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ కుమార్ మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలానికి నూతనంగా మంజూరైన 1,903 రేషన్ కార్డులు, 52 కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం కట్టంగూర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు రేషన్ కార్డులు రావడం వల్ల అనేక సంక్షేమ కార్యక్రమాలు అందుతాయన్నారు. నల్లగొండ జిల్లాలో 62,100 మందికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వేముల వీరేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ చౌహన్, మిర్యాలగూడెం సబ్ కలెక్టర్ అమిత్ నారా యణ, ఆర్టీఓ యారాల అశోక్ రెడ్డి, ఇన్ చార్జి తాసీల్దార్ వెంకటేశ్వరావు, మండల ప్రత్యేక అధికారి కోటే శ్వర్ రావు, మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ్మ, డీటీ ఫ్రాంక్లిన్ ఆల్బట్, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, నాయకులు శ్యామల శ్రీనివాస్, బచ్చులపల్లి గంగాధర్ రావు, గాజుల సుకన్య, రెడ్డిపల్లి సాగర్, రెడ్డిపల్లి వీరస్వామి, బూరుగు, దార భిక్షం, మర్రి రాజు పాల్గొన్నారు.


# నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం




**నీలగిరి, జూలై 29 :** నల్లగొండ పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఓ వ్యక్తి తనకు తాను అంటించుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీస్ సిబ్బంది అప్రమత్తమై కాపాడడంతో ప్రాణాపాయం తప్పింది. మంగళవారం సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఎస్ఐ సైదులు రోజువారి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని దేవరకొండ రోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో బైక్‌పై వస్తున్న పట్టణానికి చెందిన రావిళ్ల నర్సింహ్మ అనే వ్యక్తిని ఆపి డ్రంకెన్ టెస్ట్ చేయగా 155 ఎంజీ/100ఎంఎల్ ఆల్కహాల్ రీడింగ్ వచ్చిందని తెలిపారు. తాగి వాహనం నడపడం సరైంది కాదని కౌన్సిలింగ్ ఇచ్చి, రేపు ఉదయాన్నే స్టేషన్‌కు రావాలని ఎస్ఐ సూచించి పంపించాడు.అక్కడి నుండి వెళ్లిపోయిన నర్సింహ్మ సుమారు 40 నిమిషాల తర్వాత వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి, తనపైనే కేసు పెడుతారా అంటూ స్టేషన్ మెయిన్ గేట్‌లోకి ప్రవేశించే ప్రయత్నం చేశాడన్నారు. అక్కడే విధుల్లో ఉన్న హెూంగార్డు ప్రవీణ్‌కు నర్సింహ్మ శరీరం నుండి పెట్రోల్ వాసన వస్తుండడాన్ని గమనించి నిలు వరించే ప్రయత్నం చేశాడు. బయట తన శరీరంపై పెట్రోల్ పోసుకుని స్టేషన్‌కు వచ్చిన నర్సింహా తన వెంట తెచ్చుకున్న లైటర్‌ను వెలిగించడంతో శరీరానికి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. తక్షణం స్పందించిన కానిస్టేబుల్ అంజద్ బెడ్‌షీట్‌తో మంటలు ఆర్పాడు. దీంతో నర్సింహాకు ప్రాణా పాయం తప్పింది. గాయపడ్డ అతడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. హెూంగార్డు ప్రవీణ్ చేతులకు మంటలంటుకోవడంతో గాయాలయ్యా యి. పోలీస్ విధులకు ఆటంకం కలిగించడం, ఆత్మహత్యాయత్నం చేయడంపై పోలీసులు నర్సింహాపై కేసులు నమోదు చేశారు.

# 18 ఏండ్ల తర్వాత జులై నెలలోనే

## నాగార్జున సాగర్ 26 క్రస్ట్ గేట్లు ఎత్తివేత



**నల్లగొండ :** నాగార్జున సాగర్ నిండు కుండలా మారడంతో.. ఆ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. అయితే జులై నెలలోనే 26 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడం 18 ఏండ్ల తర్వాత ఇదే తొలిసారి. ఇక సాగర్ గేట్లు ఎత్తడంతో.. ఆ దృశ్యాన్ని చూసేందుకు స్థానికులు, పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆ దృశ్యాలను పర్యాటకులు తమ కెమెరాల్లో బంధిస్తూ, మరోవైపు ఫొటోలకు ఫోజులిస్తూ ఎంజాయ్ చేశారు.ఉదయం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మొదట 14 గేట్లను తెరిచారు. సాయంత్రం నాటికి మొత్తం 26 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 590.00 అడుగులు కాగా, ప్రస్తుతం 586.60 అడుగులకు చేరింది. గేట్లను ఎత్తిన నేపథ్యంలో దిగువ ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.షెడ్యూల్ ప్రకారం నల్లగొండ జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా మంగళవారం ఉదయం 10 గంటలకు నాగార్జున సాగర్ గేట్లను తెరువాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటలకు అందరూ బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నాగార్జునసాగర్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

# సీఎం రమేష్ అంటే చీటింగ్ మనీ లాండరింగ్



**హైదరాబాద్, జూలై 29:** సీఎం రమేష్ అంటే చీటింగ్, మనీ లాండరింగ్ అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి మండిపడ్డారు.ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ , తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలలో కాంగ్రెస్, దేశంలో బీజేపీ కోసం పనిచేస్తున్న బ్రోకర్ అని, రాజకీయంగా పెద్ద జోకర్ అని ధ్వజమెత్తారు. సీఎం రమేష్ కాంగ్రెస్, బీజేపీ, టీడీపీలు పోషిస్తున్న సుపారీ కిల్లర్ అని, డబ్బు మూటల కోసం దళారిగా, రాజకీయ ప్రత్యర్థుల వ్యక్తిత్వాన్ని చంపేసే తలారీగా మారాడని జీవన్ రెడ్డి నిప్పులు చెరిగారు. అధికారం అండతో ప్రజాధనాన్ని మెక్కే పందికొక్కు సీఎం రమేష్.. చంద్రబాబు నాయుడుకు బినామీ, దోపిడీలో సునామీ అని విమర్శించారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలలో కాంగ్రెస్ నేతలతో కలిసి అక్రమ దందాలతో డబ్బు కూడబెట్టుకుంటూ తనపై ఈడీ, ఐటీ దాడులు తప్పించుకునేందుకు బీజేపీ పంచన చేరాడని దుయ్యబట్టారు. హెచ్‌సీయూ భూములు తాకట్టుపెట్టి రూ.10 వేల కోట్ల అప్పు తీసుకోవడంలో రేవంత్ సర్కారుకు బ్రోకర్‌గా పని చేశాడని ఆరోపించారు.దానికి ప్రతిఫలంగా ఫ్యూచర్ సిటీ పేరుతో రేవంత్ ఆడుతున్న అవినీతి ఆటలో రూ.13వందల కోట్ల టెండర్లు దక్కించుకున్నారని, అందుకు కృతజ్ఞతగా చంద్రబాబు, రేవంత్ తరపున వకాల్తా పుచ్చుకొని బీఆర్ఎస్‌పై సీఎం రమేష్ విషం కక్కుతున్నాడని మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ దాడి చేసిండన్నారు. సీఎం రమేష్ చేసిన వ్యాఖ్యలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిల స్క్రిప్టులో భాగమేనని, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో లబ్ది కోసం కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ కుట్రలు షురూ చేసిందనడానికి ఆయన వ్యాఖ్యలే నిదర్శనమని చెప్పారు. చంద్రబాబు, రేవంత్ ఆదేశాల ప్రకారమే తెలంగాణలో అన్నదమ్ముల్లా బతుకుతున్న ప్రజల మధ్య కులాల కుంపటి రాజేసే కుట్ర జరుగుతోందన్నారు. కమ్మ, రెడ్డి సామాజిక వర్గాలను బీఆర్ఎస్‌కు దూరం చేసే దుష్ట పన్నాగం పన్నారని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం లభించిందన్నారు. కమ్మ సామాజిక వర్గంపై కేటీఆర్ తప్పుడు వ్యాఖ్యలు చేసినట్టు సీఎం రమేష్ గోబెల్స్ మాటలు చెప్పడం ఈ దశాబ్దపు జోక్‌గా అభివర్ణించారు.కమ్మ సామాజిక వర్గానికి ఏ పార్టీలో లభించనంత గౌరవం బీఆర్ఎస్‌లోనే దక్కిందన్నారు. కమ్మ సామాజికవర్గం వారు బీఆర్ఎస్‌కు అవసరం లేదని కేటీఆర్ అన్నట్లు రమేష్ చేసిన వ్యాఖ్యలు పచ్చి అబద్ధమన్నారు. నిన్నటికి నిన్న కమ్మ సామాజిక వర్గానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అనారోగ్యంతో మృతి చెందితే కేటీఆర్ కుటుంబం ఎలా స్పందించిందో ప్రజలంతా చూశారన్నారు. గోపీనాథ్ ఆసుపత్రిలో చేరిన నాటి నుంచి ఆయనను బతికించుకోవడానికి అత్యాధునిక వైద్య చికిత్స అందేలా కేటీఆర్ ఫ్యామిలీ చేయని ప్రయత్నం లేదని తెలిపారు. దురదృష్ట వశాత్తూ అనారోగ్యంతో మరణించగా ఆయన అంత్యక్రియల దగ్గర నుంచి దశదిన కర్మల వరకూ కేటీఆర్ కుటుంబమంతా అక్కడే ఉండి అంతా తామే అయి అన్ని కార్యక్రమాలు జరిపించిన విషయం సీఎం రమేష్ గుడ్డి కండ్లకు కనిపించలేదా? అని ఆయన నిలదీశారు. గతంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన అక్కినేని నాగేశ్వరరావు, రామానాయుడు, సూపర్ స్టార్ కృష్ణ వంటి వారు చనిపోతే అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించింది కేసీఆర్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు సొంత బావమరిది హరికృష్ణ దురదృష్టవశాత్తూ రోడ్డు ప్రమాదంలో చనిపోతే వారి అంత్యక్రియలను కూడా అధికార లాంఛనాలతో జరిపించడమే కాక ఆయన స్మారక చిహ్నం కోసం భూమి కేటాయించింది కేసీఆర్ ప్రభుత్వమన్న విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు.

# ఇండోపాక్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు నా అంతరాత్మ ఒప్పుకోదు: అసదుద్దీన్ ఓవైసీ



**న్యూఢిల్లీ:** ఇండియా, పాకిస్థాన్ క్రికెట్‌కు ఎంత క్రేజీ ఉందో తెలిసిన విషయం తెలిసిందే. ఆ రెండు జట్లు తలపడితే ఆ టెన్షనే వేరు. అయితే తాజాగా ఆసియా కప్ షెడ్యూల్ రిలీజ్ అయ్యింది. ఈ ఏడాది సెప్టెంబర్ 14వ తేదీన ఆ రెండు జట్లు దుబాయ్ వేదికగా తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరుగుతున్న సమయంలో ఆయన మాట్లాడుతూ.. ఇండియా, పాకిస్థాన్ జట్లు తలపడితే ఆ మ్యాచ్‌ను వీక్షించేందుకు తన అంతరాత్మ ఒప్పుకోదన్నారు. పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలహీనపడిన విషయం తెలిసిందే. ఇలాంటి సందర్భంలో ఎలా పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడుతారని ఆయన ప్రశ్నించారు. పాకిస్థాన్ విమానాలు మన వైమానిక క్షేత్రంలోకి రావడం లేదని, మన జలాల్లోకి వాళ్ల బోట్లు రావడం లేదని, ఆ దేశంతో వాణిజ్యం జరగడం లేదని, అలాంటప్పుడు పాకిస్థాన్‌తో ఎలా క్రికెట్ ఆడుతారని ఓవైసీ ప్రశ్నించారు.ఆ దేశానికి మనం నీళ్లు ఇవ్వడం లేదని, పాక్‌కు వెళ్లే 80 శాతం నీటిని ఆపేస్తున్నామని, రక్తం.. నీరు ఒకే సారి పారవని అంటున్నామని, అలాంటప్పుడు ఆ దేశంతో ఎలా క్రికెట్ ఆడుతారని అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. ఆ మ్యాచ్‌ను వీక్షించేందుకు తన అంతరాత్మ అంగీకరించదన్నారు. సెప్టెం బర్ 9వ తేదీ నుంచి జరిగే ఆసియాకప్‌లో 8 దేశాలు ఆడనున్నాయి.

# పంత్ స్థానంలో తమిళ తంబీ తుది జట్టులో వీళ్లేనా






అండరన్స్ టెండూల్కర్ ట్రోఫీలో చివరి టెస్టు రిషభ్ పంత్ దూరమయ్యాడు. మాంచెస్టర్ టెస్టులో కుడి పాదం వేలికి గాయంతో ఇబ్బంది పడిన భారత వైస్ కెప్టెన్ ఓవల్ టెస్టు కు అందుబాటులో ఉండడని బీసీసీఐ తెలిపింది. అతడి స్థానంలో వికెట్ కీపర్ జగదీశను స్క్వాడ్‌లోకి తీసుకున్నారు సెలెక్టర్లు. ప్రస్తుతం పంత్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడు. ఈ చిచ్చరపిడుగు త్వరగా కోలుకోవాలని బీసీసీఐతో పాటు అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. భారత్, ఇంగ్లండ్‌ల మధ్య జూలై 31న ఐదో టెస్టు మొదలవ్వనుంది.మాంచెస్టర్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో గాయంతో రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడిన పంత్.. శార్దూల్ ఠాకూర్ ఔటయ్యాక కుంటుతూనే క్రీజులోకి వచ్చాడు. 37 పరుగులతో ఎంటరైన అతడు అర్ధ శతకంతో జట్టును ఆదుకున్నాడు. అయితే.. స్కానింగ్ పరీక్షలో అతడి కుడి పాదం వేలు ఎముక విరిగినట్టు తేలడంతో వైద్యులు విశ్రాంతి అవసరమని సూచించారు. పంత్ ఓవల్ టెస్టుకు దూరం అయ్యాడు. జగదీశన్ విషయానికొస్తే.. తమిళనాడుకు చెందిన ఈ యంగ్‌స్టర్ దేశవాళీలో నిలకడగా ఆడుతున్నాడు. ఈమధ్యే తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో సూపర్ ఫిఫ్టీ బాదిన జగదీశన్ సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు. ఇక గాయం కారణంగా నాలుగో టెస్టు ఆడని ఆకాశ్ దీప్ కోలుకున్నాడు. కాబట్టి.. ఐదో టెస్టులో బుమ్రాను ఆడిస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది.భారత స్క్వాడ్ (ఐదో టెస్టు కోసం) : శుభ్‌మన్ గిల్(కెప్టెన్), యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, కుల్దీప్ యాదవ్, అన్షుల్ కంభోజ్, అర్ష్‌దీప్ సింగ్, ఎన్.జగదీశన్(వికెట్ కీపర్).మాంచెస్టర్ టెస్టులో ఓటమి తప్పదనుకున్న వేళ భారత జట్టు అపూర్వ పోరాటంతో ఔరా అనిపించింది. తొలి ఇన్నింగ్స్‌లో 311 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆడిన టీమిండియా.. శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌ల అద్భుత పోరాటంతో సిరీస్ సమం చేసింది. ఐదు సెషన్ల పాటు ఇంగ్లండ్ బౌలర్లను అలసిసొలసేలా చేశారు ఈ నలుగురు . ఓల్డ్ ట్రఫోర్డ్‌లో అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ స్టోక్స్ సేన ఆశలపై నీళ్లు చల్లారు. దాంతో.. చివరి టెస్టులో విజయంతో సిరీస్ పట్టేయాలని గిల్ సేన పట్టుదలతో ఉంది.

# ఆసియా కప్ 2025లో భారత్ పాకిస్తాన్ మ్యాచ్ పై ఏసీసీ క్లారిటీ



ఇండియా పాకిస్తాన్ ఆసియా కప్ 2025 మ్యాచ్‌పై ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, ఈ హై వోల్టేజ్ పోరాటం యధాతథంగా కొనసాగనుంది. ఏప్రిల్‌లో పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఇండియా-పాకిస్తాన్ మధ్య జరగాల్సిన మ్యాచ్‌పై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఆసియా కప్ సెప్టెంబర్ 14, 2025న యూఏఈలో జరగనున్న ఈ మ్యాచ్ రద్దు కాదని ఆసియా క్రికెట్ కౌన్సిల్ స్పష్టం చేసింది.ఎందుకు రద్దు కావడం లేదు?ఇది ద్వైపాక్షిక సిరీస్ కాదని, అనేక దేశాల టోర్నమెంట్‌లో భాగంగా జరిగే మ్యాచ్ మాత్రమేనని సభ్యులు తెలిపారు. ఇండియా గేమ్ నుంచి తప్పుకుంటే, పాకిస్తాన్‌కు నేరుగా వాక్‌ఓవర్ లభిస్తుందన్నారు. అది మిగతా జట్లకు అన్యాయంగా మారుతుందని ఓ ఉన్నతాధికారి తెలిపారు.తగ్గనున్న ఆదాయం..ఈ టోర్నీలో భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌కు అత్యధిక ప్రేక్షకాదరణ ఉంటుంది. దీనివల్ల మిగతా 24 సభ్య దేశాలకు వచ్చే ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. సోనీ నెట్‌వర్క్ ఈ టోర్నమెంట్ ప్రసార హక్కులను 8 ఏళ్లకు %ఖుణ% 170 మిలియన్‌తో పొందింది. అందులో ప్రధాన భాగం భారత్-పాకిస్తాన్ మ్యాచ్ నుంచే వస్తుంది. కాబట్టి ఇండియా, పాకిస్తాన్ మ్యాచ్ రద్దయ్యే అవకాశం లేదన్నారు.ప్రభుత్వ అనుమతి ముందేఇండియా వేదికగా ఉన్నప్పటికీ, ఆసియా కప్ 2025 యూఏఈలో జరగనుంది. టోర్నమెంట్‌కు సంబంధించిన ప్రభుత్వ అనుమతి ముందే లభించిందని సమాచారం. క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవియా ఇటీవలే ప్రకటించినట్టు, ఆయా దేశాల ఈవెంట్‌లలో పాకిస్తాన్‌తో భారత్ ఆడతుందనే విషయం ఇప్పటికే స్పష్టమైందని తెలిపారు.అధికారిక వర్గాల ప్రకారం.ఇటీవల ఇంగ్లాండ్‌లో జరగాల్సిన ఇండియా-పాకిస్తాన్ లెజెండ్స్ మ్యచ్‌ను సోషల్ మీడియా వ్యతిరేకత కారణ ంగా రద్దు చేశారు. దీంతో ఆసియా కప్ మ్యాచ్ కూడా రద్దవుతుందేమో అనే ఊహాగానాలు పెద్ద ఎత్తున వచ్చాయి. కానీ అధికారిక వర్గాలు మాత్రం అందుకు అవకాశం లేదని స్పష్టం చేశాయి.ఆసియా కప్ 2025 షెడ్యూల్‌ఈ సారి ఆసియా కప్ సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు జరగనుంది. ఇది టీ20 ఫార్మాట్‌లో ఉంటుంది. ఇండియా, పాకిస్తాన్, యూఏఈ, ఒమన్‌లు గ్రూప్ లో ఉన్నాయి. ఈ రెండు జట్లు సూపర్ ఫోర్‌లో మళ్లీ తలపడే అవకాశం ఉంది. ఫైనల్‌లో కూడా ఇవే జట్లు తలపడితే మూడు వారాల్లో మూడు మ్యాచ్‌లు జరగచ్చన్న అంచనాలు ఉన్నాయి.

# ప్రపంచ చదరంగానికి మరో యువరాణి దివ్య దేశ్‌ముఖ్




భారత చదరంగ చరిత్రలో నూతన అధ్యాయం! అసలు ఎలాంటి అంచనాలు లేకుండా ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తు చేస్తూ ప్రతిష్టాత్మక ఫిడే చెస్ ప్రపంచకప్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఆఖరి పోరులో వెటరన్ గ్రాండ్‌మాస్టర్ కొనేరు హంపిపై యువ సంచలనం దివ్య చిరస్మరణీయ విజయం సాధించింది. ప్రపంచకప్ టైటిల్ దక్కించుకున్న తొలి భారత ప్లేయర్‌గా దివ్య అరుదైన రికార్డు కొల్లగొట్టింది. సోమవారం జరిగిన రెండు ర్యాపిడ్ గేముల్లో హంపితో తొలి గేమును డ్రా చేసుకున్న దివ్య..మలిగేమ్‌లో అద్భుత విజయం సొంతం చేసుకుంది. తన కెరీర్‌లో తొలిసారి మేజర్ టైటిల్ గెలిచిన ఆనందంలో దివ్య ఉబికి వస్తున్న కన్నీళ్లను దిగమింగుకుంటూ తల్లిని ఆలింగనం చేసుకుంది. ఈ విజయంతో గ్రాండ్‌మాస్టర్ హొదా దక్కించుకున్న ఐదో భారత మహిళా ప్లేయర్‌గా నిలిచింది. దివ్య చారిత్రక విజయంతో జార్జియాలో మువ్వన్నెల జెండా సగర్వంగా రెపరెపలాడింది. ప్రపంచ చెస్ యవనికపై భారత్ మరోమారు తమదైన ముద్ర వేసింది. చెస్‌పై తమ ఆధిపత్యాన్ని మరింత ద్విగుణీకృతం చేసుకుంటూ ప్రతిష్టాత్మక చెస్ ప్రపంచకప్‌లో భారత్ విజయదుందుభి మోగించింది. సోమవారం జరిగిన మెగాటోర్నీ ఫైనల్లో దివ్య దేశ్‌ముఖ్ 2.5-1.5 తేడాతో కోనేరు హంపిపై అద్భుత విజయం సాధించింది. తొలుత రెండు క్లాసిక్ గేమ్‌లు డ్రా కాగా, విజేతను నిర్ణయించేందుకు జరిగిన ర్యాపిడ్ గేమ్‌లో దివ్యను విజయం వరించింది. మొదట ర్యాపిడ్ గేమ్ 0.5-0.5తో డ్రా అయ్యింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన 19 ఏండ్ల తన కంటే వయసులో పెద్దదైన హంపి(38)పై ఆధిక్యం ప్రదర్శించేందుకు ప్రయత్నించింది.

# పడకేసిన పారిశ్రామికోత్పత్తి కీలక రంగాలు కుదేలు



దేశంలో కీలక రంగాలు కుదేలవుతున్నాయి. ఆర్థిక, వ్యాపార, పారిశ్రామిక వృద్ధికి దోహదపడే అంశాల్లో నిస్తేజం కనిపిస్తున్నది. అసలే అంతర్జాతీయంగా విపత్కర పరిస్థితులు నెలకొన్న వేళ.. ఈ ప్రతికూల సంకేతాలు కలవరపాటుకు గురిచేస్తున్నాయిప్పు డు. గడిచిన 4 నెలలుగా భారతీయ పారిశ్రామికోత్పత్తి సూచీ కదలికలు తీవ్ర నిరాశనే మిగులుస్తున్నాయి .అంతకంతకూ పతనమవుతున్న ఉత్పాదక వృద్ధి.. గత నెల జూన్‌లో 10 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 1.5 శాతానికి పరిమితమైంది. గనులు, విద్యుత్తు రంగాల్లో ఉత్పత్తి నత్తనడకన సాగుతున్నదని తాజాగా విడుదలైన కేంద్ర ప్రభుత్వ గణాంకాలే చెప్తుండటం గమనార్హం. దేశీయ పారిశ్రామిక రంగాన్ని నిస్తేజం ఆవరించింది. ఈ ఏడాది మొదలు పారిశ్రామికోత్పత్తి క్షీణిస్తున్నది మరి. మార్చి నుంచి క్రమేణా పడిపోతున్న వృద్ధిరేటు.. గత నెల దాదాపు ఏడాది కనిష్ఠాన్ని తాకింది. జూన్‌లో 10 నెలల కనిష్ఠ స్థాయిని సూచిస్తూ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 1.5 శాతానికే పరిమితమైందని సోమవారం విడుదలైన అధికారిక గణాంకాల్లో తేలింది. గత ఏడాది ఆగస్టు తర్వాత ఈ స్థాయిలో ఉత్పాదక వృద్ధి నమోదు కావడం ఇదే తొలిసారి. ఇక నిరుడు జూన్‌లో 4.9 శాతం వృద్ధిని ఐఐపీ చూపింది.గనులు, విద్యుత్తు రంగాలు డీలాగనులు, విద్యుత్తు రంగాల్లో ఉత్పాదకత డీలా పడింది. అయితే దేశ ఆర్థిక ప్రగతికి రథ చక్రాలైన ఈ రెండు రంగాల్లో మందగమనం ఇలాగే కొనసాగితే.. మొత్తం జీడీపీ వృద్ధిని అది ప్రభావితం చేస్తుందన్న ఆందోళనలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. ఏడాది క్రిందటితో పోల్చితే ఈ జూన్‌లో గనుల రంగంలో ఉత్పత్తి వృద్ధిరేటు 10.3 శాతం నుంచి 8.7 శాతానికి తగ్గింది. ఫలితంగా విద్యుదుత్పత్తిపై పెద్ద ఎత్తునే ప్రభావం పడింది. పోయినసారి జూన్‌లో దేశీయ విద్యుదుత్పత్తిలో 8.6 శాతం వృద్ధి నమోదైంది. కానీ ఈ జూన్‌లో 2.6 శాతంగానే ఉన్నది. ఇప్పటికీ దేశంలో విద్యుత్తు అవసరాలు అత్యధికంగా తీరేది బొగ్గు ద్వారానే. దీంతో తగ్గిన బొగ్గు ఉత్పత్తి ప్రభావం.. వెంటనే విద్యుత్తు తయారీపై కనిపించిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. తయారీ వృద్ధీ అంతంతే. కీలకమైన తయారీ రంగంలోనూ గత నెల వృద్ధిరేటు అంతంతమాత్రంగానే ఉన్నది. గత ఏడాది జూన్‌లో 3.5 శాతంగా నమోదవగా, ఈ జూన్‌లో అది 3.9 శాతానికి పెరిగిందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) తమ తాజా నివేదికలో వెల్లడించింది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో ఐఐపీ వృద్ధి కేవలం 2 శాతంగానే ఉన్నది. ఏడాది క్రితం 5.4 శాతంగా ఉండటం గమనార్హం .అంతంతమాత్రంగానే దీంతో 11 నెలల కనిష్ఠానికి దిగజారినైట్టెంది. ఈ ఏడాది జనవరి-మార్చిలో 4 శాతంగా ఉన్నట్టు ఎన్‌ఎస్‌వో చెప్తున్నది. ఇదిలావుంటే ఈ ఏడాది మే నెలలో ఐఐపీ వృద్ధిరేటును ఎన్‌ఎస్‌వో సవరించింది. ముందుగా 1.2 శాతంగా ప్రకటించగా, దాన్నిప్పుడు 1.9 శాతానికి పెంచింది.క్యాపిటల్ గూడ్స్ రంగంలో వృద్ధిరేటు ఏడాది వ్యవధిలో 3.6 శాతం నుంచి 3.5 శాతానికి తగ్గింది.కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఉత్పాదక వృద్ధి గత జూన్‌తో చూస్తే ఈ జూన్‌లో 8.8 నుంచి 2.9 శాతానికి పడిపోయింది.కన్స్యూమర్ నాన్-డ్యూరబుల్స్ రంగంలోనూ ఉత్పత్తి వృద్ధిరేటు 1 శాతం నుంచి మైనస్ 0.4 శాతానికి దిగింది.మౌలిక/నిర్మాణ రంగంలోనూ 8.2 శాతం నుంచి 7.2 శాతానికి ఉత్పత్తి క్షీణించింది.ప్రైమరీ గూడ్స్ ఉత్పత్తిలో వృద్ధిరేటు 6.3 శాతం నుంచి మైనస్ 3 పతనమైనట్టు తాజా గణాంకాల్లో తేలింది.

# రూ 12000 లక్షల కోట్ల చెల్లింపులు




న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల్లో భారత్ దూసుకెళ్తోంది. గత ఆరేళ్లలో (2019-20 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు) రూ.12,000 లక్షల కోట్లకు పైగా విలువైన 65,000 కోట్లకు పైగా డిజిటల్ చెల్లింపుల లావాదేవీలు జరిగాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు వెల్లడించారు. దేశంలో డిజిటల్ చెల్లింపుల వినియోగాన్ని మరింత పెంచేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ), నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ), ఫిన్‌టెక్‌లు, బ్యాంక్‌లు, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సంబంధిత వర్గాలందరితో కలిసి పనిచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. చిన్న నగరాలు, ఈశాన్య రాష్ట్రాలు, జమ్ము కశ్మీర్‌లో డిజిటల్ చెల్లింపుల స్వీకరణకు అవసరమైన మౌలిక వసతులను ప్రోత్సహించేందుకు ఆర్‌బీఐ 2021లో పేమెంట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవల్‌పమెంట్ ఫండ్ (పీఐడీఎఫ్) ను ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు. 2025 మే 31 నాటికి పీఐడీఎఫ్ ద్వారా 4.77 కోట్ల డిజిటల్ టచ్ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ప్రపంచంలో అతిపెద్ద చెల్లింపుల వ్యవస్థగా యూపీఐ కొవిడ్ సంక్షోభ సమయం నుంచి దేశంలో డిజిటల్ చెల్లింపులు ఊపందుకున్నాయి. పెద్ద నగరాల నుంచి పల్లెల వరకు అన్ని ప్రాంతాల్లోనూ డిజిటల్ చెల్లింపుల సాంకేతికత, మౌలిక వసతులు వేగంగా విస్తరించింది. దేశంలో చౌక డేటా సేవలతో స్మార్ట్‌ఫోన్ల వినియోగం అనూహ్యంగా పెరగడం ఈ విప్లవాత్మక మార్పునకు ప్రధాన చోదకంగా పనిచేసింది. ఎన్‌పీసీఐ అభివృద్ధి చేసిన యూనిఫైడ్ పేమెంట్ సిస్టమ్ (యూపీఐ) ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద రిటైల్ రియల్ టైమ్ చెల్లింపుల వ్యవస్థగా ఎదిగింది. ప్రపంచంలో అతిపెద్ద ఇంటర్ బ్యాంక్ పేమెంట్ సెటిల్‌మెంట్ ప్లాట్‌ఫామ్ వీసా రోజువారీ లావాదేవీల సంఖ్యకు చేరువలో ఉంది. గత నెల 2న యూపీఐ ద్వారా రికార్డు స్థాయిలో 65 కోట్ల లావాదేవీలు జరిగాయి. ఎన్‌పీసీఐ డేటా ప్రకారం.. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో మహారాష్ట్రలో అత్యధిక యూపీఐ లావాదేవీలు జరగగా.. కర్ణాటక, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

# నో శాలరీ హైక్స్, సీనియర్ల నియామకాలు నిలిపివేత ఉద్యోగులకు టీసీఎస్ మరో షాక్




భారత్‌లోని అతి పెద్ద ఐటీ సర్వీసుల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ పెద్ద ఎత్తున లేఆఫ్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. తన మొత్తం ఉద్యోగుల్లో 2 శాతం మందికి ఉద్వాసన పలకనున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది కల్లా దాదాపు 12,200 మంది ఉద్యోగులపై దీని ప్రభావం పడనున్నది. మధ్య స్థాయి, సీనియర్ స్థాయి ఉద్యోగులపై అధికంగా వేటు పడే అవకాశం ఉంది. ఈ విషయాన్ని టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కే కృతివేశన్ మనీకంట్రోల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.అయితే, ఈ లేఆఫ్స్ ప్రకటన అనంతరం సంస్థ తాజాగా మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిసింది. కొత్త ఉద్యోగ నియామకాలను నిలిపివేసినట్లు సమాచారం. ఈ ఆర్థిక సంవత్సరంలో సీనియర్ లెవెల్ ఉద్యోగులను రిక్రూట్ చేసుకోకూడదని నిర్ణయించినట్లు తెలిసింది. అదేవిధంగా వార్షిక వేతనాల పెంపు, ఇంక్రిమెంట్లకు కూడా ఫుల్ స్టాప్ పెట్టినట్లు సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు సదరు కథనాలు పేర్కొంటున్నాయి.అంతేకాదు, బెంచ్‌పై నియమిత కాలం కంటే ఎక్కువగా ఉన్న సిబ్బందిని కూడా తొలగించే ప్రక్రియను మొదలు పెట్టినట్లు సమాచారం. ఇప్పటికే ఉద్యోగులు 35 రోజులకు మించి బెంచ్‌పై ఉండకూడదనే నియమాన్ని టీసీఎస్ అమలు చేస్తోన్న విషయం తెలిసిందే. ఇక మధ్యస్థ, సీనియర్ స్థాయి ఉద్యోగుల తొలగింపు ద్వారా టీసీఎస్‌కి ఏటా 300 నుంచి 400 మిలియన్ డాలర్లు అంటే రూ.2,400 కోట్ల నుంచి రూ. 3,600 కోట్ల వరకూ ఆదా అవుతుందని ఓ సీనియర్ ఐటీ విశ్లేషకుడు అంచనా వేశారు. టీసీఎస్‌లో 12వేల మంది ఔట్.. కృత్రిమ మేధ రాకతో ప్రయోజనాల సంగతి ఏమోగానీ ఐటీ ఉద్యోగాలపై దీని ప్రభావం మాత్రం గట్టిగానే పడుతోంది. ఏఐ పుణ్యమాని ఇప్పటికే పలు దిగ్గజ సంస్థలు తమ స్టాఫ్‌ను తగ్గించుకుంటున్నాయి. భారత్‌లోని అతి పెద్ద ఐటీ సర్వీసుల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) తన మొత్తం ఉద్యోగులలో 2 శాతం మందికి ఉద్వాసన పలకనున్నది. వచ్చే ఏడాది కల్లా దాదాపు 12,200 మంది ఉద్యోగులపై దీని ప్రభావం పడనున్నది. మధ్య స్థాయి, సీనియర్ స్థాయి ఉద్యోగులపై అధికంగా వేటు పడే అవకాశం ఉంది. ఈ విషయాన్ని టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కే కృతివేశన్ మనీకంట్రోల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.అత్యంత వేగంగా సాంకేతిక మార్పులు చోటుచేసుకుంటున్న వేళ భవిష్యత్తు అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సంసిద్ధంగా ఉండక తప్పదని ఆయన అన్నారు. ఉద్యోగుల సంఖ్యను ఎందుకు తగ్గించవలసి వస్తోందన్న ప్రశ్నకు యావత్ ఐటీ పరిశ్రమ మార్పు చెందుతున్నదని, పని చేసే విధానాలు మారుతున్నాయని ఆయన బదులిచ్చారు. 2025 జూన్ నాటికి ప్రపంచవ్యాప్తంగా 6.13 లక్షల మంది టీసీఎస్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 2 శాతం మంది అంటే సుమారు 12,200 మంది ఉంటారు. లేఆఫ్‌లు జూనియర్ లెవెల్‌లో కాకుండా మిడిల్ మేనేజ్‌మెంట్, సీనియర్ లెవెల్స్‌లో అధికంగా ఉంటాయని కృతివాసన్ స్పష్టం చేశారు.

బుధవారం, జూలై 30, 2025

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# ఫ్యాషన్ ఈవెంట్‌లో తళుక్కుమన్న జాన్వీ కపూర్ పింక్ లెహెంగాలో ర్యాంప్ వాక్

బాలీవుడ్ యంగ్ బ్యూటీ, అలనాటి అందాల తార శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్ ఓ ఫ్యాషన్ ఈవెంట్‌లో తళుక్కున మెరిశారు. న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో జరుగుతున్న హ్యుందాయ్ ఇండియా కౌచర్ వీక్ 2025 2025)లో సందడి చేశారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ జయంతి రెడ్డి రూపొందించిన పింక్ కలర్ లెహంగాలో ర్యాంప్ వాక్ చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను జాన్వీ ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి.ఇక సినిమాల విషయానికొస్తే ఎన్టీఆర్ సినిమా దేవరతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన జాన్వీ కపూర్.. ప్రస్తుతం రామ్ చరణ్‌తో కలిసి పెద్ది చిత్రంలో నటిస్తుంది. ఈ సినిమాకు బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్నారు. దీంతో పాటు హోమ్‌బౌండ్, సన్నీ సంస్కారి కి తులసి కుమారి, పరమ్ సుందరి లాంటి బాలీవుడ్ సినిమాల్లో కనిపించనుంది




# మహావతార్ నరసింహ




అశ్విన్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మహావతార్ నరసింహ'. క్లీమ్ ప్రొడక్షన్స్ పతాకంపై శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్, చైతన్య దేశాయ్ యానిమేషన్‌లో ఈ మూవీ నిర్మించారు. ఇదే బ్యానర్‌లో దశావతారాలకు సంబంధించిన కథలన్నీ సినిమాలుగా తెరకెక్కుతున్నాయి. అందులో భాగంగా నరసింహావతారంతో 'మహావతార్ నరసింహ' రూపొందింది. 'కేజీఎఫ్', 'సలార్', 'కాంతార' వంటి భారీ చిత్రాలను నిర్మించిన హొంబలే ఫిల్మ్స్ సమర్పణలో ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. హిందీలో రూపొందిన ఈ సినిమా కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో 2డీ, త్రీడీ వెర్షన్‌లో విడుదల చేశారు. సుప్రసిద్ధమైన భక్త ప్రహ్లాదుడి కథతో ఈ చిత్రం రూపొందింది.కథ: కశ్యప మహర్షి, దితి దంపతులకు హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు ఇద్దరు పుత్రులు. వీరిద్దరూ రాక్షస గుణాలతో పుడతారు. శ్రీమహా విష్ణువును శత్రువులుగా చూస్తారు. భూదేవిని సముద్ర గర్భంలో బంధించిన హిరణ్యాక్షుడిని వరహారూపంలో ఉన్న విష్ణువు వధిస్తాడు. అది తట్టుకోలేని హిరణ్యకశిపుడు ఘోరమైన తపస్సు చేసి బ్రహ్మ దేవుడి నుంచి వరాన్ని పొందుతాడు. ముల్లోకాల్లో తనను ఎవరూ ఎదిరించలేని బలం పొంది, తానే భగవంతుడినని ప్రకటించుకుంటాడు. శ్రీమహా విష్ణువును అంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంటాడు. అయితే హిరణ్యకశిపుడి కుమారుడు ప్రహ్లాదుడు పరమ విష్ణు భక్తుడు. అది తెలిసి తండ్రైన హిరణ్యకశిపుడు తన కొడుకును సైతం చంపడానికి వెనకాడడు. ప్రహ్లాదుని చంపడానికి అతనేం చేశాడు. ఐదేళ్ల వయసున్న చిన్నారి భక్తుడిని విష్ణువు ఎలా కాపాడాడు. హిరణ్యకశిపుని నరసింహ అవతారంలో ఉన్న (సగం మనిషి, సగం సింహం) ఎలా అంతం చేశాడు? అనేది కథ.అందరికీ తెలిసిన భక్త ప్రహ్లాదుని కథకు యానిమేషన్ రూపమే 'మహావతార్ నరసింహ'. ఈ తరానికి భక్త ప్రహ్లాదుడి గురించి తెలియజెప్పడానికి దర్శకుడు చేసిన ప్రయత్నం ఈ చిత్రం అనుకోవచ్చు. కానీ ఇందులో ఎమోషన్ మిస్ అయింది. కథ పరంగా దర్శకుడు బాగానే రాసుకున్నా.. కొన్ని చోట్ల ఎగ్జిక్యూట్ చేయడంలో కాస్త తడబడ్డారు. యానిమేషన్ వర్క్ విషయంలో కొన్ని చిన్న చిన్న లోపాలు ఉన్నా తదుపరి సీన్ ఎలివేషన్‌లో ఆ పొరపాట్లు కొట్టుకుపోతాయి. నరసింహస్వామి ఉగ్ర అవతారం ఎత్తిన క్షణం నుంచి ప్రేక్షకుడి చూపు తిప్పుకోనివ్వకుండా ఉండేలా యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించారు. చివరి అరగంట హిరణ్య కశిపుడితో నరసింహ అవతారంలో ఉన్న విష్ణువు చేసే పోరాటం, అతని వధ అబ్బురపరిచేలా ఉన్నాయి. అంతం చేయడమే లక్ష్యంగా అతని మరణానికి భూమి, ఆకాశం, నీరు, నిప్పు, దేవతలు, జంతువులు, పగలు, రాత్రి ఇవేమీ కారణం కాకూడదని వరం పొందుతాడు. ఇవేమీ కారణం కాదని నరసింహస్వామి చెప్పి వధించే సన్నివేశం చూస్తే గూస్ బంప్స్ రావడం పక్కా. వీక్షకులతో విజిల్స్ వేయిస్తుంది. ఆ యాక్షన్ ఎపిసోడ్స్ సినిమాను మరో లెవల్‌కి తీసుకెళ్లాయి. పిల్లలు అయితే ఈ సన్నివేశాలను విపరీతంగా ఇష్టపడతారు. సామ్ సి.ఎస్ బ్యాగ్రౌండ్ స్కోర్ పూనకాలు తెప్పిస్తుంది. పాటల విషయంలో కాస్త జాగ్రత్త తీసుకోవాల్సింది. ప్రహ్లాదుడు చెప్పిన శ్లోకాలు, పాడిన పాటలు బాల గాయకులచే పాడించి ఉంటే ఇంకొంచెం కనెక్టివిటీ పెరిగేది. నిర్మాణ పరంగా సినిమా చాలా రిచ్‌గా ఉంది. తెలుగు అనువాదం కూడా బాగా కుదిరింది. అయితే ఈ తరం పిల్లలకు ప్రహ్లాదుని కథ చెప్పాలనుకున్న దర్శకుడు అశ్విన్ కుమార్ ఆలోచనను అభినందించాలి.ట్యాగ్‌లైన్: యానిమేటెడ్ నరసింహరేటింగ్: 2.75/5

# మీరు నాకు దేవుడిచ్చిన వరమబ్బా అభిమానులపై ప్రేమ కురిపించిన హీరో విజయ్ దేవరకొండ



విజయ్ దేవరకొండ మరోసారి తన అభిమానుల పట్ల తన గాఢమైన ప్రేమను వ్యక్తం చేశారు. ఇండస్ట్రీకి వచ్చినప్పటి నుంచి తనపై అభిమానులు చూపిస్తున్న అపారమైన ఆదరణను తానెప్పటికీ మర్చిపోలేనని చెప్పారు. "మీరు నాకు దేవుడిచ్చిన వరం" అంటూ ఈ సందర్భంగా విజయ్ అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యారు. గత కొంతకాలంగా తన సినిమాలు పెద్దగా సక్సెస్ కాకపోయినా అభిమానులు మాత్రం ఎప్పటిలాగే అండగా నిలిచారని, ప్రతి సినిమా టైంలోనూ తన విజయం కోసం వారు ఎంతగానో కోరుకుంటున్నారనీ విజయ్ అభిమానం గల గర్వంగా చెప్పారు. ఇటీవల తిరుపతిలో విడుదలైన ట్రైలర్‌కి వచ్చిన స్పందన గురించి మాట్లాడుతూ "ట్రైలర్ చూసిన తర్వాత చాలా మంది అభిమా నులు 'ఈసారి మన హిట్ కొడుతున్నాం', 'ఈసారి మన సినిమా టాప్ లో ఉంది', 'మనకే హిట్ గ్యారెంటీ' అంటూ కామెంట్లు చేశారు. ఏ ఒక్కరు కూడా 'నీకు హిట్ వస్తుంది' అనలేదు. అందరూ 'మనకే' అనడం చూసి నా హృదయం ఉప్పొంగిపోయింది," అని తెలిపారు ఈ ప్రేమే తనకు అసలైన బలం అని చెప్పిన విజయ్, "మీరు నన్ను మీ వాడిని చేసుకున్నారు అందుకే ఇలాంటి మాటలు వింటున్నాను," అని ఎమోషనల్ అవుతూ చెప్పారు. ఈ ప్రీ-రిలీజ్ ఈవెంట్ మొత్తం తన సినిమా కంటే ఎక్కువగా అభిమానుల గురించే మాట్లాడారు ఆయన.'మరో రెండు రోజుల్లో జులై 31న మిమ్మల్ని థియేటర్లలో కలవబోతున్నాం. మనసులో కొంచెం భయం ఉంది, అదే సమయంలో ఓ మంచి సినిమా చేశామనే సంతృప్తి ఉంది. 'కింగ్‌డమ్' అవుట్ పుట్ పట్ల టీమ్ అందరం సంతోషంగా ఉన్నాము. ఈరోజు నేను అభిమానుల గురించి ప్రత్యేకంగా మాట్లాడాలి అనుకుంటున్నాను. మీరు నాకు దేవుడిచ్చిన వరం. సినిమాలు హిట్ అయినా, ఫ్లాప్ అయినా.. అదే ప్రేమ, అదే నమ్మకం నాపై చూపిస్తున్నారు. ఈ రోజు ఫ్యాన్ మీట్ లో దాదాపు రెండు వేల మందిని కలిశాను. అందులో ఎక్కువమంది నాతో చెప్పిన మాట 'అన్నా ఈసారి మనం హిట్ కొడుతున్నాం'. నన్ను మీ వాడిని చేసేసుకున్నారు. నా విజ యాన్ని చూడాలని మీరు కోరుకుంటున్నాను. సినిమా వల్లే మీకు నేను పరిచయం అయ్యాను. మీ కోసం ప్రతి సినిమాకి ప్రాణం పెట్టి పనిచే స్తాను. మీరందరూ నా నుంచి కోరుకుంటున్న హిట్ 'కింగ్‌డమ్'తో రాబోతుంది. ఇది విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' కాదు.. గౌతమ్ తిన్ననూరి 'కింగ్‌డమ్'. ఈ కథ ఆలోచన పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఈ సినిమా పని మీదే ఉన్నాడు గౌతమ్. ఒక పర్ఫెక్ట్ సినిమా ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఇప్పటికీ వర్క్ చేస్తున్నాడు. అందుకే ఈ వేడుకకి రాలేకపోయాడు. ఆ తర్వాత ఇది అనిరుధ్ రవిచందర్ 'కింగ్‌డమ్'. పాటలు ఇప్పటికే విన్నాము. నేపథ్యం సంగీతం కూడా అదిరిపోతుంది. నా సినిమాకి అనిరుధ్ సంగీతం అందిస్తే బాగు ంటుంది అనుకునేవాడిని. అది 'కింగ్‌డమ్'తో నెరవేరింది. తన సంగీతంతో సినిమాని మరో స్థాయికి తీసుకెళ్ళాడు. ఆ తర్వాత ఇది ఎడిటర్ నవీన్ నూలి 'కింగ్‌డమ్'. నాలో ఒక ఫైర్ ఉంటుంది. మా వాళ్లకి బెస్ట్ ఇవ్వాలని కోరిక ఉంటుంది. ఈసారి నాకు ఇంత ఫైర్ ఉన్న టీమ్ దొరికింది. అలాగే ఇది నాగవంశీ 'కింగ్‌డమ్'. ఎంతో రిస్క్ చేసి ఈ సినిమా చేశారు. బెస్ట్ అవుట్ పుట్ రావడం కోసం.. ఎక్కడా రాజీ పడకుండా మేము ఏది అడిగితే అది ఇచ్చారు. భాగ్యశ్రీ బోర్సే కొత్తమ్మాయి. కానీ, సినిమా కోసం చాలా కష్టపడుతుంది. రాబోయే రోజుల్లో పెద్ద స్థాయికి వెళ్తుంది. నా సోదరులు సత్యదేవ్, వెంకటేష్ ఇద్దరూ చాలా మంచి నటులు. ఈ సినిమాలో అన్న పాత్ర చాలా ముఖ్యమైనది. ఆ పాత్రలో సరైన నటుడు చేస్తేనే సినిమా పండుతుంది. అలాంటి పాత్ర ఎవరు చేస్తే బాగుంటుందని చాలా చర్చించిన తర్వాత.. సత్యదేవ్ ని ఎంపిక చేశాడు గౌతమ్. షూటింగ్ సమయంలో సత్యదేవ్ నిజంగానే నాకు సోదరుడిలా అనిపించాడు. సత్యదేవ్ అద్భుతమైన నటుడు మాత్రమే కాదు, మంచి మనిషి కూడా. అలాగే వెంకటేష్ అద్భుతంగా నటించాడు. భవిష్యత్ లో బిగ్ స్టార్ కావాలని కోరుకుంటున్నాను. కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన, ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ కొల్లా, సినిమాటోగ్రాఫర్స్ జోమోన్, గిరీష్.. ఇలా ప్రతి ఒక్కరూ సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేశారు. రెండు రోజుల్లో 'కింగ్‌డమ్' మీ ముందుకు రాబోతుంది. ఈ సినిమా మీకు నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని విజయ్ చెప్పుకొచ్చారు.


# పరుగులు పెడుతున్న ఉస్తాద్ భగత్ సింగ్ అదిరిపోయే పోస్టర్‌తో క్రేజీ అప్‌డేట్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. గతంలో ఈ కాంబినేషన్‌లో వచ్చిన 'గబ్బర్ సింగ్' బ్లాక్‌బస్టర్ కావడంతో, ఇప్పుడు ఈ ప్రాజెక్టుపై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్, రాజకీయాలతో ఎంత బిజీగా ఉన్నా, ఈ సినిమా షూటింగ్‌కి తగినంత సమయం కేటాయిస్తున్నారు. అంకితభావంతో సినిమాపై పూర్తి దృష్టిపెడుతూ షూటింగ్‌ను వేగవంతం చేస్తున్నారు. ఇటీవల చిత్ర బృందం అత్యంత కీలకమైన క్లైమాక్స్ సీన్ షూటింగ్‌ను పూర్తిచేసింది. దర్శకుడు హరీష్ శంకర్, ఈ సన్నివేశాన్ని భావోద్వేగాలు, యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కించినట్టు సమాచారం. ఈ పవర్‌ఫుల్ సీక్వెన్స్‌ని ప్రఖ్యాత కొరియోగ్రాఫర్ నబకాంత మాస్టర్ కంపోజ్ చేశారు. పవన్ కళ్యాణ్ పవర్ ఫుల్ నటనతో ఈ సన్నివేశం ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేయనుందని చిత్ర బృందం భావిస్తోంది. చిత్రీకరణ అనంతరం పవన్ కళ్యాణ్, యాక్షన్ బృందానికి ఫొటోలు షేర్ చేస్తూ.. క్లైమాక్స్ సీన్ గొప్పగా రూపుదిద్దినందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సీక్వెన్స్ అద్భుతంగా రావడం పట్ల పవన్ కళ్యాణ్ సైతం హర్షం వ్యక్తం చేశారు. షూటింగ్ పూర్తి అయిన తర్వాత




నబకాంత టీమ్ లోని అందరికీ ఆయన ఫోటోగ్రాఫ్స్ ఇచ్చారని చిత్రబృందం స్పష్టం చేసింది.. 'గబ్బర్ సింగ్' లాంటి సూపర్ డూపర్ హిట్ సినిమా తర్వాత పవన్ కళ్యాణ్, హరీశ్ శంకర్ కాంబోలో రాబోతున్న ఈ సినిమా మీద అంచనాలు భారీగానే ఉన్నాయి.ఇక ఈ చిత్రంలో శ్రీలీల , చిత్రీకరణ అనంతరం పవన్ కళ్యాణ్ రాశీఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇందులో ఇతర ప్రధాన పాత్రలను పార్థిబన్, కె. ఎస్. రవికుమార్, రాంకీ, నవాబ్ షా, 'కేజీఎఫ్' ఫేమ్ అవినాష్, నాగ మహేష్, 'టెంపర్' వంశీ తదితరులు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని మరియు వై. రవి శంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. మాస్, యాక్షన్ ప్రియుల్ని ఆకట్టుకునే విధంగా సినిమా రూపుదిద్దుకుంటోందని నిర్మాతలు హామీ ఇస్తున్నారు. చిత్రీకరణ అనంతరం పవన్ కళ్యాణ్‌రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. పవన్ కళ్యాణ్ స్టైల్, హరీష్ శంకర్ డైరెక్షన్, దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ మరోసారి మిరాకల్ చేయబోతుందనే నమ్మకంతో అభిమానులు ఉన్నారు.

# మెగాస్టార్ లైనప్ చూస్తుంటే మెంటలొచ్చేస్తుందిగా



ఫ్లాప్ లు వచ్చాయి.. పక్కకు వెళ్లిపోతాడనుకున్నారు. వయస్సు అవుతుంది.. ఇంకెందుకులే సినిమాలు అని అనుకున్నారు. కనీసం సీనియర్ డైరెక్టర్లను అయినా లైన్లో పెట్టి అడపా దడపా కనిపిస్తాడు అని అనుకున్నారు. కానీ, అదే పౌరుషంతో..మంచి మంచి కథలను పట్టి.. కుర్ర డైరెక్టర్లను లైన్లో పెట్టి.. కుర్ర హీరోలకు చెమటలు పట్టిస్తున్నాడు.. మెగాస్టార్ చిరంజీవి . ఒకటి కాదు రెండు కాదు నాలుగు సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి.. ఇండస్ట్రీలో మెగా జోరు చూపిస్తున్నాడు.భోళా శంకర్ లాంటి భారీ పరాజయం తరువాతచిరు కొద్దిగా కృంగిన మాట వాస్తవమే కానీ, అక్కడితో ఆగిపోలేదు. వెంటనే వశిష్ఠతో విశ్వంభర మొదలుపెట్టాడు. భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ సినిమా ఎట్టకేలకు ఈ ఏడాది రిలీజ్ అవుతుందని వార్తలు వస్తున్నాయి. ఇంకా ఈ సినిమా ఫినిష్ అవ్వలేదు.. అప్పుడే అనిల్ రావిపూడితో ఇంకో సినిమాను పట్టాలెక్కించాడు చిరు. అసలు ఇది కొద్దిగా గ్యాప్ కూడా లేకుండా మూడు షెడ్యూల్స్ ను ముంగించేశాడు.అయ్యబాబోయ్ ఇదెక్కడి విడ్డూరం అమ్మా.. ఈ వయస్సులో రెండు సినిమాలు ఏకధాటిగా షూటింగ్స్ చేస్తున్నాడు అని అందరూ నోర్లు నొక్కుకోవడం మొదలుపెట్టారు. సరే ఈ రెండు సినిమాలే కదా అనుకుంటే పొరపాటే. ఈ రెండు సినిమాలు ఇంకా షూటింగ్ లో ఉండగానే చిరు.. మరో రెండు సినిమాలను లైన్లో పెట్టి షాక్ ల మీద షాకులు ఇచ్చాడు. ఇప్పటికే శ్రీకాంత్ ఓదెలతో ఒక సినిమాను అధికారికంగా ప్రకటించిన చిరు.. తనకు వాల్తేరు వీరయ్య లాంటి హిట్ ను ఇచ్చిన బాబీ కొల్లితో మరో సినిమా చేయబోతున్నాడని వార్తలు వినిపిస్తున్నాయి.అలా నలుగురు కుర్ర డైరెక్టర్స్ తో చిరు జోరు పెంచేశాడు. త్వరలోనే మిగిలిన రెండు సినిమాలు కూడా పట్టాలెక్కించే పనిలో ఉన్నాడట చిరు. ఎంత కుర్ర డైరెక్టర్స్ అయినా.. అందరూ ఇండస్ట్రీలకు హిట్స్ ఇచ్చినవారే. అందుకే ఈ సినిమాపై అంచనాలు ఆకాశానికి తాకుతున్నాయి. మరి ఈ సినిమాలతో చిరు ఎలాంటి విజయాలను అందుకుంటాడో చూడాలి.

# మెగా కోడలి మూవీ టీజర్




వరుణ్ తేజ్‌ని వివాహం చేసుకొని మెగా కోడలిగా మారింది లావణ్య త్రిపాఠి. 2022లో నటించిన హ్యాపీ బర్త్ డే సినిమా తర్వాత లావణ్య త్రిపాఠి సతీ లీలావతి అనే చిత్రంతో ప్రేక్షకులని పలకరించేందుకు సిద్ధమైంది. ఈ చిత్రానికి తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా సతీ లీలావతి టీజర్ విడుదల చేశారు. లవ్, డ్రామా ఎలిమెంట్స్‌తో సాగే ఫన్నీ రైడ్ మాదిరిగా టీజర్ ఉంది. టీజర్ చూస్తుంటే చిత్రాన్ని పురుషులు కూడా గృహ హింసకు బలవుతారనే పాయింట్ చుట్టూ తెరకెక్కించినట్టు అర్థమవుతుంది. ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి కొణిదెల ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఆమెకు జంటగా మలయాళ హీరో దేవ్ మోహన్ కనిపించనున్నారు. తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని దుర్గాదేవి పిక్చర్స్ పతాకంపై నాగమోహన్ నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ దీనిని సమర్పిస్తోంది.పెళ్లి వేడుకల దృశ్యాలతో టీజర్ ప్రారంభం కాగా , ఆ తర్వాత ఆ దంపతుల మధ్య ఏర్పడే విభేదాలను చూపించారు. "నాకు ఎందుకో హ్యాపీగా లేనప్పుడు%ొ% మనం విడిపోవడమే కరెక్ట్ అనిపిస్తుంది" అంటూ దేవ్ మోహన్ డైలాగ్ ప్రేక్షకులను ఆలోచనలో పడేస్తుంది. అతడిని కుర్చీలో కట్టేసిన సీన్, "లీలా%ొ% నన్ను కొడతావా?" అన్న ప్రశ్నకు "ఏం డౌటా?" అంటూ లావణ్య ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్, కామెడీ టచ్ తో వినోదాన్ని కలిగిస్తుంది. ఇందులో వీటీవీ గణేష్, సప్తగిరి, మొట్ట రాజేంద్రన్ లాంటి నటులు హాస్యాన్ని మేళవించనున్నారు.'భార్యా-భర్తల మధ్య నడిచే మనస్పర్థలు, అనుబంధం, ఆవేశం, వినోదం, భావోద్వేగాలు%ొ% అన్ని కలగలిసిన మిశ్రమమే ఈ చిత్రం' అని మేకర్స్ చెబుత న్నారు. ఇది పూర్తిగా ఆధునిక దృక్కోణంలో తీసిన ఫీల్ గుడ్ ఎంటర్టైనర్గా ఉండనుందని తెలుస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. త్వరలో థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతున్న 'సతీ లీలావతి' ప్రేక్షకుల్లో ఆసక్తిని రేపుతోంది. కొంతకాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురు చూస్తున్న లావణ్య త్రిపాఠి సతీలీలావతిగా గ్రాం డ్ కమ్‌బ్యాక్ ఇవ్వనుందని అర్థమవుతుం ది. ఈ చిత్రానికి మిక్కీ జె.మేయర్ సంగీతం అందిస్తున్నాడు.


Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com